ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 13.03.2026 | సంపుటి :12 సంచిక : 233 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# యుద్ధ విరమణకు ఇరాన్ షరతులు

- ఇరాన్‌కు యుద్ధ నష్టపరిహారం చెల్లించాలి
- చట్టబద్ధమైన హక్కుల్ని గుర్తించాలి
- భవిష్యత్తులో దాడులు చేయబోమని అంతర్జాతీయ హామీలివ్వాలి

- ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు
- యుద్ధం కొనసాగితే భారత్‌కు తీవ్ర నష్టమే..
- జీడీపీ వృద్ధి రేటు 0.25శాతం తగ్గే ప్రమాదం

టెహ్రాన్, మార్చి 12 (జనంసాక్షి) : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుతున్న వేళ, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. అమెరికా–ఇజ్రాయెల్ దళాలతో సాగుతున్న యుద్ధానికి ముగింపు పలకాలంటే మూడు కీలక షరతులను తెరపైకి తెచ్చారు. ఈ డిమాండ్లకు అంగీకరిస్తేనే ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిని తక్షణమే తెరుస్తామని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ మేరకు పెజెష్కియాన్ తన సోషల్ మీడియా వేదికగా అంతర్జాతీయ సమాజానికి ఇరాన్ పక్షాన ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారు.'పశ్చిమాసియాలో ఇరాన్ శాంతి నెలకొల్పేందుకు కట్టుబడి ఉంది. పాకిస్థాన్, రష్యా నేతలతో కూడా ఇదే విషయాన్ని చెప్పాను. అమెరికా ప్రారంభించిన ఈ యుద్ధాన్ని ముగించేందుకు మూడు షరతులు అంగీకరించాలి. ఇరాన్ చట్టబద్ధ మిగతా 2లో..

### 3 ప్రధాన షరతులు ఇవే:

**సార్వభౌమాధికార గుర్తింపు :** అంతర్జాతీయ వేదికలపై ఇరాన్ సార్వభౌమాధికారాన్ని, దాని చట్టబద్ధమైన హక్కులను అమెరికా, ఇజ్రాయెల్ గుర్తించాలి.

**భారీ నష్టపరిహారం :** గత 13 రోజులుగా సాగుతున్న దాడుల వల్ల జరిగిన ప్రాణ, ఆస్తి నష్టానికిగానూ అమెరికా, ఇజ్రాయెల్ భారీగా పరిహారం చెల్లించాలి.

**అంతర్జాతీయ హామీ :** భవిష్యత్తులో ఇరాన్‌పై ఎలాంటి సైనిక దాడులు జరగవని అంతర్జాతీయ సమాజం నుంచి గట్టి భరోసా లభించాలి



# 16 నుంచి ఒంటిపూట బడులు

**ఉత్తర్వులు జారీచేసిన విద్యాశాఖ**

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు మార్చి 16 నుంచి ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్లు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి రోజూ ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం మిగతా 2లో..



# మానవ విలువలతో వైద్యం చేయాలి

వైద్యం యాంత్రికంగా ఉండొద్దు: ముఖ్యమంత్రి రేవంత్

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కేవలం భవన నిర్మాణంతోనే సాధ్యం కాదు, నాణ్యమైన విద్య, వైద్యం సామాన్యుడికి చేరినప్పుడే అసలైన ప్రగతి అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 'వైద్యం యాంత్రికంగా ఉండకూడదు.. అది మానవత్వంతో కూడిన సేవగా ఉండాలి' అనే నినాదంతో కాంగ్రెస్ సర్కార్ కీలక అడుగులు వేస్తోందని తెలిపారు. హైదరాబాద్ నగరం నేడు ప్రపంచ పటంలో నిలవడానికి గత పాలకులు ఎంతో కృషి చేశారు అని అన్నారు. హైదరాబాద్‌లో మెడికవర్ ప్రైవేట్ హాస్పిటల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ' నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి, పీవీ నరసింహారావుల సరళీకరణ విధానాలు మిగతా 2లో..

## నెట్‌ఫ్లిక్స్‌ను హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నాం

- ఫ్యూచర్‌సిటిలో ఏర్పాటుకు భూమి కేటాయిస్తాం
- ఐలైన్ స్టూడియోస్ కార్యాలయాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో..



# ప్రతీకారం తీర్చుకుంటాం

- హర్మూజ్ జలసంధి మూసివేత కొనసాగుతుంది
- గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై దాడులు కొనసాగుతాయి
- కాబట్టి తక్షణమే వాటిని తక్షణమే మూసివేయాలి
- తొలిసారి స్పందించిన ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా

టెహ్రాన్(జనంసాక్షి):అమెరికా– ఇజ్రాయెల్ దేశాలతో భీకర యుద్ధం కొనసాగుతున్న వేళ ఇరాన్ నూతన సుప్రీం లీడర్ ఆయతుల్లా మొజ్తాబా ఖమేనీ తొలిసారి స్పందించారు. శత్రువులపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు హర్మూజ్ జలసంధి మూసివేత కొనసాగుతుందన్నారు. పొరుగున ఉన్న గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై దాడులు కొనసాగుతాయని, వాటిని తక్షణమే మూసివేయాలని హెచ్చరించారు. మినాబ్ పాఠశాలపై దాడి సహా ఆయా ఘటనలపై ప్రతీకారం తీర్చుకుంటామని స్పష్టం చేశారు. ఈ మేరకు సుప్రీం లీడర్ ప్రకటనను అధికారిక మీడియాలో ప్రసారం చేశారు. అయితే, యుద్ధం ప్రారంభంలో మొజ్తాబా ఖమేనీ గాయపడినట్లు ఇజ్రాయెల్ నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి.పొరుగు దేశాలతో స్నేహాన్ని ఇరాన్ మిగతా 2లో..

# హర్మ్యూజ్.. భారత్‌కు రైట్ రైట్



జలసంధి గుండా భారత పతాక నౌకలు వెళ్లొచ్చు

ప్రయాణించేందుకు ఇరాన్ అనుమతి

- టెహ్రాన్ నిర్ణయంతో భారత్‌కు భారీ ఊరట
- యుద్ధ సంక్షోభంలో మనకు తొలి విజయం
- జలసంధి నుంచి క్షేమంగా ముంబై తీరం చేరుకున్నషెన్‌లాంగ్
- ఇంధన భద్రతపై ఇరాన్‌తో చర్చించాం
- విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్

2లో..

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు

# ముగింపు

### స్పీకర్ నిర్ణయంతో ఏకీభవించిన సుప్రీం

### తదుపరి విచారణ అవసరం లేదని వ్యాఖ్య



'న్యాయ వ్యవస్థలో అవినీతి' పాఠ్యాంశం వ్యవహారం

## కారకులను దూరం పెట్టండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించించిన సుప్రీం

2లో..

న్యూఢిల్లీ(జనంసాక్షి):తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణ ఎట్టకేలకు ముగిసింది. రాష్ట్ర రాజకీయాల్లో కొన్నిరోజులుగా తీవ్ర కలకలం రేపిన ఈ కేసు విచారణను గురువారం నాడు సుప్రీంకోర్టు ముగించింది. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని చెప్పినా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ గురువారం విచారణకు రాగా విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై సుదీర్ఘ విచారణ మిగతా 2లో..

# ఐదు నిమిషాల ఆలస్యానికి అనుమతి

- రేపటి నుంచి పదోతరగతి పరీక్షలు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- సకాలంలో సెంటర్లకు చేరుకోవాలని సూచన

హైదరాబాద్(జనంసాక్షి):పదో తరగతి వార్షిక పరీక్షలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికారులు సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు శనివారం ప్రారంభమై.. ఏప్రిల్ 16వ తేదీ వరకు జరుగుతాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభం అవుతాయి. మిగతా 2లో..



# చమురు కొరత లేదు

- తగినన్ని క్రూడాయిల్ నిల్వలు ఉన్నాయి
- రిఫనరీలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి
- ఎలాంటి సంక్షోభాన్ని అయినా ఎదుర్కొంటాం
- లోక్‌సభలో కేంద్రమంత్రి హర్దీప్ పురి సింగ్ ప్రకటన



న్యూఢిల్లీ(జనంసాక్షి): పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ దేశంలో ఇంధన భయాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో గురువారం ఎల్పీజీ అంశంపై లోక్‌సభలో వాడీవేడి చర్చ జరిగింది. చర్చలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ఫైల్ల ప్రస్తావన తీసుకురావడంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. అయితే ఇంధన కొరతపై కేంద్రమంత్రి నిరసనల మధ్యే తన ప్రకటన చేశారు. భారత్‌లో ఇంధన కొరత లేదని, తగినన్ని క్రూడాయిల్ నిల్వలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు. పెట్రోల్, డీజిల్, విమాన ఇంధన సరఫరాలో ఎలాంటి కొరత లేదని చెప్పారు. మిగతా 9లో..

# అమెరికా కొనమన్నచోట చమురెలాకొంటారు?

### మన విదేశాంగ విధానాన్ని మోదీ అమెరికాకు తాకట్టు పెట్టారు

- ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో దొరికిపోవడంతోనే అమెరికాకు దాసోహం
- లోక్‌సభలో రాహుల్ గాంధీ ఫైర్
- గ్యాస్ కొరతపై విపక్షాల ఆందోళన
- పార్లమెంటు బయట విపక్ష ఎంపిల నిరసన ప్రదర్శన



న్యూఢిల్లీ(జనంసాక్షి): భారత విదేశాంగ విధానన్ని మోదీ అమెరికాకు తకట్టు పెట్టారని విపక్షనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. రష్యా నుంచి చమురు దిగుమతులకు అమెరికా అడ్డంకులేంటని ప్రశ్నించారు. మనం చమురు ఎక్కడ కొనాలో అమెరికా నిర్ణయిస్తుందంటే మన విదేశాంగ విధానం తాకట్టు పెట్టినట్లేనని అన్నారు. హర్మూజ్ జలసంధి నుంచి పెద్ద ఎత్తున దిగుమతులు జరగాల్సి ఉంది. యుద్ధం కారణంగా దిగుమతులు ఆగిపోయాయి. ఇది ఆరంభం మాత్రమే. గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది. మనం ఎవరి నుంచి చమురు కొనాలో అమెరికా నిర్ణయిస్తోంది. రష్యా నుంచి చమురు కొనాలో..?వద్దో..? మనకు మనం నిర్ణయించుకోవాలి. రష్యా నుంచి చమురు కొనుగోలుపై అమెరికా జోక్యం ఎందుకు..? భారత్ వంటి పెద్ద దేశానికి మరోదేశం అనుమతి ఎందుకు..? ఇలా ఎందుకు జరుగుతోందా అని ఆలోచించాను. నా ప్రశ్నకు సమాధానం ఎప్‌స్టీన్ ఫైల్స్ రూపంలో దొరికింది. ఎప్‌స్టీన్ ఫైళ్ల ప్రభావం ఎల్పీజీ దిగుమతులపై పడినట్లు ఉంది. ఎప్‌స్టీన్‌తో సంబంధాలను పెట్రోలియం మంత్రే అంగీకరించారని రాహుల్ వ్యాఖ్యలు చేశారు. ఇవి దుమారం రేపాయి. దీంతో స్పీకర్ ఓం బిర్లా స్పందించారు. నోటీసు మిగతా 2లో..

## గ్యాస్ కొరత నివారణకు చమురు కంపెనీలతో

# చర్చిస్తాం

గృహవసరాల సిలిండర్లకు ఎలాంటి కొరత లేదు

మంత్రి ఉత్తమ్ ఉమార్ రెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి): తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరతవాస్తవమేనని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యం సరఫరా అవుతున్న వంట గ్యాస్ సిలిండర్లలో దాదాపు 86 శాతం డొమెస్టిక్ కనెక్షన్లేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే మిగిలిన 14 శాతం మాత్రమే కమర్షియల్ అని వివరించారు. ప్రస్తుతానికి డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి కొరత లేదని తమ శాఖ అధికారులు వెల్లడించారని చెప్పారు. కానీ కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం మిగతా 2లో..

## హైదరాబాద్‌కు భవిష్యత్ రవాణా వ్యవస్థకు

# బృహత్తర ప్రణాళిక

- 556 కిలోమీటర్ల మెట్రో నెట్‌వర్క్.. మూసీపై 29 వంతెనలు
- నగరంలో సమగ్ర రవాణా వ్యవస్థపై కీలక ప్రతిపాదనలు సిద్ధంచేసిన హెచ్ఎండీఏ

హైదరాబాద్(జనంసాక్షి):నగరంలో సమగ్ర రవాణా వ్యవస్థపై హెచ్ఎండీఏ కీలక ప్రణాళికను సిద్ధం చేసింది. 2050 నాటికి మెట్రో నెట్‌వర్క్‌ను 556.6 కిలోమీటర్లు, ఎంఎంటీఎస్ నెట్‌వర్క్‌ను 336.4 కిలోమీటర్లు, రోడ్ నెట్‌వర్క్‌ను 19,352 కిలోమీటర్లకు విస్తరించనున్నట్లు తెలిపింది. హైదరాబాద్‌లో 120 ఫుట్ ఓవర్ బ్రిడ్జలు, స్కైవాక్‌లకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. 34 ఆర్వోబీలు, 16 ఆర్‌యూబీలు, 8 ఎలివేటెడ్ రోడ్లకు ప్రతిపాదనలు తయారు చేసినట్లు చెప్పింది. మూసీ నదిపై 29 వంతెనలు నిర్మించనున్నట్లు పేర్కొంది. ప్రత్యేక బస్ లైన్ల కోసం 2050 నాటికి 48 కిలోమీటర్ల మేర రోడ్ కారిడార్లను గుర్తించినట్లు వివరించింది. ఏడు అంతర్రాష్ట్ర బస్సు, ట్రక్ టెర్మినల్స్ ఏర్పాటు చేస్తామని తెలిపింది. సమగ్ర రవాణా వ్యవస్థ ప్రణాళికకు రూ.4 లక్షల కోట్లు అవసరమని హెచ్ఎండీఏ అంచనా వేసింది.

# పీసీ ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలి

- కేసీఆర్, హరీశ్‌రావును ఇబ్బంది పెట్టడానికే ఏర్పాటు చేశారు
- హైకోర్టులో కేసీఆర్, హరీశ్‌రావు, స్మితా సబర్వాల్, ఎస్‌కే జోషి పిటిషన్లు

2లో..

## మహిళా భద్రత కోసం తెలంగాణ పోలీస్ చర్యలు

# అభినందనీయం

జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ విజయ రహట్కర్




హైదరాబాద్(జనంసాక్షి): మార్చి 12:తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ పలు చర్యలు చేపట్టిందని జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ విజయ రహట్కర్ అభినందించారు. ముఖ్యంగా ఇటీవల రాష్ట్ర పోలీస్ శాఖ మహిళ మద్దతు కోసం చేపడుతున్న వివరాలను తెలుసుకొని ప్రశంసించారు. మహిళల ఫిర్యాదులపై సత్వరమే స్పందిస్తూ, వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్యాయాలకు అడ్డుకట్ట వేయాలని ఆమె సూచించారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం మేడ్చల్ – మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన 'మహిళా జన సున్వాయి' (బహిరంగ విచారణ) కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వచ్చిన సుమారు 35 ఫిర్యాదులను ఆమె స్వయంగా పరిశీలించారు. ప్రధానంగా గృహహింస, వేధింపులు, కుటుంబ మిగతా 2లో..

# ఫరూక్ అబ్దుల్లాపై హత్యాయత్నం

- పాయింట్ బ్లాంక్ రేంజ్ నుంచి తుపాకీ కాల్చేందుకు నిందితుడి ప్రయత్నం
- భద్రతా సిబ్బంది అప్రమత్తతో త్రుటిలో తప్పించుకున్న మాజీ సీఎం

శ్రీనగర్(జనంసాక్షి): జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాపై హత్యాయత్నం జరిగింది. ఓ వివాహ వేడుకలో నిందితుడు ఆయనపై కాల్పులకు పాల్పడేందుకు ప్రయత్నించాడు. వెంటనే భద్రతా సిబ్బంది అప్రమత్తమవడంతో.. ఫరూక్ సురక్షితంగా బయటపడ్డారు. 20 ఏళ్లుగా తాను మిగతా 2లో..





# త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకం

- పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగం
- రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కి రూరల్ అగ్రి రీజియన్ పై దృష్టి
- ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్(జనంసాక్షి):2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడమే లక్ష్యంగా రాష్ట్రం ముందుకు పోతున్న క్రమంలో ఈ లక్ష్యసాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మొదట హోంశాఖ తదుపరి మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబుతో కలిసి పరిశ్రమలు, ఐటీ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద సంఖ్యలో పెట్టుబడిదారులు వస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతలు కీలకం అన్నారు. ఈ అంశంలో ఏ చిన్న పొరపాటుకు హోంశాఖ అధికారులు, సిబ్బంది అవకాశం ఇవ్వరాదని, ప్రతి కదలిక మీ కనుసన్నల్లో ఉండాలని సూచించారు. విధుల నిర్వహణ క్రమంలో హోంశాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ మిగతా 2లో..

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు ముగింపు

అనంతరం ఉన్నత న్యాయస్థానం తుది తీర్పు వెలువరించింది . ఈ కేసును జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించగా.. స్పీకర్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ ఇప్పటికే విచారణ జరిపి, తగిన నిర్ణయం తీసుకున్నారని ఆయన కోర్టుకు వివరించారు. దీంతో ఈ సమస్య సభాపతి కార్యాలయంలోనే ముగిసిందన్నారు. సింఘ్వీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. ఈ వ్యవహారంపై స్పీకర్ ఇప్పటికే తుది నిర్ణయం తీసుకున్నందున విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని భావించింది. దీంతో కోర్టు విచారణ ముగిసినట్లేనని వెల్లడించింది. స్పీకర్ ఆదేశాలను రెండు రోజుల్లో అధికారికంగా ప్రచురించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఆ తరువాత పిటిషనర్లకు కావాల్సిన డాక్యుమెంట్లను కూడా నాలుగు రోజుల్లో అందజేయాలని సూచించింది. దీంతో 10 మంది ఎమ్మెల్యేలకు సభాపతి క్లీన్ చిట్ ఇచ్చినట్లైంది. ఈ వ్యవహారంలో పదిమంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఊరట దక్కింది. అయితే పోరాడిన బిఆర్ఎస్‌కు మాత్రం న్యాయం దక్కలేదని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానించారు. స్పీకర్ తీర్పుపై ఇప్పటికే బిఆర్ఎస్ తన నిరసన తెలియచేసింది. స్పీకర్ తీర్పును సవాల్ చేస్తామన్న బిజెపికి కూడా ఈ తీర్పుతో ఇక అవకాశం లేనట్లుగానే భావించాలి.

## ఫరూక్ అబ్దుల్లాపై హత్యాయత్నం

ఫరూక్‌ను చంపాలనుకుంటున్నానని నిందితుడు పోలీసులతో పేర్కొన్నాడు. బుధవారం జమ్మూ శివార్లలోని హోటల్‌లో జరిగిన ఓ వివాహ వేడుకకు ఫరూక్ అబ్దుల్లా హాజరయ్యారు. ఆయనతో పాటు జమ్మూకశ్మీర్ డిప్యూటీ సీఎం సురీందర్ ఛౌదరీ కూడా ఉన్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి వెనక నుంచి ఫరూక్‌పై పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో తుపాకీతో కాల్చేందుకు ప్రయత్నించాడు. అక్కడ ఉన్నవారు వెంటనే అతడిని పట్టుకొని చితకబాదారు. దీనికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు కూడా తాజాగా వెలుగులోకి వచ్చాయి. నిందితుడు జమ్మూకి చెందిన 63 ఏళ్ల కమల్‌సింగ్ జమ్వాల్‌గా పోలీసులు గుర్తించారు. జమ్మూలో దుకాణాలు నడుపుతోన్న కమల్ విచారణ సమయంలో కీలక విషయాలు వెల్లడించాడు. గత 20 ఏళ్లుగా తాను ఫరూక్ అబ్దుల్లాను చంపాలనుకుంటున్నానని పేర్కొన్నాడు. ఇది తన వ్యక్తిగత అజెండాగా వెల్లడించాడు. కాల్పులకు ఉపయోగించిన తుపాకీకి లైసెన్స్ ఉన్నట్లు తెలిపాడు. ఘటన సమయంలో నిందితుడు మద్యం మత్తులో ఉన్నాడని పోలీసులు పేర్కొన్నారు. తుపాకీని స్వాధీనం చేసుకున్నామని, ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భద్రతా లోపం..

తన తండ్రిపై జరిగిన హత్యాయత్నంపై జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా స్పందించారు. లోడ్ చేసిన తుపాకీతో తన తండ్రిని ఓ వ్యక్తి కాల్చేందుకు ప్రయత్నించాడని పేర్కొన్నారు. అయితే, భద్రతా సిబ్బంది అప్రమత్తతతో అది విఫలమైందన్నారు. ఫరూక్‌కు జెడ్ ప్లస్ భద్రత ఉన్న విషయాన్ని ఒమర్ ప్రస్తావించారు. ఇంత భద్రత ఉన్నా.. నిందితుడు అంత దగ్గరగా ఎలా రాగలిగాడని ప్రశ్నించారు. ఇక, భద్రతా వైఫల్యం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకుందని ఉప ముఖ్యమంత్రి ఛౌదరి పేర్కొన్నారు.

## మహిళా భద్రత కోసం తెలంగాణ పోలీస్ చర్యలు అభినందనీయం

సభ్యులు వదిలివేయడం మరియు సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు బాధితుల నుంచి అందాయి. ప్రతి కేసును క్షుణ్ణంగా సమీక్షించిన చైర్‌పర్సన్, బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ సి ఆర్ బి 2023 గణాంకాల ఆధారంగా మహిళలపై పెరుగుతున్న నేరాల సరళిని ఆమె చర్చించారు. దర్యాప్తు ప్రక్రియలో జాప్యం లేకుండా చూస్తూ, పోష్ చట్టం మరియు గృహహింస నిరోధక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. మహిళల భద్రత, గౌరవం విషయంలో రాజీ పడకూడదని, పోలీసు మరియు జిల్లా యంత్రాంగం సమన్వయంతో వ్యవహరించి మహిళలకు అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి, సిఐడి అడిషనల్ డిజిపి చారు సిన్హా, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ కె. అవినాష్ మహంతి, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, హైదరాబాద్ అడిషనల్ సిపి ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకం

సహకారాలు ఉంటాయని తెలిపారు. హైదరాబాద్ నగరం ప్రపంచంలో మేటి నగరంగా ఎదుగుతున్న క్రమంలో వేగంగా పలు సంస్కరణలు చేపడుతున్నామని ఇందులో భాగంగా పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. అదేవిధంగా నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర గణనీయంగా ఉంటుంది ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సీసీ కెమెరాల వినియోగాన్ని పెద్ద సంఖ్యలో చేపట్టాలని, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని చిన్న కదలికను సైతం వేను వెంటనే గుర్తించి నిఘాను పటిష్టం చేసేందుకు సీసీ కెమెరాల వినియోగాన్ని పెంచాలని అందుకు అవసరమైన సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. 2047 త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా లక్ష సాధనలో పబ్లిక్, ప్రైవేట్ మోడల్ అనివార్యమని ఆ విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని పరిశ్రమల శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ సమ ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ సీఎం సూచించారు. ఈ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. మైక్రో, స్మాల్, మీడియం ఇండస్ట్రీస్ లను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలనేది ప్రజా ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. రాష్ట్ర నలుమూలలోని యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి తో పాటు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉన్న రంగం అని తెలిపారు. జీసీసీలతో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని, ఇదే వేగాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వ నుంచి ప్రోత్సాహం కల్పిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు అన్నారు. డాటా సెంటర్లలో ఎఐ వినియోగాన్నిపెద్ద ఎత్తున చేపట్టాలని మంత్రి శ్రీధర్ బాబుకు సూచించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సివి ఆనంద్, శశాంక డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయండి

**పొన్నంతో కోదండరామ్ భేటీ..**

హైదరాబాద్: మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఆయన నివాసంలో తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుకు.. కమిటీ ఏర్పాటుపై ప్రాథమికంగా సమావేశమయ్యారు. కమిటీలో మహిళలకు అవకాశం ఇవ్వడంతో పాటు.. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని చర్చించారు. తెలంగాణ ఉద్యమకారుల హామీల అమలు విధి విధానాలు, అర్హుల ఎంపిక తదితర అంశాలపై మంత్రితో చర్చించారు. జిల్లాల వారీగా అర్హులను గుర్తించి ఉద్యమకారుల డిమాండ్లపై అధ్యయనం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద ఉద్యమకారుల కమిటీ సమావేశం ఏర్పాటు చేసేలా చర్చించారు. వారంలో మరోసారి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు.

# యుద్ధ విరమణకు ఇరాన్ షరతులు

హక్కులను గుర్తించాలి. మాకు పరిహారం చెల్లించాలి. భవిష్యత్తులో దురాక్రమణలు జరగకుండా అంతర్జాతీయ హామీలు ఇవ్వాలని" మసూద్ పెజెష్కియాన్ ఎక్స్‌లో రాసుకొచ్చారు. అయితే యుద్ధం ముగించేకు కూడా ఇరాన్ సిద్ధమని ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. కానీ వీళ్లు పెట్టిన షరతులకు అమెరికా, ఇజ్రాయెల్ ఒప్పుకుంటాయా? లేదా ? అనేదానిపై ఆసక్తి నెలకొంది.

**భారత్‌పై ఇప్పటికే తీవ్ర ప్రభావం**

మరోవైపు ఇప్పటికే రెండు వారాలు పూర్తి చేసుకున్న ఇరాన్ వార్ కారణంగా భారత్ సహా పలు దేశాల ఆర్థిక వ్యవస్థలు కుదేలవుతున్నాయి. ముడి చమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్లు దాటిపోయింది. ఇది ప్రపంచ మార్కెట్‌లను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఇంధన దిగుమతులపై అధికంగా ఆధారపడిన భారత ఆర్థికవ్యవస్థ దీంతో తీవ్ర ప్రమాదంలో పడింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఇంధన దిగుమతిదారు అయిన భారత్ పై గల్ఫ్ అస్థిరత వేగంగా ప్రభావం చూపుతోంది. హార్ముజ్ జలసంధి మీదుగా 40 శాతం చమురు, 60 శాతం ఎల్పీజీ దిగుమతులు చేసుకుంటున్న భారత్ ఇప్పుడు ఇరాన్‌ను రిక్వెస్ట్ చేసుకోవాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో చర్చలు విజయవంతమై యుద్ధం త్వరగా ముగిసినట్లయితే, భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం తగ్గుతుంది. సరఫరా ఆందోళనలు తగ్గితే చమురు ధరలు మునుపటి స్థాయికి వస్తాయి. ఉద్రిక్తతలు కొన్ని వారాల్లోనే పరిష్కారమైతే, క్రూడ్ బ్యారెల్‌కు $60–$70 పరిధిలోకి తిరిగి రావచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. స్టాక్ మార్కెట్ల స్థిరీకరణ జరిగి ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంటుంది. యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే భారత్ కు ఆర్థిక పరిణామాలు మరింత తీవ్రంగా ఉంటాయి. అధిక చమురు ధరలు రవాణా, తయారీ ఖర్చులను పెంచుతాయి, ఇది ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. అదే సమయంలో, దిగుమతి బిల్లు పెరగడంతో దేశ కరెంట్ అకౌంట్ లోటు పెరుగుతుంది. చమురు ధరలలో ప్రతి 10% పెరుగుదల భారతదేశ జీడీపీ వృద్ధిని 20–25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తుందని హెచ్చరి స్తున్నారు.

**60 శాతం దిగుమతులు హార్ముజ్ నుంచే..**

యుద్ధ ప్రభావం ప్రపంచ దేశాలన్నింటిపై ఉండటానికి ప్రధాన కారణం హార్ముజ్ జలసంధి. మన దేశానికి వచ్చే 60 శాతం గ్యాస్ దిగుమతులు ఈ మార్గం ద్వారానే వస్తాయి. ఇరాన్ ఇప్పటికే భారత చమురు నౌకల రవాణాకు కొంత వరకు సానుకూలత వ్యక్తం చేసినప్పటికీ, యుద్ధ తీవ్రత పెరిగితే సముద్ర మార్గంలో భద్రత కూడా ప్రశ్నార్థకం అవుతుంది. దేశీయంగా రిలయన్స్ వంటి సంస్థలు గ్యాస్ ఉత్పత్తిని పెంచుతున్నప్పటికీ, దేశీయ అవసరాలను అది అందుకోలేదు. యుద్ధం ఆగితేగానీ ప్రపంచ దేశాలు ఊపిరి పీల్చుకోలేవు.

రెండు ట్యాంకర్లపై 'సూసైడ్ బోటు'తో దాడి

ఇరాన్ వర్సెస్ ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య యుద్ధం 13వ రోజుకు చేరుకుంది. ఇజ్రాయెల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై మిస్సైల్స్, డ్రోన్లతో దాడులు చేస్తున్నా యి. ఈ దాడుల్లో ఇప్పటి వరకు 1300 మంది ఇరానీయులు చనిపోయినట్లు తెలుస్తోంది. ఇరాన్ కూడా ఏమాత్రం వెనక్కు తగ్గటం లేదు. రెండు దేశాలపై విరుచుకుపడుతోంది.

### ప్రతీకారం తీర్చుకుంటాం

విశ్వసిస్తుందని.. అయినప్పటికీ అక్కడి అమెరికా స్థావరాలపై మాత్రం దాడులను కొనసాగుతాయని మొజ్తాబా ఖమేనీ అన్నారు. కష్ట సమయంలో తమ సైనికులు ధైర్యంగా పోరాడుతున్నారంటూ ప్రశంసించారు. పొరుగు దేశాలతో సంబంధాలు మెరుగుపరచుకోవాలని తాము కోరుకుంటున్నామన్నారు. దాడుల్లో గాయపడిన వారికి ఉచితంగా చికిత్స అందించడంతో పాటు బాధిత కుటుంబాలను ఆర్థికంగానూ ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

## హార్ముజ్.. భారత్‌కు రైట్ రైట్

టెహ్రాన్(జనంసాక్షి):ప్రపంచ ఇంధన సంక్షోభం వేళ భారత్‌కు భారీ ఊరట లభించినట్లు తెలుస్తోంది. భారత్ జెండాతో ఉన్న నౌకలు హార్ముజ్ జలసంధి మీదుగా ప్రయాణించేందుకు ఇరాన్ అనుమతించినట్లు సమాచారం. విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మధ్య జరిగిన చర్చల ఫలితంగా ఈ ఉపశమనం లభించినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో పుష్పక్, పరిమళ్ పేరిట ఉన్న రెండు ఇండియన్ ట్యాంకర్లు హార్ముజ్ జలసంధిని దాటినట్లు పేర్కొన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్, ఐరోపా దేశాలకు చెందిన నౌకలు ఆంక్షలు ఎదుర్కొంటున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్–అమెరికా ఇరాన్ యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి జైశంకర్–అరాగ్చీల మధ్య మూడుసార్లు చర్చలు జరిగాయి. మంగళవారం ఇద్దరి మధ్య జరిగిన ఫోన్‌కాల్ వాటిల్లో ఒకటి. హార్ముజ్ నుంచి ట్యాంకర్లు సురక్షితంగా గమ్యస్థానానికి చేరడంపై వారు ప్రధానంగా మాట్లాడుకున్నారు. ఇక, జైశంకర్ బుధవారం రష్యా, ఫ్రాన్స్ విదేశాంగ మంత్రులు, ఐరోపా నేతలతోనూ మాట్లాడారు. వీరు అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై ప్రస్తుత సంక్షోభ ప్రభావాన్ని చర్చించుకున్నారు.

ముంబయి పోర్ట్‌కు చమురు నౌక..

కాగాపశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ ఒక చమురు నౌక హార్ముజ్‌ను దాటి భారత్‌కు చేరుకుంది. ఎటువైపు నుంచి క్షిపణి దూసుకొస్తుందో తెలియని ఘర్షణ వాతావరణంలో జలసంధిని సురక్షితంగా దాటి, ముంబయి పోర్ట్‌కు చేరుకున్న తొలినౌక ఇదే కావడం విశేషం. అయితే హార్ముజ్ నుంచి రావడానికి ఇరాన్ పరోక్షంగా సహకరించిందని సమాచారం.

## ఇంధన భద్రతపై ఇరాన్‌తో చర్చించాం: రణధీర్ జైస్వాల్

ఇంధన భద్రతపై ఇరాన్‌తో చర్చిస్తున్నాం విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. దేశ ఇంధన భద్రతపై ఇరాన్‌తో విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ మాట్లాడారని రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. హార్ముజ్ మీదుగా భారత్‌కు వచ్చే నౌకల ప్రయాణం గురించి కూడా చర్చించినట్లు తెలిపారు. మరోవైపు, డీజిల్ సరఫరా కోసం బంగ్లాదేశ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందని, దానిని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. శ్రీలంక, మాల్దీవుల నుంచీ ఇదే తరహా అభ్యర్థనలు వచ్చాయని, అయితే.. ముందుగా మన దేశ అవసరాలను కేంద్రం పరిగణనలోకి తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం ఇరాన్‌లో దాదాపు తొమ్మిది వేల మంది భారతీయులు ఉన్నారని.. వీరిలో విద్యార్థులు, నౌకా సిబ్బంది, వ్యాపారవేత్తలు, యాత్రికులు ఉన్నట్లు విదేశాంగశాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఘర్షణ మొదలైన వెంటనే విద్యార్థులు సహా అనేక మంది భారతీయులను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. స్వదేశానికి తిరిగి రావాలనుకునే భారతీయులందరికీ సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. మన రాయబార కార్యాలయం అన్ని సమయాల్లో అందుబాటులో ఉందన్నారు. అఫ్గాన్‌తో ఇటీవల ఘర్షణకు భారత్ కారణమంటూ పాకిస్థాన్ చేసిన ఆరోపణలను భారత విదేశాంగశాఖ ఖండించింది. అవి నిరాధార ఆరోపణలని స్పష్టం చేసింది. తన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు భారత్‌పై నిందలు వేయడం పాకిస్థాన్‌కు పరిపాటేనని విమర్శించింది. దశాబ్దాలుగా సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది దేశం మాటలకు విశ్వసనీయత లేదని తెలిపింది.



## నెట్‌ఫ్లిక్స్‌ను హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నాం

- ఫ్యూచర్‌సిటిలో ఏర్పాటుకు భూమి కేటాయిస్తాం
- ఐలైన్ స్టూడియోస్ కార్యాలయాన్ని సీఎం రేవంత్

**హైదరాబాద్(జనంసాక్షి):**నెట్‌ఫ్లిక్స్‌ను హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ అన్ని అవకాశాలను కల్పిస్తుందని, తమ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. హైటెక్‌సిటీలోని నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన ఐలైన్ స్టూడియోస్ కార్యాలయాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యం నుంచే తనకు సినిమాలు అంటే ఇష్టం ఇష్టమన్నారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చిందంటే హాలీవుడ్ నగరానికి వచ్చినట్లే అని సీఎం వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్‌తో తన కల నిజం కాబోతోందని వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ విస్తరణకు తమ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఫోర్త్‌సిటీని నిర్మిస్తున్నామని.. నెట్‌ఫ్లిక్స్ విస్తరణకు కావాల్సిన భూమిని ఫ్యూచర్ సిటీలో ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ ఆఫీస్‌ను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమానికి పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి డి. శ్రీధర్‌బాబు, సినీనటుడు రానా దగ్గుబాటి, నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ సీఈఓ జెఫ్ షాపిరో, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. తనకు సినిమాలపైన ఆసక్తి ఉందని.. తన బాల్యం నుంచి ఇప్పటి వరకు చిత్రరంగంలో అనేక మార్పులు వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బాహుబలి, కల్కి, ఆర్‌ఆర్‌ఆర్, అరుంధతి వంటి అత్యున్నత సాంకేతికతతో కూడిన సినిమాలు వచ్చాయని చెప్పుకొచ్చారు. చెన్నైలో ఉన్న తెలుగు సినిమా రంగాన్ని నందమూరి తారక రామారావు , అక్కినేని నాగేశ్వరరావు హైదరాబాద్‌కు తీసుకువచ్చారని గుర్తుచేశారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్ వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్లేనని పేర్కొన్నారు. తమ దృష్టి హాలీవుడ్‌పైనేనని తాను గతంలోనే చెప్పానని ప్రస్తావించారు.

### మానవ విలువలతో వైద్యం చేయాలి

హైదరాబాద్ అభివృద్ధికి బీజం వేశాయి. ఉమ్మడి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు హయాంలో హైటెక్ సిటీ పూర్తి కావడంతో నగరం ఐటీ హబ్‌గా రూపాంతరం చెందింది. దేశంలోని ఫార్మా ఉత్పత్తుల్లో 40 శాతం వాటా ఒక్క హైదరాబాద్‌దే కావడం ఎంతో గర్వకారణం. కరోనా సమయంలో ప్రపంచాన్ని కాపాడిన మూడు వ్యాక్సిన్లు మన జినోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి కావడం రాష్ట్రానికి గర్వకారణం' అని అన్నారు.

## 16నుంచి ఒంటిపూట బడులు

12:30 గంటల వరకు తరగతులు జరుగుతాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం 12:30 గంటలకు భోజనం వడ్డించిన తర్వాత విద్యార్థులను ఇంటికి పంపిస్తారు. టెన్త్ ఎగ్జామ్స్ జరిగే స్కూళ్లలో షెడ్యూల్ మారుతుంది. అక్కడ మధ్యాహ్నం 1:00 గంట నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ఒంటిపూట బడులు నిర్వహిస్తారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షల దృష్ట్యా యథావిధిగా ప్రత్యేక తరగతులు కొనసాగుతాయి. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం.. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు విద్యార్థులకు వేసవి సెలవులు ఉండనున్నాయి. తిరిగి 2026–27 విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానుంది. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది.

## ఐదు నిముషాల ఆలస్యానికి అనుమతి

సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. అయితే పరీక్షలకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతిస్తారు. ఆ తర్వాత వచ్చే వారిని అస్సలు అనుమతించబోరు. అంటే ఉదయం 9:35 గంటల తర్వాత వచ్చే విద్యార్థులను పరీక్షకు అనుమతించబోరు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 సెంటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బడుల్లో 1,582 సెంటర్లు, ప్రైవేట్ బడుల్లో 1,094 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సారి 5,17,727 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. పరీక్షల సందర్భంగా సెల్‌ఫోన్ల వినియోగంపై అధికారులు కఠిన ఆంక్షలు విధించారు. పరీక్ష కేంద్రాలను 'నో సెల్‌ఫోన్' జోన్లుగా ప్రకటించారు. పరీక్ష సిబ్బంది, స్క్వాడ్ సహా ఇతర అధికారులందరికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి. తనిఖీలకు వచ్చే అధికారులు సైతం సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదు. వీరు తమ సెల్‌ఫోన్లను గది బయటే పెట్టాల్సి ఉంటుంది. ఎవరొచ్చినా తనిఖీలు చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు. ఒకవేళ ఎవరైనా ఈ నిబంధనలు ఉల్లంఘించి సెల్‌ఫోన్లతో విధులకు హాజరైతే వారిని సస్పెండ్‌చేస్తారు. పేపర్ లీకేజీలకు పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగిస్తారు.

## 16న విచారణకు రండి

**- కవితకు సీబీఐ నోటీసులు**

**- ఇంటికి వచ్చి అందజేసిన దర్యాప్తు సంస్థ అధికారులు**

హైదరాబాద్: కల్వకుంట్ల కవిత ఇంటికి సీబీఐ అధికారులు వచ్చారు. ఢిల్లీ మద్యం కేసులో సీబీఐ అభియోగాలు నిరాధారంగా ఉన్నాయని ఇటీవల రౌజ్ అవెన్యూ కోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ తీర్పుపై దర్యాప్తు సంస్థ సీబీఐ హైకోర్టులో అప్పీల్ చేసింది. ఈ నేపథ్యంలో సమన్లు ఇచ్చేందుకు అధికారులు కవిత ఇంటికి చేరుకున్నారు. సీబీఐ నోటీసులపై కవిత స్పందించారు. ఈ నెల 16న విచారణకు హాజరు కావాలని సీబీఐ అధికారులు తెలిపారన్నారు. నోటీసులపై తన లీగల్ టీమ్‌తో చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసు విచారణలో అధికారులకు సంపూర్ణంగా సహకరిస్తానని చెప్పారు.

# అమెరికా కొనమన్నచోట చమురెలాకొంటారు?

ఇచ్చిన అంశంపైనే మాట్లాడాలని సూచించారు. సభ్యుల ఇష్టాఇష్టాల మేరకు సభ నడవదని స్పష్టం చేశారు. ఇదే అంశంపై పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ ప్రసంగాన్ని విపక్షాలు అడ్డుకున్నాయి. ఎప్‌స్టీన్ అంటూ లోక్‌సభలో విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ఆ గందరగోళం మధ్యే మంత్రి మాట్లాడారు. ఇరాన్, అమెరికా – ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో గ్యాస్ కొరతతో భారతదేశం అల్లాడుతోందని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రస్తుత పరిస్థితికి మోదీ ప్రభుత్వమే కారణమని ఆయన విమర్శించారు. పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతుందన్నారు. అమెరికా – ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలకు 20 శాతం చమురు హార్ముజ్ జల సంధి నుంచి వస్తుందని వివరించారు. ప్రస్తుతం ఆ జల సంధిని మూసివేశారని పేర్కొన్నారు. గ్యాస్ కొరత కారణంగా దేశవ్యాప్తంగా రెస్టారెంట్లు మూతపడ్డాయని చెప్పారు. ఎల్పీజీ గ్యాస్ కొరత నేపథ్యంలో ప్రజలు భయాందోళనలో ఉన్నారన్నారు. దేశానికి పునాది ఇంధన భద్రత అని అభివర్ణించారు. భారత్ వ్యవహారాలను అమెరికా శాసిస్తోందని మండిపడ్డారు. యూఎస్ అనుమతి లేకుంటే ముడి చమురు కొనుగోలు చేయ్యారా? అంటూ వ్యంగ్యంగా కేంద్రాన్ని నిలదీశారు. భారత్ వంటి పెద్ద దేశానికి మరో దేశం అనుమతి అవసరమా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. పెట్రోలియం మంత్రికి ఎప్‌స్టీన్‌తో సంబంధాలున్నాయని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు చేసిన వెంటనే రాహుల్ మైక్‌ను స్పీకర్ ఓం బిర్లా కట్ చేశారు. అంతలో సభలోని హర్దీప్ సింగ్ స్పందిస్తూ.. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. హర్దీప్‌సింగ్ ప్రసంగాన్ని విపక్షాలు అడ్డుకున్నాయి. అంతే కాకుండా ఎప్‌స్టీన్ అంటూ సభలో విపక్ష పార్టీల సభ్యులు బిగ్గరగా నినాదాలు చేశారు. అనంతరం సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు.

**గ్యాస్ కొరతపై విపక్షాల ఆందోళన**

'మోడీజి –ఎల్‌పిజి' అంటూ ప్రతిపక్షాలు గురువారం పార్లమెంటు ఎదుట ఆందోళన చేపట్టారు. కమరిషయల్ ఎల్‌పిజి సిలిండర్ల కొరతపై మోడీ ప్రభుత్వం సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి, ఎసి సహా పలువురు ఎంపిలు మకరద్వారం ఎదుట ఆందోళన చేపట్టారు. 'నామ్ నరేందర్, కామ్ సరెండర్', 'మోడీజి, ఎల్‌పిజి' అంటూ నినాదాలు చేశారు. ప్రియాంక వాద్రా గాంధీ సహా పలువురు మహిళా ఎంపిలు ఇటుకల పొయ్యిలను ప్రదర్శించారు. ప్రధాని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. పశ్చిమాసియా పరిస్థితులు, భారత్‌పై దాని ప్రభావంపై పూర్తి స్థాయిలో చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రధాని మోడీపై విరుచుకుపడ్డారు. ఎల్‌పిజి కొరతపై ప్రజలు ఆందోళన చెందవద్దని ప్రధాని పేర్కొన్నారని, కానీ 'పూర్తి భిన్నమైన కారణాల'తో ఆయన తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఎద్దేవా చేశారు. ఎప్‌స్టీన్ ఫైల్స్, అదానీ కేసులపై ప్రధాని ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. పార్లమెంటుకు వచ్చేందుకు కూడా మోడీ భయపడుతున్నారని, బుధవారం పార్లమెంటులో ఆయన కుర్చీ ఖాళీగా ఉండటం అందరం చూశామని అన్నారు. ప్రజలకు ఆందోళన చెందవద్దని చెబుతున్నారని, కానీ ఆయన ఆందోళనకు గురవుతన్నారన్నది స్పష్టమౌతోందని అన్నారు. గ్యాస్‌పై అబద్దాలాడుతున్న మోదీ సర్కారుగ్యాస్ కొరత విషయంలో కేంద్రం తీరుపై కాంగ్రెస్ మండిపడింది. వాస్తవాన్ని ప్రజలకు చెప్పకుండా మోదీ సర్కారు అబద్ధమాడుతోందని కాంగ్రెస్ నాయకులు దుయ్యబట్టారు. ఎల్‌పీజీ కొరతపై సభలో చర్చకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సభ్యులు పార్లమెంటు ముందు ప్రదర్శన నిర్వహించారు.

## గ్యాస్ కొరత నివారణకు చమురు కంపెనీలతో చరిస్తాం

కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నది వాస్తవమని తెలిపారు. రాష్ట్రంలో వంట గ్యాస్ తాజా పరిస్థితిపై చర్చించేందుకే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు, చమురు కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం సమీక్షిస్తామని మంత్రి ఉత్తమ్ వివరించారు. రాష్ట్రంలో రోజూ ఎన్ని కమర్షియల్ సిలిండర్లు అవసరం, సరఫరా ఏ మేరకు ఉంది, గ్యాస్ కొరతకు గల కారణాలు, అందుకు అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలతోపాటు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టేందుకున్న మార్గాలన్నింటిపై చర్చించనున్నట్లు మంత్రి ఉత్తమ్ వివరించారు. అలాగే పూర్తి వివరాలతో రావాలని ఆయిల్ కంపెనీల ప్రతినిధులతోపాటు అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. పరిస్థితి చేయి దాటి పోకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు.రో వైపు.. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర పోరు కొనసాగుతోంది. దీని ప్రభావంతో దేశవ్యాప్తంగా గ్యాస్, చమురుకు తీవ్ర కొరత ఏర్పడింది. గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని కేంద్రం చెబుతున్నప్పటికీ.. వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. తెలంగాణలో వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

## కారకులను దూరం పెట్టండి

న్యూఢిల్లీ(జనంసాక్షి):జాతీయ విద్యా పరిశోధనా శిక్షణ మండలి ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకంలో 'న్యాయ వ్యవస్థలో అవినీతి' పాఠ్యాంశాన్ని చేర్చేందుకు కారకులైన వారిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ ముగ్గురు నిపుణులతో ఇకపై ఎలాంటి సంబంధాలు కొనసాగించొద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. న్యాయ వ్యవస్థలో నెలకొన్న అవినీతి గురించి వివాదాస్పద అంశంగా పాఠ్యపుస్తకంలో చేర్చడంపై ఎన్‌సీఈఆర్‌టీ.. సర్వోన్నత న్యాయస్థానానికి బేషరతుగా క్షమాపణలు చెప్పడంతో పాటు ఆ పుస్తకాన్ని ఉపసంహరించుకున్న సంగతి తెలిసిందే. ఈ అంశంపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ వివాదాస్పద పాఠ్యాంశాన్ని ప్రొ.మైఖేల్ డానినో సహా టెక్స్ట్‌బుక్ డెవలప్‌మెంట్ టీమ్ సభ్యులు సుపర్ణ దివాకర్, అలోక్ ప్రసన్న కుమార్‌లు రూపొందించారని ప్రభుత్వం తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. 'ప్రొ.మైఖేల్ డానినో, ఆయన సహచరులు సుపర్ణ దివాకర్, అలోక్ ప్రసన్న కుమార్‌లకు భారత న్యాయవ్యవస్థను గురించిన సరైన పరిజ్ఞానం లేకుండా ఉండాలి, లేదా విద్యార్థుల ముందు న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దిగజార్చేందుకు వాళ్లు ఉద్దేశపూర్వకంగానే వాస్తవాలను వక్రీకరించి తప్పుగానైనా చూపించి ఉండాలి' అని పేర్కొంది. ఇకపై రాబోయే తరం విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాల రూపకల్పన ప్రక్రియలో ఆ ముగ్గురి ప్రమేయం ఉండకూడదని, వారిని తక్షణమే పక్కనపెట్టాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వ నిధులతో పూర్తిగా లేదా పాక్షికంగా సంబంధమున్న ఎలాంటి బాధ్యతలనూ అప్పగించకూడదని తేల్చి చెప్పింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయవ్యవస్థ గురించి విద్యార్థులకు బోధించడం మంచి విషయమే అయినప్పటికీ.. సంబంధిత పాఠ్య ప్రణాళిక తయారీలో కనీసం ఒక్క న్యాయ నిపుణుడికీ అవకాశం కల్పించకపోవడం తమకు అసంతృప్తి కలిగిస్తోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎన్‌ఈసీఆర్‌టీ లీగల్ స్టడీస్‌కు సంబంధించి పాఠ్యప్రణాళిక రూపకల్పనలో న్యాయ రంగానికి చెందిన నిపుణులతో వారం రోజుల్లోగా ఓ కమిటీని ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ కమిటీలో మాజీ సీనియర్ న్యాయమూర్తి, ఓ ప్రసిద్ధ న్యాయవాది సహా ప్రముఖ విద్యావేత్త ఒకరుంటే బాగుంటుందని అభిప్రాయపడింది. వీరు నేషనల్ జ్యుడీషియల్ అకాడమీతో సంబంధం ఉన్నవారైతే మరింత మంచి విషయాన్ని పొందుపరిచేందుకు అవకాశముంటుందని తెలిపింది. వివాదాస్పద ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాన్ని పూర్తిగా నిషేధిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఫిబ్రవరి 26న తీర్పు వెలువరించగా.. దానిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం జరిగినట్లు ధర్మాసనం గుర్తుచేసింది.

## పీసీ ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలి

**- కేసీఆర్, హరీశ్‌రావును ఇబ్బంది పెట్టడానికే ఏర్పాటు చేశారు**

**- హైకోర్టులో కేసీఆర్, హరీశ్‌రావు, స్మితా సబర్వాల్, ఎస్‌కే జోషి పిటిషన్లు**

హైదరాబాద్: కాళేశ్వరంపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. కమిషన్ నివేదికను రద్దు చేయాలంటూ కేసీఆర్, హరీశ్‌రావు, స్మితా సబర్వాల్, ఎస్‌కే జోషి పిటిషన్లు వేశారు. కేసీఆర్, హరీశ్‌రావు తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఇప్పటికే ప్రభుత్వం, కమిషన్ తరఫు వాదనలు పూర్తయ్యాయి. కేసీఆర్, హరీశ్‌రావును ఇబ్బంది పెట్టడానికే కమిషన్ వేశారని న్యాయవాది శేషాద్రినాయుడు వాదనలు వినిపించారు. కమిషన్ నివేదిక ఆధారంగా వీరిద్దరినీ లక్ష్యంగా చేసుకున్నారని పేర్కొన్నారు. ఇద్దరిపైనా ఇప్పటికే దుష్ప్రచారం చేశారని తెలిపారు. పిల్లర్లు కూలిపోయాయని ప్రభుత్వం కమిషన్ వేసిందన్నారు. అదే ప్రాజెక్టు నుంచి హైదరాబాద్‌కు నీటి సరఫరాకు ప్రణాళిక రూపొందించారన్నారు. మల్లన్నసాగర్ నుంచి నగరానికి నీటిని తీసుకొచ్చేలా జీవో విడుదల చేశారని చెప్పారు. భారీ వర్షాలు, వరదల వల్ల మేడిగడ్డలో ఒక పిల్లర్ కుంగిందని శేషాద్రినాయుడు తెలిపారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**15న జరిగే 'ఫీజు పోరు దీక్ష'కు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు**



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో సుమారు రూ. 7,500 కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం ప్రతినిధులు రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని కలిసి, ఈ నెల 15న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న "ఫీజు పోరు దీక్ష"కు మద్దతు కోరారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల కోసం నిర్వహించే ఈ దీక్షకు సీపీఐ(ఎం) పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేసారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ, నిరుపేద బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల ఉన్నత చదువులకు వెన్నెముకగా ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేయడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రియంబర్స్‌మెంట్ పెండింగ్ వల్ల విద్యార్థులు ఉన్నత విద్యను మధ్యలోనే ఆపేయాల్సి రావడం అత్యంత దురదృష్టకరం. కోర్సులు పూర్తి చేసినా బకాయిల సాకుతో విద్యా సంస్థలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు పైచదువులు, ఉద్యోగ అవకాశాలను కోల్పోయి, తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కార్పొరేట్ శక్తులకు మేలు చేసే ప్రభుత్వం, పేద విద్యార్థుల విద్యకు నిధులు కేటాయించకపోవడం శోచనీయమని అన్నారు. సంక్షేమం గురించి గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కనీస హక్కు అయిన ఫీజుల విషయంలో మొండివైఖరి ప్రదర్శించకుండా బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విద్యార్థుల ఖాతాల్లో నేరుగా జమ చేయాలని, సర్టిఫికెట్లు ఆపేసిన విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేసారు.

## మహిళా సాధికారతే లక్ష్యంగా మహిళలందరూ అన్ని రంగాల్లో పురోగమించాలి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త




హైదరాబాద్ (జనంసాక్షి) : మహిళా సాధికారతే లక్ష్యంగా మహిళలందరూ అన్ని రంగాల్లో పురోగమించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. చైతన్యపురి కమ్యూనిటీ హాల్‌లో "ఓం శ్రీ మాత్రే నమః" సంస్థ మంజుల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలియజేసిన శ్రీనివాస్ గుప్త సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు 75% మున్సిపల్ చైర్మన్‌గా , కౌన్సిలర్ లుగా అవకాశం కల్పించాడని ఆయన అన్నారు. పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి అని ఆయన అన్నారు. కుటుంబం నుండి దేశ నిర్మాణం వరకు ప్రతి రంగంలో మహిళలు విశేషమైన సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల ప్రతినిధులు, కాలనీ వాసులు మరియు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలను సత్కరించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మరణంలోనూ వీడని స్నేహం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం




మరిపెడ, మార్చి 12 (జనంసాక్షి) : మహబూబాబాద్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. మరిపెడ మండలం లచ్య తండా పరిధిలోని ఎన్‌హెచ్-365 జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరణంలో కూడా వీడని వీరి స్నేహం స్థానికులను కలిచి వేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గాలివారి గూడెం కు చెందిన ఉదయ్ కిరణ్(21), భిక్షం(22) ద్విచక్ర వాహనంపై మహబూబాబాద్ నుంచి మరిపెడ వైపు ప్రయాణిస్తున్నారు. చిన్ననాటి నుంచే కలిసి పెరిగిన వీరిద్దరూ ప్రాణ స్నేహితులుగా స్థానికులకు సుపరిచితులు. ఈ క్రమంలో మార్గమధ్యంలో గుర్తుతెలియని వేగవంతమైన వాహనం వారి వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదం తీవ్రంగా ఉండటంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన వాహనం ఆగకుండా అక్కడి నుంచి వెళ్లిపోయింది. ప్రమాదం అనంతరం మృతదేహాలను పరిశీలించిన సమయంలో ఇద్దరూ ఒకరినొకరు హత్తుకుని ఉన్న దృశ్యాలు కుటుంబ సభ్యులు, బంధువులను తీవ్ర ఆవేదనకు గురిచేశాయి. మరణంలో కూడా వీడని వీరి స్నేహం అక్కడున్న వారిని కలచివేసింది. సమాచారం అందుకున్న వెంటనే మరిపెడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

## శరవేగంగా హైకోర్టు నిర్మాణ పనులు

- పనులను పరిశీలించిన చీఫ్ జస్టిస్

హైదరాబాద్, మార్చి12 (జనంసాక్షి) : తెలంగాణ ప్రభుత్వం రాజేంద్రనగర్‌లో ప్రతిష్టాత్మకంగా హైకోర్టు భవన సముదాయం నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో భాగంగా జోన్-ఎలో 40 ఎకరాల విస్తీర్ణంలో ఇన్‌స్టిట్యూషనల్ భవనాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అదే విధంగా జోన్-ఎఎలో సుమారు 60 ఎకరాల భూమిని గౌరవ ముఖ్య న్యాయమూర్తి ,మరియు న్యాయమూర్తుల కోసం అవసరమైన సౌకర్యాలతో కూడిన నివాస విల్లాల నిర్మాణానికి కేటాయించారు. ఈ నివాస విల్లాల నిర్మాణానికి ఏప్రిల్ 5న భూమిపూజ కార్యక్రమం నిర్వహించాలని న్యాయవ్యవస్థ అధికారులు నిర్ణయించారు. నేపథ్యంలో గురువారం గౌరవ ముఖ్య న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ , గౌరవ న్యాయమూర్తులు మరియు రోడ్లు-భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ కలిసి నిర్మాణ స్థలాన్ని సందర్శించారు. కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని రోడ్లు-భవనాల శాఖ అధికారులకు సూచించారు. అలాగే పనులు వేగంగా ముందుకు సాగేందుకు కాంట్రాక్టర్ సంస్థ ప్రతినిధులతో కలిసి సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## తెనాలి జ్యువెలరీ షాపులో చోరీ

తెనాలి, మార్చి12 (జనంసాక్షి): తెనాలి పట్టణం షరాఫ్ బజార్‌లోని ఒక జ్యువెలరీ షాపులో చోరీ జరిగింది. గురువారం ఉదయం జ్యువెలరీ షాపుకు వచ్చి చూసే సరికి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించిన యజమాని.. రెండో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి సీసీ కెమెరాలను పరిశీలించారు. అర్ధరాత్రి 1 గంట నుంచి 2 గంటల మధ్య గుర్తుతెలియని ఇద్దరు దుండగులు ముసుగులు ధరించి దుకాణం తాళాలు పగులగొట్టి లోపలికి వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. సంచిలో ఉన్న పది కేజీల ముడి వెండి, కౌంటర్ వద్ద ఉన్న 10 గ్రాముల బంగారు వస్తువులు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# కోకాపేటలో అల్లు సినిమాస్ మల్టీప్లెక్స్

- లాంఛనంగా ప్రారంభించిన సిఎం రేవంత్
- హాజరైన సినీ, రాజకీయ దిగ్గజనేతలు





హైదరాబాద్, మార్చి12 (జనంసాక్షి) : హైదరాబాద్ కోకాపేటలోని 'అల్లు సినిమాస్' మల్టీప్లెక్స్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ముఖ్యమంత్రికి నటుడు అల్లు అర్జున్ స్వాగతం పలికారు. మల్టీప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన అల్లు రామలింగయ్య విగ్రహానికి సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నివాళులర్పించారు. 'అల్లు సినిమాస్'లోని ఏర్పాట్లను అల్లు అరవింద్, అల్లు అర్జున్ వివరించారు. అనంతరం డాల్బీ స్క్రీన్‌లో ప్రదర్శించిన పలు ప్రచార చిత్రాలను వీక్షించారు. ఈ ఈవెంట్‌లో దర్శకులు రాఘవేంద్రరావు, బోయపాటి శ్రీను, క్రిష్, నందినిరెడ్డి, పలువురు నిర్మాతలు, నటీనటులు పాల్గొన్నారు. 'అల్లు సినిమాస్'లో నాలుగు స్క్రీన్లు ఉండగా.. స్క్రీన్-1లో డాల్బీ విజన్ సౌలభ్యం ఉంది. ఇది ఆసియాలోనే అతి పెద్దదిగా 75 అడుగులు ఉంటుంది. ఉగాది సందర్భంగా ఈ మల్టీప్లె క్స్‌లో సినిమాలు ప్రదర్శన ప్రారంభం కానుంది. శుక్రవారం నుంచి 'బుక్ మై షో' వేదికగా బుకింగ్స్ ఓపెన్ కానున్నాయి. 'ధురంధర్: ది రివెంజ్' మూవీ ప్రీమియర్స్‌తో ప్రేక్షకులకు అనుమతి ఇచ్చే అవకాశం ఉంది. అంతకుముందు గురువారం ఈ వేడుక సినీ, రాజకీయ నాయకుల సమక్షంలో గ్రాండ్‌గా జరిగింది.

# దిక్కుతోచని శనగ, మక్కరైతులు

- కొనుగోలు కేంద్రాలు లేక ఆందోళన
- ఉన్నతాధికారులకు నివేదించామన్న మార్క్‌ఫెడ్



నిజామాబాద్, మార్చి 12 (జనంసాక్షి) : జిల్లాలో శనగ, మక్క రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు పండించినా కొనుగోలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడ్డికి పావుసేరు అన్నట్లుగా ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. అయితే ఈ సమస్యలపై అధికారుల నుంచి స్పష్టమైన హామీలు రావడం లేదు. శనగ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఉన్నతాధికారులకు నివేదికను అందజేశామని మార్క్‌ఫెడ్ డీఎం శశిధర్ అన్నారు. ఎన్‌సీసీ వారి నుంచి అనుమతులు రాగానే కేంద్రాలు ఏర్పాటు చేసి శనగలు కొనుగోలు చేస్తామని చెప్పారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే మద్దతు ధర రూ.5,875 లభిస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్న రైతులకు నిరాశ తప్పడంలేదు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో గత్యంతరం లేక పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు, కుటుంబ అవసరాల కోసం దళారులకు రూ.4,900 నుంచి రూ.5,300 వరకు విక్రయించి నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనగ పంట సాగు చేయడానికి పెట్టుబడి ఖర్చు ఎక్కువ కావడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో దిగుబడి తక్కువగా వచ్చి సుమారు ఎకరానికి రూ.5,600 ఖర్చుయినట్లు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర లేక నష్టపోతున్నామని వాపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్‌లో వ్యాపారులు తక్కువ ధర అంటే రూ.5,100లకే అడుగుతున్నారు. ముందుగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై పంటను సేకరించి ఉంటే ఇబ్బందులు వచ్చేవి కావని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎవరూ పట్టించుకోవడం లేదు. తక్కువ ధరకే అమ్మి రైతులు నష్టపోతున్నారు. పంట కోతకు వచ్చే సమయంలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే రైతులు పంటలు అమ్ముకోగలరని అంటున్నారు. దీంతో రైతులకు శనగ విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందు లు తలెత్తదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపో వడంతో ప్రైవేట్ వ్యాపారులు రాజ్యమేలు తున్నారు. రైతులు నిల్వ సౌకర్యం లేక, చేసిన అప్పుల ఒత్తిడితో పంటను అమ్ముకోవాల్సి వస్తున్నది. రైతుల అవసరాలను ఆసరాగా తీసుకుని దళారులు తక్కువ ధరకే శనగలు కొనుగోలు చేసి, సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అక్కడ ఎక్కువ ధరకు విక్రయించి లాభాలు గడిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

## ప్రజా ప్రతినిధులు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు




వనపర్తి బ్యూరో, మార్చ్ 12 (జనంసాక్షి) : జిల్లాలో ప్రజల చేత నూతనంగా ఎన్నుకోబడిన గ్రామ సర్పంచులు, పట్టణాల్లో కౌన్సిలర్లు ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేసి, వారి మెప్పు పొందాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. గురువారం స్థానిక కళ్యాణ సాయి గార్డెన్స్‌లో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా ఇటీవల నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులు, కౌన్సిలర్లకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంకు మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నూతనంగా ఎన్నిక కాబడిన ప్రజా ప్రతినిధులకు పలు కీలక సూచనలు చేశారు. మంత్రి తో పాటు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి, దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్ ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించడమే లక్ష్యంగా ఈ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికను సీఎం రేవంత్ రెడ్డి తీసుకొచ్చారని చెప్పారు. ఇందులో భాగంగా జిల్లాలో ప్రజల చేత నూతనంగా ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులందరూ భాగస్వాములై ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. నిరంతరం ప్రజలతో మమేకం అవ్వడం ద్వారా ప్రజా ప్రతినిధులకు , ప్రజలకు మధ్య ఉన్న బంధం బలోపేతం అవుతుందన్నారు. మనం చేసే ఏ పనైనా పదిమందికి ఉపయోగపడే విధంగా ఉండాలని సూచించారు. రాబోయే రోజుల్లో నిర్వహించబోయే గ్రామ సభల్లోనూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, గృహ జ్యోతి మహాలక్ష్మి ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలు అన్నింటిని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అధికారులు కూడా ప్రజల నుంచి వచ్చే ప్రతి దరఖాస్తును కంప్యూటర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డి మాట్లాడుతూ నూతనంగా గెలిచిన ప్రజాప్రతినిధులు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తమ ఆఫీసులతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ రెండున్నర ఏళ్లలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ నెలలో నిర్వహించే గ్రామ సభల ద్వారా ప్రజలందరికీ తెలియజేయాలని సూచించారు. సమావేశంలో వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, కొత్తకోట మున్సిపల్ చైర్ పర్సన్ అరుణ, పెబ్బేరు మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీనివాస్ గౌడ్, ఆత్మకూరు మున్సిపల్ చైర్పర్సన్ నాగమణి, అమరచింత మున్సిపల్ చైర్ పర్సన్ జింక సువర్ణ, సర్పంచులు, కౌన్సిలర్లు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉస్మానియా యూనివర్సిటీ తెలంగాణాకు ఐకాన్

- రూ.1000 కోట్లతో విశ్వవిద్యాలయ అభివృద్ధికి రూట్ మ్యాప్
- నిధులు మంజూరు చేయడం అభినందనీయం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి ఉత్తమ్ ప్రత్యేక ధన్యవాదాలు



హైదరాబాద్, మార్చి12(జనంసాక్షి) :ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక ఐకాన్ గా నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అటువంటి విశ్వవిద్యాలయం మన రాష్ట్రంలో ఉండడం మనకెంతో గర్వకారణమని ఆయన చెప్పారు. ఇంతటి పేరెన్నికగన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని తాను కాంక్షిస్తున్నానని ఆయన చెప్పారు. గురువారం ఉదయం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విభాగంలో ఆయన నిర్మాణ్-26 సాంకేతిక సదస్సును ప్రారంభించారు. సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 1917 లో స్థాపించిన ఈ విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిందన్నారు. అందుకు కొనసాగింపుగా 1929 లో విశ్వవిద్యాలయం సౌజన్యంతో ప్రారంభం అయిన ఇంజినీరింగ్ కళాశాల యావత్ భారతదేశంలోనే అత్యంత ప్రాశస్త్యమైన కళాశాలలలో ఆరవ స్థానంలో నిలిచిందని ఆయన చెప్పారు. అంతటి ప్రఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయం అభివృద్ధికీ ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించడమే కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకంగా 1,000 కోట్లు నిధులు మంజూరు చేయడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం చరిత్రలోనే ఇంత పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం చారిత్రాత్మక ఘట్టంగా ఆయన అభివర్ణించారు. అంతర్జాతీయ స్థాయిలో ఈ విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దాలి అన్నదే ప్రభుత్వ సంకల్పం అని అందుకనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. విశ్వవిద్యాలయంలో అవసరమైన అధ్యాపకుల భర్తీ విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డితో చర్చించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఇక్కడి నుండి ఎంతో మేధో సంపద ఉత్పత్తి అయిందని ఆ మేధస్సు ప్రపంచ స్థాయిలో అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. సిలికాన్ వ్యాలీలో పనిచేస్తున్న మెజారిటీ ఇంజినీర్లు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండే ఎదిగిన వారు అని,అంతే గాకుండా గల్లీ నుండి ఢిల్లీ స్థాయికి ఎదిగిన నేతలు,క్రీడాకారులు,ఉన్నత పదవులు చేపట్టిన వారి అడుగులు ఇక్కడి నుండే మొదలు అయ్యాయని ఆయన చెప్పారు. అటువంటి విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్ర ఉద్యమంలో అగ్రభాగాన నిలుచోవడమే కాకుండా విద్యార్థులు చేసిన త్యాగాలు ఇక్కడ ప్రస్తావనర్హమే అని భావిస్తున్నానని ఆయన చెప్పారు. ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాలలో కుడా భాగస్వామ్యం కావాలని ఆయన ఉద్బోధించారు. ఇంజినీరింగ్ విభాగం గురుంచి ఆయన ప్రస్తావిస్తూ తెలంగాణా రాష్ట్ర అభివృద్ధిలో ఇంజినీరింగ్ విభాగం ముఖ్య భూమిక పోషిస్తుందని ఆయన చెప్పారు. నిజాంసాగర్, నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి భారీ ప్రాజెక్టులతో పాటు ఎస్.ఎల్.బి.సి, దేవాదుల వంటి ఆధునిక ప్రాజెక్టులు ఇంజినీరింగ్ ప్రతిభకు అద్దం పడుతున్నాయన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగము విద్యార్థులకు ప్రాక్టికల్స్ పాఠాలుగా ఉపయోగ పడుతాయని ఆయన చెప్పారు. భవిష్యత్లో స్థిరమైన అభివృద్ధి,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, జలవనరుల సమగ్ర నిర్వహణ తో పాటు చెక్ డ్యామ్ ల పునరుద్ధరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంజినీర్లు ప్రాజెక్టుల నిర్మాణాలకు మాత్రమే పరిమితం కాకుండా వాటి భద్రత,నిర్వహణ బాధ్యతలు కుడా ఇంజినీర్లకు ఉంటాయన్నారు. నిర్మాణ్-26 వంటి సాంకేతిక సదస్సులు విద్యార్థులకు పరిశోధన,సృజనాత్మక తాను పెంపొందించే వేదికలని ఆయన చెప్పారు. మన నిర్మాణాలు కేవలము కట్టడాలకే పరిమితము కాకుండా ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు దోహద పడాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉద్బోధించారు.



## వాణిజ్య సంస్థలపై ఆకస్మిక దాడులు

- పౌర సరఫరాల శాఖ అధికారుల చర్యలు
- 60 గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

హన్మకొండ ప్రతినిధి మార్చి 12 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రపౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు గురువారం హన్మకొండ నగరంలోని వాణిజ్య సంస్థలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీలలో వాణిజ్య అవసరాలకు అక్రమంగా వినియోగిస్తున్న 60 గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగించినందుకు సంబంధిత వ్యక్తులపై అవసరమైన కేసులు నమోదు చేసి, అత్యవసర వస్తువుల చట్టం సెక్షన్ 6 ఏ కింద చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. గృహ వినియోగానికి కేటాయించిన ఎల్పీజీ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ, ఇలాంటి అక్రమాలపై భవిష్యత్తులో కూడా కఠిన చర్యలు కొనసాగుతాయని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎన్ఫోర్స్మెంట్ టీం సభ్యులు డిటి భద్రునాయక్, వేణుగోపాల్, సదానందం పాల్గొన్నారు.

## చిరంజీవిని కలిసిన దిల్‌రాజు, ప్రియాంక

- గద్దర్ అవార్డుల ఫంక్షన్‌కు ఆహ్వానం

హైదరాబాద్, మార్చి12 (జనంసాక్షి) : తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ వేడుకల్లో పాల్గొనాల్సిందిగా మెగాస్టార్ చిరంజీవిని తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్ రాజు, మేనేజింగ్ డైరెక్టర్ ప్రియాంక కోరారు. అలాగే గద్దర్ అవార్డును స్వీకరించాల్సిందిగా అభ్యర్థించారు. గురువారం మెగాస్టార్ చిరంజీవి వీరు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్టాత్మక 'ఎన్టీఆర్ నేషనల్ ఫిలిం అవార్డు' ను స్వీకరించాల్సిందిగా వారు చిరంజీవిని సాదరంగా ఆహ్వానించారు. మార్చి 19, హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా జరగనున్న అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి విచ్చేసి, ఈ గౌరవాన్ని అందుకోవాలని వారు కోరారు.

# ప్రపంచాన్ని ఆర్థికంగా దెబ్బకొట్టే విధంగా ట్రంప్ ఎత్తుగడలు




ప్రపంచ రాజకీయాలు గత కొన్ని దశాబ్దాలుగా వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా 2016 తరువాత అంతర్జాతీయ రాజకీయ వ్యవస్థలో కొత్త మార్పులు ప్రారంభమయ్యాయి. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ చేపట్టిన విధానాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావాన్ని చూపించాయి. దేశ ప్రయోజనాలను ముందుకు తీసుకురావాలనే నినాదంతో ఆయన అనుసరించిన విధానాలు ప్రపంచ వాణిజ్య సంబంధాలు, అంతర్జాతీయ పెట్టుబడులు, ఇంధన మార్కెట్లు, వ్యవసాయ దిగుమతులు, ఉద్యోగ రంగం వంటి అనేక రంగాలపై తీవ్ర ప్రభావం చూపాయి.

ప్రపంచం ఇప్పటికే ప్రాంతీయ యుద్ధాలు, రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య వివాదాలతో ఆర్థికంగా అస్థిరతను ఎదుర్కొంటున్న సమయంలో ట్రంప్ విధానాలు మరింత కలవరాన్ని సృష్టించాయని అనేక ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2008 ప్రపంచ ఆర్థిక మాంద్యం తరువాత క్రమంగా కోలుకుంటున్న దేశాలు మళ్లీ వాణిజ్య యుద్ధాలతో ముందుకు సాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమెరికా–చైనా మధ్య వాణిజ్య పోరు తీవ్రరూపం దాల్చడం, అనేక దేశాలపై అధిక సుంకాలు విధించడం వంటి చర్యలు ప్రపంచ వాణిజ్య వృద్ధిని 2 శాతం వరకు తగ్గించాయని ప్రపంచ వాణిజ్య సంస్థ నివేదికలు చెబుతున్నాయి.

ట్రంప్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యం అమెరికా దేశీయ పరిశ్రమలను రక్షించడం. ఈ లక్ష్యంతో అనేక దేశాల నుంచి దిగుమతులపై అధిక పన్నులు విధించడం జరిగింది. ఉక్కు, అల్యూమినియం వంటి వస్తువులపై సుంకాలు విధించడం అనేక దేశాల పరిశ్రమలకు తీవ్ర నష్టాన్ని కలిగించింది. ప్రపంచం పరస్పరం ఆధారపడే వాణిజ్య వ్యవస్థను అనుసరిస్తున్న నేపథ్యంలో ఒక దేశం తీసుకునే నిర్ణయం ఇతర దేశాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంది. దీనివల్ల ప్రపంచ సరఫరా వ్యవస్థలో అంతరాయం ఏర్పడి, ఉత్పత్తి ఖర్చులు పెరిగి, ఆర్థిక అస్థిరత మరింత తీవ్రమవుతోంది.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇంధన వనరులు కీలక పాత్ర పోషిస్తాయి. చమురు, వాయువు వంటి వనరులు ప్రపంచ వ్యాపార వ్యవస్థకు పునాది. రాజకీయ ఉద్రిక్తతలు పెరిగినప్పుడు మొదట ప్రభావం పడేది ఇంధన మార్కెట్లపైనే. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ముడి చమురు అవసరాలలో 85 శాతం విదేశీ దిగుమతులపై ఆధారపడి ఉన్నాయి. అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతలు పెరిగినప్పుడు చమురు ధరలు వేగంగా పెరుగుతాయి.

2022లో ఒక బారెల్ చమురు ధర 120 డాలర్లకు చేరుకోవడం భారతదేశం వంటి దేశాల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపింది. ఇంధన ధరల పెరుగుదల అన్ని రంగాలపై ప్రభావం చూపుతుంది. రవాణా ఖర్చులు పెరగడం వల్ల ఆహార వస్తువుల ధరలు పెరుగుతాయి. దీనివల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుంది. భారతదేశంలో 2022లో ద్రవ్యోల్బణం 7 శాతం వరకు చేరడం ఇంధన, ఎరువులు, ఆహార ఖర్చుల పెరుగుదల వల్లే అని ఆర్థిక విశ్లేషణలు చెబుతున్నాయి. వ్యవసాయ రంగంపై కూడా తీవ్ర ప్రభావం పడుతోంది. భారతదేశం వ్యవసాయాధారిత దేశం. ఎరువులు, విత్తనాలు, యంత్రాలు విదేశీ దిగుమతులపై ఆధారపడి ఉన్నాయి. 2021లో ఎరువుల ధరలు 40 శాతం పెరగడం రైతులపై అదనపు భారం మోపింది.


పారిశ్రామిక రంగంలో కూడా సమస్యలు తీవ్రమవుతున్నాయి. ముడి పదార్థాలు, యంత్రాలు, సాంకేతిక భాగాలు విదేశీ మార్కెట్ల నుంచి వస్తాయి. వాణిజ్య యుద్ధాలు, రాజకీయ ఉద్రిక్తతలు పెరిగినప్పుడు సరఫరా వ్యవస్థలో అంతరాయం ఏర్పడుతుంది. ఉత్పత్తి ఖర్చులు పెరిగి, ఉత్పత్తి తగ్గుతుంది. దీనివల్ల ఉద్యోగ అవకాశాలు తగ్గుతాయి. ప్రపంచ వ్యాప్తంగా నిరుద్యోగం 5 శాతం వరకు పెరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో యువతపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

అభివృద్ధి చెందుతున్న దేశాల పరిస్థితి మరింత సవాలుగా మారుతోంది. భారతదేశం వంటి దేశాలు ఇంధన వనరులు, సాంకేతిక పరికరాలు, వ్యవసాయ పదార్థాలలో విదేశీ ఆధారపడక తప్పదు. అంతర్జాతీయ పరిస్థితులు మారినప్పుడు దేశీయ ఆర్థిక వ్యవస్థ కూడా ప్రభావితమవుతుంది. పెట్టుబడిదారులు రాజకీయ అస్థిరతను చూసి పెట్టుబడులు తగ్గిస్తున్నారు. దీనివల్ల అభివృద్ధి ప్రాజెక్టులు మందగిస్తున్నాయి.

భవిష్యత్తు దిశ ఏమిటి? ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉండాలంటే దేశాల మధ్య సహకారం అవసరం. వాణిజ్య పరిమితులు, రాజకీయ ఉద్రిక్తతలు తగ్గాలి. అభివృద్ధి చెందుతున్న దేశాలు స్వదేశీ ఉత్పత్తిని పెంచుకోవాలి. ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించాలి. సౌరశక్తి, గాలిశక్తి, జలవిద్యుత్ వంటి పునరుత్పాదక వనరులను విస్తరించాలి. వ్యవసాయంలో ఆధునిక సాగు పద్ధతులు, పంటల వైవిధ్యం, నీటి సంరక్షణ అవసరం. పారిశ్రామిక రంగంలో నూతన ఆవిష్కరణలు, సాంకేతికతను స్వీకరించాలి.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఒక మార్పు దశలో ఉంది. ట్రంప్ విధానాలు ప్రారంభించిన వాణిజ్య పోటీ ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితిని పెంచింది. ఇంధన ధరల పెరుగుదల, వాణిజ్య పరిమితులు, యుద్ధ పరిస్థితులు కలిసి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అస్థిరంగా మార్చుతున్నాయి. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఇది పెద్ద సవాలు. దేశాలు పరస్పర సహకారంతో ముందుకు సాగితేనే ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుంది. లేకపోతే రాజకీయ పోటీ, వాణిజ్య వివాదాలు కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరోసారి పెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సారాంశంగా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఏర్పడుతున్న మార్పులు కేవలం ఒక దేశానికి మాత్రమే పరిమితం కావు. అవి ప్రపంచ వ్యాప్తంగా ప్రభావం చూపుతాయి. అందువల్ల దేశాలు పరస్పర సహకారం, సమన్వయం, సమతుల్య విధానాలతో ముందుకు సాగాలి. స్వయం సమృద్ధి లక్ష్యంగా వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, సాంకేతిక రంగాలను బలోపేతం చేయాలి. అప్పుడు మాత్రమే ప్రపంచ ఆర్థిక మార్పుల ప్రభావాన్ని తగ్గించుకోవడం సాధ్యమవుతుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# పత్తిపాకకు గత విధ్వంసం



ఒక హెచ్చరిక..!

## 'చింతలొద్ది' 'న్యాతికుంట' గుట్టల్లో గుట్టుగా 'క్రషర్' సర్వే

"ఒక గుట్టను సృష్టించడానికి ప్రకృతికి కొన్ని లక్షల ఏళ్లు పడుతుంది. కానీ మనిషి తన స్వార్థం కోసం దానిని కొద్ది నెలలు, కొన్ని ఏండ్లలోనే నామరూపాల్లేకుండా చేస్తున్నాడు." ఇందుకు హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని పత్తిపాక గ్రామ శివారులోని ఒక గుట్ట కనుమరుగు కావడమే సాక్ష్యం. గతంలో జరిగిన విచ్చలవిడి మైనింగ్‌కు ఒక గుట్ట పూర్తిగా నామరూపాల్లేకుండా పోగా, ఇప్పుడు పక్కనే ఉన్న మరో సహజ సంపదపై కొందరి కన్ను పడింది. ఇక్కడ గతంలో ఏర్పాటు చేసిన స్టోన్ క్రషర్ వల్ల ఒక కొండ అస్తిత్వమే కోల్పోయింది. నిబంధనలను అతిక్రమించి, భూమి పొరల్లోకి వందల అడుగుల మేర లోతుగా తవ్వకాలు జరిపి గుట్టను మింగేశారు. ఇప్పటికే ఒక గుట్ట ఆనవాళ్లు కనుమరుగైతే ఇప్పుడు మరో గుట్టను పిండి చేసేందుకు రంగం సిద్ధమవుతోందని విశ్వాసనీయ సమాచారం.

### గుట్టుగా 'చింతలొద్ది' ' చిర్రకుంట' గుట్టల్లో సర్వే..!?

పత్తిపాక శివారు చింతలొద్ది, 'న్యాతికుంట' ఏరియాలోని గుట్టలను లక్ష్యంగా చేసుకుని మైనింగ్ మాఫియా పావులు కదుపుతోంది. ప్రజలకు తెలియకుండానే గుట్టుచప్పుడు కాకుండా సర్వేలు నిర్వహిస్తున్నారు. ఈ గుట్టను కూడా క్రషర్ల పాలు చేస్తే భవిష్యత్తులో ఆ గుట్ట సైతం కనుమరుగవడం ఖయంగా కనిపిస్తోంది. ఒక ఊరి భౌగోళిక స్వరూపం మారడానికి శతాబ్దాలు పడుతుంది. కానీ, పత్తిపాక గ్రామ స్వరూపమైన ఆ గ్రామ శివారులోని ఒక భారీ గుట్ట కళ్లముందే మ్యాప్ నుంచే మాయమైపోయింది. ఇది అభివృద్ధికి నిదర్శనమా..? లేక అడ్డగోలు దోపిడీకి పరాకాష్ట..? అనే ప్రశ్నలు ఇప్పుడు మేధావులను, పర్యావరణ ప్రేమికులను, పత్తిపాక గ్రామంలోని చైతన్యవంతులైన ప్రజల్లో కలుగకుంటే చలనం లేనట్లే అవుతుంది. గతంలో జరిగిన తప్పిదమే పునరావృతమవుతూ, ఇప్పుడు చింతలొద్ది, చిర్రకుంట గుట్టలపై మైనింగ్ మాఫియా కన్ను పడటం స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగించకుంటే ఆ ఊరు భవిష్యత్తుకు మూల్యం చెల్లించక తప్పదు. గతంలో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన అక్రమ మైనింగ్‌పై క్రషర్ నిర్వహణ పట్ల అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదు..? అడుగు భాగం వరకు తోడేసినా మైనింగ్ విజిలెన్స్, పొల్యూషన్ తదితర విభాగానికి ఎందుకు కనిపించడం లేదు..? స్థానిక ప్రజాప్రతినిధులు ఈ ప్రకృతి విధ్వంసంపై మౌనం వహించడానికి కారణమేంటి..? అనే ప్రశ్నలకు సమాధానం వెతుకాల్సిన అవసరం కూడా లేకపోలేదు

### మేల్కొనకపోతే నష్టం తప్పదు...

మైనింగ్ నిబంధనల ప్రకారం ఒక గుట్టను తవ్వేటప్పుడు నిర్దేశించిన లోతు కంటే ఎక్కువ తవ్వకూడదు. కానీ పత్తిపాకలో పరిస్థితి ఇందుకు విరుద్ధం. గతంలో క్రషర్ పెట్టన గుట్ట కనుమరుగవ్వడమే ఇందుకు సాక్ష్యంగా చూడాలి. ప్రస్తుతం సర్వే జరుగుతున్న గుట్టలు కూడా కేవలం రాళ్ల కుప్పలు కావు. అవి స్థానిక పర్యావరణ వ్యవస్థకు పట్టుగొమ్మలు అని మరువొద్దు. అంతేకాదు గుట్లు కనుమరుగైతే వర్షపు నీరు భూమిలోకి ఇంకే మార్గం ఉండదు. భవిష్యత్తులో తీవ్ర నీటి ఎద్దడి తప్పదు. క్రషర్ల వల్ల వచ్చే దుమ్ము, ధూళి ఊపిరితిత్తుల వ్యాధులకు కారణమవుతాయి. పంటపొలాలకు నష్టం ఏర్పడుతుంది. పశువుల మేతకు, పక్షుల ఆవాసానికి ఈ గుట్టలే ఆధారం. ఇవి లేకపోతే జీవవైవిధ్యం దెబ్బతింటుంది. ఒకరకంగా ఊరి స్వరూపం ఆనవాళ్లు చరిత్రలో మిగులవు. అందుకోసమే "అభివృద్ధి" పేరుతో జరుగుతున్న ఈ "వినాశనాన్ని" చూస్తూ ఊరుకుంటే, రేపటి తరం పత్తిపాక మ్యాప్‌లో గుట్టలను కేవలం ఫోటోల్లోనే చూడాల్సి వస్తుంది.



రాజేందర్ దామెర (దారా)
సీనియర్ జర్నలిస్ట్
సహజ వనరుల పరిరక్షణ వేదిక
వ్యవస్థాపక అధ్యక్షులు

# డిజిటల్ వేదికపై అక్షర సేద్యం

## "తెలుగు పరిశోధకులు" వాట్సాప్ సమూహం



నేడు ఉన్న పరిస్థితుల దృష్ట్యా సోషల్ మీడియా అంటే కేవలం వినోదానికో, కాలక్షేపానికో పరిమితమైన సాధనం మాత్రమే కాదు, అది జ్ఞానాన్ని పంచుకోవడానికి, విజ్ఞానాన్ని విస్తరించడానికి ఒక అద్భుతమైన వేదిక. వాట్సాప్ వంటి మొబైల్ యాప్ ద్వారా సమాచారాన్ని ప్రపంచంలోని ఏ మూలకైనా క్షణాల్లో చేరవేయడంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తుంది. ఈ వాట్సాప్ రాకముందు గతంలో సాహిత్య ప్రపంచంలో ఏదైనా మార్పు వచ్చినా, కొత్త పరిశోధన జరిగినా, లేదా ఒక సదస్సు నిర్వహించినా ఆ సమాచారం కోసం పత్రికల ప్రకటనల మీదో, పోస్టులో వచ్చే ఉత్తరాల మీదో ఆధారపడాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు సాంకేతికత పుణ్యమా అని, ఒకే ఆసక్తి ఉన్న వ్యక్తులందరినీ ఒకే చోట చేర్చి, ఒక సెకన్ కాలంలోనే విలువైన సమాచారాన్ని అందించేలా వాట్సాప్ గ్రూపులు సామాజిక చైతన్యాన్ని కలిగిస్తున్నాయి. ఇలాంటి సానుకూల ధోరణికి అద్దం పడుతూ, తెలుగు సాహిత్య లోకంలో విశేష గుర్తింపు పొందింది "తెలుగు పరిశోధకులు" వాట్సాప్ గ్రూప్. డా. ఇడికోజు శ్రీనివాసా చారీ గారు నిర్వహిస్తున్న ఈ వాట్సాప్ సమూహం ద్వారా వందలాది మంది మేధావులను ఒకే గొడుగు కిందకు తెచ్చారు

తెలుగు సాహిత్య పరిశోధన రంగంలో అడుగుపెట్టే వారికి తాజా సమాచారం అందించాలనే దృఢ సంకల్పంతో ఈ ప్రయాణం మొదలైంది. 2014వ సంవత్సరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం వేదికగా ఈ సాహిత్య వేదిక అంకురించింది. నాటి నుండి నేటి వరకు ఇది నిరంతరాయంగా తన సేవలను కొనసాగిస్తోంది. శ్రీనివాసా చారీ గారు తనకున్న అపారమైన అనుభవాన్ని, సాహిత్యం పట్ల ఉన్న మక్కువను జోడించి ఈ గ్రూప్‌ను ఒక డిజిటల్ లైబ్రరీలా తీర్చిదిద్దారు. తెలుగు భాషా చైతన్యం కోసం ఏర్పడిన ఈ సమూహం, గడిచిన పదేళ్లుగా ఎంతో సమాచారం అందించింది. ఇది కేవలం ఒక గ్రూప్ మాత్రమే కాదు, తెలుగు భాషాభిమానులందరి వేదిక. ప్రస్తుతం తెలుగు సాహిత్యం లో ఉన్న మేధావులందరినీ ఒకే చోట కలపడం వల్ల సాహిత్యానికి సంబంధించిన ప్రతి చిన్న అంశాన్ని కూడా పాఠకులకు, పరిశోధకులకులతో పంచుకునే అవకాశం దొరికింది. దీనివల్ల తెలుగు సాహిత్యానికి సంబంధించిన సమాచారం మరింత వేగంగా ఒకరినుంచి మరొకరికి అందుతుంది.

తెలుగు సాహిత్య పరిశోధనలో వస్తున్న కొత్త ధోరణులు, సిద్ధాంతాలు మరియు విమర్శనా వ్యాసాలను పంచుకోవడం ద్వారా పరిశోధకులకు ఇదొక చిన్నపాటి తరగతిగదిలా పనిచేస్తోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా సాహిత్యం ఎలా మారుతుందో పలువురు మేధావులు రాసిన వ్యాసాలు ఇందులో పంపుతారు. ఈ వ్యాసాల ద్వారా సమాచారాన్ని ఈ సమూహంలో ఉన్న అందరితోబాటు యువ పరిశోధకులకు ఎంతో మేలు కలుగుతుంది. అంతర్జాతీయ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు జరిగే వివిధ సదస్సుల వివరాలను ఎప్పటికప్పుడు ఈ గ్రూప్‌లో పోస్ట్ చేస్తున్నారు. దీనివల్ల విద్యార్థులు, అధ్యాపకులు సమయానికి సమాచారం అందుకుని, తమ పరిశోధనా పత్రాలను సమర్పించే అవకాశాలను సులభంగా పొందగలుగుతున్నారు. గడువు ముగియక ముందే సమాచారం అందడం పరిశోధకులకు ఒక పెద్ద వరం. పరిశోధకులకు అవసరమైన ప్రామాణిక సమాచారం అందించడం ఈ సమూహం యొక్క ప్రత్యేకత. అనవసర చర్చలకు చోటులేకుండా కేవలం సాహిత్య సంబంధిత విషయాలకే ఇక్కడ ప్రాధాన్యత ఉంది. ఈ వేదిక ద్వారా ప్రతిరోజూ రెండు పుస్తకాల పి.డి.ఎఫ్ (గ్రంథ)లు అందించడం ఒక నియామంగా పెట్టుకున్నారు. ఒక గ్రంథాలయంలో దొరకని పుస్తకాలు కూడా ఇక్కడ డిజిటల్ రూపంలో లభిస్తున్నాయి. ఉదాహరణకు నా ప్రాష్ట్ర.ణ అంశానికి సంబంధించిన కొన్ని పుస్తకాలు కూడా ఈ సమూహం లో సాఫ్ట్ కాపీలు దొరికాయి. నేను వాటిని ప్రింట్ తీసుకోని చదువుకున్నాను. ఈ విషయంలో గ్రూప్ అడ్మిన్ మెసెజ్ పెట్టగానే నాకు కావాల్సిన పుస్తకాల సాఫ్ట్ కాపీనీ వెంటనే పంపారు వారికి ధన్యవాదములు.

పుస్తకాలతో పాటు వివిధ గ్రంథ సూచికలు మరియు ముఖ్యమైన విమర్శనా వ్యాసాల లింకులను పంచుకోవడం ద్వారా పరిశోధకులకు శ్రమ తగ్గుతోంది. తమ అంశానికి సంబంధించిన కొంత సమాచారం కోసం లైబ్రరీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, అరచేతిలోకే సమాచారం చేరుతోంది. దీనివల్ల ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో ఉండి పుస్తకాలు అందుబాటులో లేని పరిశోధకులకు ఉపయోగపడుతున్నాయి. ఇది భాషా వికాసానికి ఎంతగానో తోడ్పడుతోంది. గత కొన్నేళ్లుగా ఈ గ్రూప్ సాధించిన విజయాలు నిజంగా అమోఘం. ఎంతో మంది యువ పరిశోధకులు ఈ వేదిక ద్వారా సరైన సమయంలో సమాచారం పొంది, తమ పి.హెచ్.డి (గ్రాష్ట్రణ) వంటి ఉన్నత స్థాయి పరిశోధనలను విజయవంతంగా పూర్తి చేయగలిగారు. వారి విజయాల్లో ఈ సమూహం పాత్ర మరువలేనిది. భవిష్యత్తులో మరిన్ని కొత్త చర్చలు, సదస్సులు మరియు ప్రచురణల వివరాలను పంచుకుంటూ, తెలుగు భాషా–సాహిత్య సంపదను వచ్చే తరాలకు పదిలంగా అందించడమే ఈ వేదిక ప్రధాన ఉద్దేశ్యం. తెలుగు భాషా వైభవాన్ని చాటిచెప్పడానికి ఈ డిజిటల్ వేదిక ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతోంది. తెలుగు సాహిత్యం పరిశోధనలతోనే మరింత విస్తరిస్తుంది, పరిశోధకుల సహకారంతోనే భవిష్యత్తు తరాలకి అందుతుంది. "తెలుగు పరిశోధకులు" గ్రూప్ నేడు తెలుగు సాహిత్య రంగంలో ఒక అనివార్యమైన శక్తిగా ఎదిగింది. సాహిత్యం పట్ల మక్కువ ఉన్న ప్రతి ఒక్కరికీ, ప్రతి పరిశోధకుడికి చాలా విలువైన సమాచారం అందిస్తుంది.

పల్లె సతీష్
Ph.D తెలుగు రీసెర్చ్ స్కాలర్ OU
చరవాణి : 9010953659

## ఇది కల కాదు

ఆర్యులు ఇక్కడివాళ్ళే!
ఎక్కడినుంచో రాలేదు!
కొత్తరాగం మొదలెట్టారు!
కట్టడాలు కూల్చటం
పాత పేర్లుమార్చటం
గాడ్సే పూజనీయుడా?
ఏంటిది?ఎందుకిదంతా?
దేశంలో మతోన్మాదం!
ప్రపంచసామ్రాజ్యవాదం!
ఇదంతాఏమిటోతెలుసా
ప్రజల్లోపెరుగుతున్న
సమాజ చైతన్యం!
దోపిడీ రక్కసులకు
ఊపిరాడనివ్వటంలేదు!
చరిత్రకు, సిద్ధాంతాలకు
కొత్త కొత్త వ్యాఖ్యనాలు
(అనుకూలఅబద్ధాలు )
అల్లుకుంటూ పోతారా?
ఎవరి గొప్పలు వారు
చెప్పుకుంటూ పోతారా?
మిగిలేదేమీఉండదు!
అంతా మారణ కాండ!
మీకు ఎలాగూ
ఇవి అంతిమ దినాలే!
సామ్రాజ్య వాదం
పేలి పోవటం ఖాయం!
మార్క్స్ చెప్పింది సత్యం
ప్రగతి శీలురంతా
ఏకమౌదాం రండి!
వర్తమానంఎలావుందో
ఉన్నపరిస్థితికి
అనుగుణంగా
అడుగులువేద్దాం!
సహకరించుకుందాం
ఆదుకుందాం-ప్రేమైక
భావంతో జీవిద్దాం!
పాతవి ఏవీ కెలకొద్దు
మనది మానవ జాతి
మనది మానవ మతం
మనది మానవ కులం
సహజవనరులకు
మానవశ్రమనుజోడించి
వస్తుసామాగ్రి సృష్టిద్దాం!
సొంతమార్కెట్లుకాదు
సహకారమార్కెట్లతో
ఇచ్చిపుచ్చుకుందాం!
మిగులుసంపద అంతా
సమాజాభివృద్ధికే!
దోపిడీకి స్థానం లేదు!
సౌభాగ్యంవెల్లివిరియాలి!
యుద్ధాలులేని ప్రపంచం!
అందుకుసన్నద్ధమౌదాం!
అప్పుడుభూమిపైనేకాదు
అన్నిగ్రహాలలోనూ స్వర్గం
సృష్టించగలుగుతాం!
ఇలాంటి'కల'కందాం!
'కలనిజం'చేసుకుందాం!
'సొంతలాభాలు'వదిలేస్తే
'లాభలపోటీ' ఉండదు!
పోటీ ఉచ్చులో ఇన్నాళ్లు
కక్ష వివక్షలు పెంచే సారు !
దీనినుండి బైట పడదాం!
సమసమాజంసృష్టిద్దాం !
ఇదికలకాదు ఇదినిజం!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్



## దుఃఖరేఖలు

చుట్టూ గీత
వృత్తరేఖ
అందులో బావిలోని కప్పలాగ
అడ్డు గీతల ఆచారాల్లో ఊగిసలాట
నిలువుగీతల ఉపదేశాల్లో లేనిఊరట
లక్ష్మణ రేఖలు
దాటితే చావులు
భర్తచనిపోతే
సరళరేఖలో నడకలు
చూపుల కోణ రేఖలు
కొంటె కోణాలు
నవ్వుల పాలు...
వృత్తపరుదులు
వ్యాసాల హద్దులు
బాధల రేఖల్లో బందిఖాన
మహిళా ఆరోజుల్లో ఈరోజుల్లో...
గీతల రేఖల అర్థాలు అనార్థాలు
ఇంకినవి మారాలి
వాటి ఉనికి మారాలి
స్వేచ్ఛ జీవితపు అందమైన ఊహ
మహిళ కలలుపూలై కాయలై పండ్లైతే
పండువెన్నల బతుకున కాసినంత
గ్రహణం విడవక తప్పదు
క్రాంతికిరణం పొడసూపక తప్పదు

రేడియమ్
9291527757

# భారత ఆహార భద్రతపై గల్ఫ్ యుద్ధ ప్రభావం




ప్రస్తుతం పరిషియన్ గల్ఫ్ లో మండుతున్న అగ్ని కేవలం ఆ ప్రాంతాన్ని మాత్రమే కాల్చేస్తోందనుకోవడం పొరపాటు. దాని ప్రభావం భారత పంట పొలాల పై తీవ్రస్థాయిలో పడుతుంది. హార్మోజ్ జలసంధి మూసివేత అనేది ఓ భౌగోళిక సమస్య మాత్రమే కాదు. అది మన వ్యవసాయ వ్యవస్థను నేరుగా ఢీకొట్టే ప్రళయం. ఈ సంక్షోభం తీవ్రతను అర్థం చేసుకోవాలంటే భారత్ ఎరువుల స్వయం సమృద్ధి విషయంలో ఎంత లోతైన లోపాలతో బాధపడుతోందో తెలుసుకోవాలి.

మన దేశంలో యూరియా ఉత్పత్తి సామర్థ్యం గతంలో కంటే పెరిగిన మాట వాస్తవం.గత పదేళ్ళలో దాదాపు 35 శాతం అదనపు ఉత్పత్తి సాధించాం. కానీ, ఈ సాధన వెనుక ఓ పెద్ద లోపాలు కూడా ఉన్నాయి. యూరియా తయారీకి కావాల్సిన సహజ వాయువులో 85 శాతం మనం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిందే . ఫాస్ఫేటిక్ ఎరువుల విషయానికి వస్తే పరిస్థితి మరీ దారుణం. మనకు కావాల్సిన రాక్ ఫాస్ఫేట్ లో కేవలం 5 శాతం మాత్రమే స్వదేశీ గనుల నుంచి సమకూరుతోంది. పొటాష్ ఎరువుల్లోనైతే పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడి ఉన్నాం . ఈ లెక్కల ప్రకారం, భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ఎరువులు, ఎరువుల ముడి పదార్థాల దిగుమతిదారుగా మారిపోయింది .

ఇప్పుడు హార్మోజ్ జలసంధి మూసివేత అంటూ వార్తలు వస్తున్నాయి. మార్చి 1 నుంచి అటుగా నౌకాయానం నిలిచిపోయింది . ఈ జలసంధి గుండానే ప్రపంచంలోని ముడి చమురులో దాదాపు 30 శాతం, ద్రవీకృత సహజ వాయువులో 20 శాతం రవాణా అవుతుంది . భారత్ దిగుమతి చేసుకునే ముడి చమురులో 40–50 శాతం, ఎల్ఎన్జిలో 50–60 శాతం ఈ మార్గం గుండానే వస్తుంది . అంటే, మన పారిశ్రామిక సిరల్లో సగం ఇక్కడే గడ్డకట్టినట్లు అయింది. ఇరాన్, ఖతార్ వంటి దేశాల్లో యుద్ధ కారణంగా ఎరువుల ఉత్పత్తి ఇప్పటికే తగ్గిపోయింది .

ఈ పరిణామాల ప్రభావం ధరలపై తీవ్రంగా పడింది. ఫిబ్రవరి చివరి వారంలో టన్ను ఎరువు ధర 460 డాలర్లుగా ఉండగా, యుద్ధం మొదలైన కొద్ది రోజుల్లోనే అది 665 డాలర్లకు చేరుకుంది . అమెరికా మార్కెట్లో యూరియా ధర టన్ను 550 డాలర్లకు చేరింది, కేవలం ఒక వారంలోనే 70 డాలర్లు పెరిగింది . భారత్ లో ఎరువుల ధరలు 30 నుంచి 40 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు . ఇక బీమా, రవాణా ఖర్చులు కూడా విపరీతంగా పెరిగిపోయాయి.

మన దేశ ఎరువుల కంపెనీలు మొరాకోతో 25 లక్షల మెట్రిక్ టన్నుల డిఎపి, టిఎస్పి సరఫరా ఒప్పందం కుదుర్చుకున్నాయి . సౌదీ అరేబియాతో ఏటా 31 లక్షల మెట్రిక్ టన్నుల డిఎపి సరఫరాకు ఐదేళ్ల ఒప్పందం కుదిరింది. ఇవి మంచి చర్యలే. కానీ, ఈ ఒప్పందాలు కూడా సముద్ర మార్గం మీద ఆధారపడి ఉండాల్సిందే. హార్మోజ్ జలసంధి మూసివేత ఎప్పటివరకు కొనసాగుతుందో తెలియని పరిస్థితుల్లో ఈ ఒప్పందాల ప్రయోజనం కూడా నిలిచిపోయే ప్రమాదం ఉంది.

ఇది కేవలం ప్రస్తుత సంక్షోభం మాత్రమే కాదు, రానున్న రోజుల్లో మరింత తీవ్రమయ్యే ముందస్తు హెచ్చరిక. యుద్ధం కారణంగా ఇంధన సరఫరా దెబ్బతింటే, ఎరువుల ఉత్పత్తి ఆగిపోతుంది. ఎరువులు లేకపోతే పంటలు పండవు. పంటలు పండకపోతే ఆహార ధరలు ఆకాశాన్నంటుతాయి. ఈ గొలుసులో ప్రతి లింక్ భారత్ ను నేరుగా ప్రభావితం చేస్తుంది. ఎందుకంటే, మన దేశం అధిక జనాభా కలిగిన దేశం. మన ఆహార భద్రత వ్యవసాయం పై , అలాగే ఎరువులపై భారీగా ఆధారపడి ఉంది. రైతులకు చవకగా ఎరువులు అందించడానికి ప్రభుత్వం భారీ మొత్తంలో సబ్సిడీ ఇస్తోంది. కానీ, అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పెరిగితే ఈ సబ్సిడీ భారం మరింత పెరిగి, ద్రవ్యలోటు పెరిగే ప్రమాదం ఉంది .

ఇక్కడ మరో లోతైన సమస్య కూడా ఉంది. మొక్కల పెరుగుదలకు అవసరమైన నైట్రోజన్ పూర్తిగా సహజ వాయువుతో ముడిపడి ఉంటుంది. సల్ఫర్ కూడా చమురు, గ్యాస్ ప్రాసెసింగ్ నుంచే లభిస్తుంది. అంటే, ఇంధనం, ఎరువులు, ఆహారం ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. ఇంధన సరఫరా ఆగిపోతే మూడూ ఆగిపోయినట్లే. ఈ వాస్తవాన్ని గుర్తించి, దీర్ఘకాలిక వ్యూహం రూపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రస్తుత సంక్షోభం మనకు ఓ పాఠం చెప్పకుండానే బయటకు వెళ్ళిపోతుందా? సహజ వాయువు సరఫరా గొలుసును, ఎరువుల దిగుమతి మార్గాలను ఒకే చోట కేంద్రీకరించకుండా, విభిన్న వనరుల నుంచి సమకూర్చుకోవడం అనేది ఇకపై ఎంపిక కాదు, ఆవశ్యకత. అలాగే, హరిత అమోనియా, నానో ఎరువులు వంటి ప్రత్యామ్నాయాలపై పరిశోధనలు, పెట్టుబడులు పెంచాల్సిన అవసరం ఉంది . ఇవి కేవలం సాంకేతిక అభివృద్ధి మాత్రమే కాదు, భవిష్యత్ సంక్షోభాల నుంచి మన వ్యవసాయాన్ని కాపాడే వ్యూహం కూడా.

హార్మోజ్ జలసంధి మూసివేత అనేది ఒక్కసారిగా వచ్చిపడిన తాత్కాలిక సమస్య కాదు. అది భారత్ యొక్క నిర్మాణాత్మక బలహీనతలను బట్టబయలు చేస్తుంది. ఈ బలహీనతలను సరిదిద్దుకోకపోతే, రేపు మరో యుద్ధం, మరో సంక్షోభం మన పంటలను, పొలాలను మాత్రమే కాదు, మన ఆహార భద్రతనే ప్రశ్నార్థకంగా మార్చే ప్రమాదం ఉంది. అప్పుడు, "యుద్ధం ఎక్కడో జరుగుతోంది, మనకేమిటి?" అనే ప్రశ్న వేసుకునే స్థితిలో మనం ఉండం.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# గ్రామాభివృద్ధి లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు పనిచేయాలి

- ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందేలా చూడాలి
- మున్సిపల్ చట్టాలపై పూర్తి అవగాహన అవసరం



**సంగారెడ్డి ప్రతినిధి , మార్చి 12 (జనం సాక్షి) :** గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు పనిచేయాలని అలాగే నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. గురువారం ,సంగారెడ్డి జిల్లా కంది ఎల్.ఎన్. కన్వెన్షన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య నేతృత్వంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్లు, గ్రామ సర్పంచులు, కౌన్సిలర్లకు ఏర్పాటు చేసిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమ అవగాహన సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ... ప్రతి ప్రజాప్రతినిధికి తన గ్రామం, పట్టణం అభివృద్ధి చేయాలనే లక్ష్యం ఉంటుందని, అందుకోసం పంచాయతీరాజ్, మున్సిపల్, అటవీ శాఖ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌ను ఐదు దశలు, పది అంశాలుగా రూపొందించిందని తెలిపారు. మార్చి 6నుండి జూన్ 12 వరకు నిర్వహించే ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ మంత్రి దామోదర్ పిలుపునిచ్చారు. గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే నిధులు ఎలా సమకూర్చుకోవాలి, గ్రామాల్లో రెవెన్యూ, అటవీ భూములను రక్షించుకోవడం, పంచాయతీరాజ్ చట్టాలను సర్పంచులు తెలుసుకోవడం చాలా ముఖ్యమని అన్నారు. నేర్చుకుంటూ ముందుకు సాగితేనే అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి సూచించారు.

### ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక విజయవంతం చేయాలి

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక భాగంగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు, పోలీస్, రవాణా శాఖల ద్వారా రహదారి భద్రతపై అవగాహన, ట్రాఫిక్ నియమాలఅమలు, సంక్షేమ పథకాల అమలులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించడం, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, హాస్టళ్ల పరిశుభ్రతపై పర్యవేక్షణ చేయాలని సూచించారు. రైతులకు పంటలపై మార్గదర్శకాలు, బీమా పథకాల అవగాహన, ఎరువులు-విత్తనాల లభ్యత, విద్యా రంగంలో పాఠశాలల మౌలిక వసతుల మెరుగుదల, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణ, పోటీ పరీక్షల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. టి.జి.ఐ.ఐ.సీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రజల కోసమేనని, ప్రజాప్రతినిధులు ప్రజల్లో ఉండి అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని అన్నారు. జహీరాబాద్ నిమ్జ్ పారిశ్రామిక ప్రాంతం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ ప్లాస్టిక్ నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫయిమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, గ్రామ సర్పంచులు, కౌన్సిలర్లు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గీతాంజలి విద్యార్థులకు జిల్లా ర్యాంకులు



**ఖమ్మం టౌన్, మార్చి 12 (జనంసాక్షి) :** ఖమ్మం పట్టణం శ్రీనివాసనగర్ లోని గీతాంజలి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు పి.నవదీప్, యు.వేదశ్రీలు ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ లో అద్వితీయమైన ప్రతిభ కనబరిచి జిల్లా ర్యాంకులు కైవసం చేసుకున్నారు. పి. నవదీప్ కు జిల్లా మొదటి ర్యాంకు, యు వేదశ్రీ కి జిల్లా స్థాయి 8వ ర్యాంకు సాధించారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) వారు జిల్లా స్థాయిలో 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. దాదాపు జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ టాలెంట్ టెస్ట్ కు హాజరయ్యారు. ఈ టాలెంట్ టెస్ట్ లో పి. నవదీప్ కు జిల్లా మొదటి ర్యాంకు, యు . వేదశ్రీ కి జిల్లా స్థాయి 8 వ ర్యాంకు సాధించారు . పాఠశాల కరస్పాండెంట్ టి .వి .అప్పారావు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు తామిచ్చే అకడమిక్ స్టాండర్డ్ వల్లే ఈ ర్యాంకులు సాధ్యమయ్యాయని తెలిపారు. జిల్లా స్థాయి మొదటి ర్యాంకు సాధించిన పి. నవదీప్ ను, జిల్లా స్థాయి 8వ ర్యాంక్ సాధించిన యు. వేదశ్రీ ని పాఠశాల డైరెక్టర్లు టి . పద్మ, టి.అరుణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

## గడప గడపకూ కాంగ్రెస్ ప్రజాపాలన చేరాలి

- అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలి
- మంత్రి దామోదర్ రాజనర్సింహ
- టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



**సంగారెడ్డి టౌన్, మార్చి 12 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సంగారెడ్డి జిల్లాలోని మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లు, గ్రామ పంచాయతీల సర్పంచులు, మున్సిపల్ వార్డ్ కౌన్సిలర్లకు ఒక రోజు అవగాహన సదస్సు గురువారం కంది మండల కేంద్రం లోని ఎల్ఎన్ కన్వెన్షన్‌లో ఈ అవగాహన సదస్సు నిర్వహించారు ఈ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా 06.03.2026 నుండి 12.06.2026 వరకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో గురువారం ప్రజాప్రతినిధులకు ఈ కార్యక్రమం లక్ష్యాలు, అమలు విధానం ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ పథకాలపై. ప్రజా ప్రతినిదులకు అవగాహన కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజల ప్రభుత్వం అన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలని, కాంగ్రెస్ ప్రజా పాలన గడప గడపకు చేరాల ని అందుకు ప్రజా ప్రతినిధులందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీ ప్రభుత్వ పథకం మహిళల పేరు మీదే మంజూరు అవుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారత కు పెద్ద పీట వేస్తున్నదని వివరించారు.

### నర్సింగ్ కళాశాల విద్యార్థుల కోసం బస్ వితరణ

సంగారెడ్డి పట్టణం లోని మెడికల్ కళాశాల అనుబంధంగా ఉన్న నర్సింగ్ కళాశాల విద్యార్థుల కోసం తోషిబా సంస్థ తన సీఎస్సార్ నిధులతో బస్సు ను బహూకరించింది. మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి గురువారం కలక్టరేట్ ప్రాంగణం లో లాంఛనంగా బస్సు ను ప్రారంభించారు. ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో పలువురు రైతులకు పనిముట్లు, ట్రాక్టర్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య మున్సిపల్ చైర్మన్లు వైస్ చైర్మన్, గ్రామ సర్పంచులు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అసలైన అభివృద్ధి



**శేరిలింగంపల్లి, మార్చి 12 (జనంసాక్షి) :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించడంతోపాటు గడచిన పుష్కర కాలంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో సాధించిన ప్రగతి మాటలలో వర్ణించలేనిదని పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. ఈ మేరకు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, చందానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి కేటీఆర్ ను కలిసి 'ఇంటింటికి కేసీఆర్ చిత్రపటం - గడపగడపకు బిఆర్ఎస్ జెండా' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొంటూ గురువారం కేటీఆర్‌ను కలవడం జరిగింది. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నవతారెడ్డి తో కలిసి ఆయన మాట్లాడుతూ గత 60 సంవత్సరాలలో కేంద్రంలో, రాష్ట్రంలో మరే ప్రభుత్వం సాధించని ప్రగతిని కేవలం ఒక దశాబ్ద కాలంలో నిర్మాణాత్మకంగా చూపగలిగిందంటే దాని వెనక అపర భగీరథుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మాస్టర్ మైండ్ కారణమన్నారు. పారిశ్రామిక అభివృద్ధి రంగంలో విప్లవాత్మక మార్పులను చేపట్టి కేవలం దశాబ్ద కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో కనీసం 50 ఏళ్ల ముందుకి తీసుకెళ్లడం జరిగిందని, రాష్ట్రానికి అవసరమైన మౌలిక సదుపాయాలలో విద్య, వైద్యం, పారిశ్రామికీకరణ, ఉపాధి, విద్యుత్తు, రక్షిత మంచినీరు తదితర ఏ విభాగాన్ని తట్టిచూసినా గత ఆరు దశాబ్దాల కాలంలో సాధ్యం కాని అభివృద్ధి కళ్ళముందే సాక్షాత్కరిస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. నవతారెడ్డి మాట్లాడుతూ శేర్లింగంపల్లి నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన చందానగర్, దీప్తి శ్రీనగర్ డివిజన్లలో ఇంటి ఇంటికి కెసిఆర్ చిత్రపటం, గడపగడపకు బిఆర్ఎస్ జెండా, ప్రతి కుటుంబానికి ఒక గోడ గడియారం ను మహిళ దినోత్సవం నేపథ్యంలో అందజేయడం జరుగుతుందన్నారు. కాగా కేటీఆర్, శేరిలింగంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్చార్జి కృష్ణారావు చేతుల మీదుగా గోడ గడియారాన్ని, కెసిఆర్ చిత్రపటాన్ని ఆమె ఆవిష్కరింపజేశారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందాలి

- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, మార్చి 12 (జనంసాక్షి) :** నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపై ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు తీరుపై సంబంధిత శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల డిఈ, ఏఈ, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం



**గద్వాల టౌన్, మార్చి 12 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు, సర్పంచ్‌లకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరుతాయని తెలిపారు.ఏప్రిల్ 2న గ్రామసభలు,వార్డు సభలు నిర్వహించి ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలన,అక్షరాస్యత పెంపు,బాలికల విద్యాభ్యాసం ప్రోత్సాహం, పోషకాహార లోపాల నివారణ వంటి అంశాల్లో ప్రజాప్రతినిధులు చురుకుగా పనిచేయాలని కోరారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం,రహదారి భద్రత,డ్రగ్స్ నివారణ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో సూచించిన 10 అంశాలను గ్రామస్థాయిలో విజయవంతం చేసేందుకు యువత,విద్యార్థులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు.ముఖ్యంగా ఈ కార్యక్రమంకు బాల భవన్ చిన్నారుల నాట్య ప్రదర్శన అక్కడున్న అందరిని ఎంతో చక్కగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ,నర్సింగరావు, మున్సిపల్ చైర్మన్లు, జిల్లా అధికారులు,సర్పంచులు,కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# అత్తాపూర్‌లో గంజాయి విక్రయం

- ఇద్దరు అరెస్ట్
- 1.743 కిలోల గంజాయి స్వాధీనం, పరారీలో ఏడుగురు



**రాజేంద్రనగర్, మార్చి 12 (జనం సాక్షి) :** అత్తపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయానికి పాల్పడుతున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 1.743 కిలోల డ్రై గంజాయి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ఎన్డిపిఎస్ చట్టం కింద పలు సెక్షన్లపై కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.అత్తాపూర్ పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ టి. జయరాజ్ తెలిపిన వివరాల ప్రకారం, మార్చి 11న మధ్యాహ్నం సమయంలో అత్తాపూర్ పిలర్ నంబర్ 254 సమీపంలో ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయానికి సిద్ధమై ఉన్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, వారి వద్ద ఉన్న ఎరుపు, తెలుపు రంగు క్యారీ బ్యాగ్‌లో టేప్‌తో కట్టిన ప్యాకెట్‌లో డ్రై గంజాయి లభించింది. ఎలక్ట్రానిక్ తూకం ద్వారా కొలిచినప్పుడు గంజాయి బరువు 1.743 కిలోలుగా నిర్ధారించారు. అదేవిధంగా వారి వద్ద ఉన్న రెండు మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వారి మహారాష్ట్ర రాష్ట్రం అకోలా నగరం నివాసులు గా షేక్ షోయబ్ అలియాస్ చేతన్ (22), ట్రక్ డ్రైవర్, మహమ్మద్ నదీమ్ (19), డెంటింగ్ పెయింటింగ్ కార్మికుడు, వారి విచారణలో మహారాష్ట్రకు చెందిన షేక్ ఆల్టా, ఒబైద్ లాలా, షేక్ అర్సలాన్, యూసుఫ్, అమెరిక్, సోహైల్, షేరా అనే వ్యక్తుల నుంచి సుమారు 6 కిలోల గంజాయి కొనుగోలు చేసి, ఎక్కువ ధరకు అమ్మేందుకు హైదరాబాద్‌కు తీసుకువచ్చినట్లు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం పరారీలో ఉన్న వారిపై కూడా కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

## వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చెయ్యాలని వినతి



**ముషీరాబాద్, మార్చి 12 (జనం సాక్షి) :** వచ్చే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో వడ్డెరలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వడ్డెర కుల అభివృద్ధికి 1000 కోట్ల నిధులు కేటాయించాలని తెలంగాణ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిలు మల్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ని కోరారు. ఈ మేరకు గురువారం మంత్రి నివాసంలో పొన్నం ప్రభాకర్ ను తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. అభివృద్ధి కోసం వడ్డెర లను బీసీ జాబితా నుండి తొలగించి ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఎస్టి జాబితాలో చేరుస్తామని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి మహబూబ్నగర్ జిల్లా జడ్చర్ల వడ్డెర సంఘం బహిరంగ సభలో ప్రకటించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ మహబూబ్నగర్ ఎంపీ గా ఉన్న సమయంలో వడ్డెర కులాన్ని ఎస్టి లో చేర్చాలని కేంద్రానికి లేఖ రాసారన్నారు. స్వరాష్ట్రం ఏర్పడ్డాక ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వడ్డెర కులాన్ని ఎస్టి లో చేర్చాలని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కు బహిరంగ లేఖ రాశారనీ చెప్పారు. 2018 లో మెదక్ జిల్లా ముత్తంగి వడ్డెర సంఘం బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చుట కు అసెంబ్లీలో బిల్లు పెట్టి కేంద్రానికి పంపిస్తానని, వడ్డెర కులానికి వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి 1000 కోట్ల బడ్జెట్ కేటాయిస్తానని బహిరంగ సభలో ప్రకటించారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రేపు జరగబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో వడ్డెర్ల గూర్చి ప్రస్తావించి, వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు, 1000 కోట్ల నిధుల కేటాయింపు జరపాలన్నారు. వడ్డెర కులాన్ని ఎస్టి జాబితాలో చేర్చుటకు అసెంబ్లీలో బిల్లు పెట్టి కేంద్రానికి పంపాలన్నారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా వడ్డెర్లందర్నీ కూడగట్టుకొని అసెంబ్లీ ముట్టడి చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు దేవరాజు, ఉపాధ్యక్షులు మంజుల నగేష్, రాష్ట్ర కార్మిక సంఘ ఉపాధ్యక్షులు కోడదల అంజయ్య, రంగారెడ్డి ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు కస్తూరి సత్యం, సలహాదారులు ఓర్సు వెంకటరావు, కార్యదర్శి ఓర్సు రాజు, వరికుప్పల శ్రీను, వడ్డెర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికబద్ధంగా ప్రగతి ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాపాలన

- తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 12 (జనం సాక్షి) :** ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ఎంతగానో దోహదపడుతుందని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. వికారాబాద్ పట్టణ కేంద్రంలో నర్సింగ్ ఫంక్షన్ హాల్ నందు 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పై సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్మన్ లకు శిక్షణ మరియు సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ గ్రామ పంచాయతీ ఎన్నికలలో విజయం సాధించి ఎన్నికైన నూతన సర్పంచ్ లు పురపాలక సంఘం ఎన్నికలలో విజయం సాధించి ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లకు స్పీకర్ ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైనమిక్ నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన జరుగుతున్నదన్నారు. రాష్ట్రంలో, దేశంలో పెద్ద స్థాయికి ఎదిగిన ప్రజాప్రతినిధులు ఎక్కువ మంది సర్పంచ్ లుగా, కౌన్సిలర్లు గా రాజకీయ జీవితం ప్రారంభించిన వారేనని, నేను కూడా ఎంపీటీసీ గా రాజకీయ జీవితం ప్రారంభించి ఎంపీపీగా తదుపరి శాసనసభ్యునిగా, మంత్రిగా, ఇప్పుడు రాష్ట్రంలో శాసన వ్యవస్థలో అత్యంత ఉన్నతమైన అసెంబ్లీ స్పీకర్‌గా ఉన్నానని తెలుపుతూ...కింది స్థాయి నుండి వచ్చిన ప్రజాప్రతినిధులకు సామాజిక అంశాలు, పేదలకు అందించాల్సిన సేవలపై ఎక్కువ అవగాహన ఉంటుందని ఆయన అన్నారు.కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే బాధ్యత స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులపై ఉంటుందని, ఇక్కడ ఎన్నికైన సర్పంచ్ లు, చైర్మన్లు, కౌన్సిలర్లలో ఎక్కువ మంది కొత్తవారే కాబట్టి ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా మీ విధులు, మీరు చేయవలసిన పనులపై మీకు సంపూర్ణ అవగాహన కలుగుతుందని తద్వారా మీరు ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలను అందించగలుగుతారని ఆయన తెలిపారు.ప్రభుత్వానికి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు రెండు కళ్ళ లాంటి వారు, అదేవిధంగా బండికి రెండు చక్రాల లాంటి వారని కలిసి పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. పథకాలు సమర్ధవంతంగా ప్రజలకు అందాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని స్పీకర్ సూచించారు.ఇప్పుడు గెలిచిన సర్పంచ్‌లు, చైర్మన్లు, వార్డుల సభ్యులు అదృష్టవంతులు, రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన నడుస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజారంజక పరిపాలన జరుగుతున్నదని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు ఇప్పుడు పదవిలో ఉన్న మీ ద్వారా అమలవుతాయి కాబట్టి మీకు మంచి పేరు వస్తుందని ఆయన అన్నారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇళ్ళు, కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్, డ్వాక్రా మహిళలకు ఉచిత రుణాలు వంటి సంక్షేమ పథకాల అమలు గురించి అందరికీ అవగాహన కలిగించి అర్హులైన వారందరికీ అందే విదంగా పనిచేయాలని ఆయన తెలిపారు. తులం బంగారం, మహిళలకు ఆర్థిక భరోసా, పెన్షన్ల డబ్బులు పెంచడం వంటి వాటి గురించి మిమ్మల్ని ప్రజలు అడిగినప్పుడు మీరు వారికి అర్థమయ్యే విదంగా గత ప్రభుత్వం చేసిన ఏడు లక్షల కోట్ల రూపాయల అప్పులు, ఆర్థిక విధ్వంసం, ఇప్పుడు నెలకు 6500 కోట్ల రూపాయలు మిత్తి కడుతున్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకుంటారని, ఆర్థిక పరిస్థితులు చక్కబడగానే త్వరలోనే ఇచ్చిన హామీలు నెరవేర్చడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహమేహర, అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, జడ్పీ సీఈవో సుధీర్, డి మంగిలాల్, ఆర్డీవో వాసు చంద్ర, గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజేష్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ లు గడ్డం అనన్య, పట్లోళ్ల నీరజ, రజిత లతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, మార్చి 12 (జనం సాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజులపాటు దిగ్విజయం చేసేందుకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై నూతన కౌన్సిలర్లు, సర్పంచ్‌లకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు తో కలిసి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ లు, అదనపు కలెక్టర్లు, జిల్లా ఎస్పీ లతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అమలు చేసేలా ఎక్కడ ఎలాంటి వైరుధ్యాలు లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేస్తేనే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జోగులాంబ గద్వాల జిల్లాలో మహిళలు పెద్ద ఎత్తున సర్పంచులుగా, కౌన్సిలర్లుగా గెలుపొందడం శుభ పరిణామమని పేర్కొంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. 99 రోజులపాటు పది



అంశాలతో నిర్వహిస్తున్న కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 2న గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించి ఇందులో ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజాప్రతినిధులు కీలకంగా ఉండాల్సినందున వారికి సమగ్రంగా అవగాహన కల్పించేందుకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఏమైనా సందేహాలు ఉంటే మాస్టర్ ట్రైనర్స్, అధికారులు నివృతి చేస్తారన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో బాల్యవివాహాలతో పాటు పలు సామాజిక సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి కూడా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. పోలీస్ శాఖ తరపున డ్రగ్స్, రహదారి భద్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయంలో రసాయనిక ఎరువులను ఎక్కువగా వినియోగిస్తే భూములు సారవంతత కోల్పోయి భవిష్యత్తు తరాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నందున అన్నదాతలు ప్రకృతి వ్యవసాయంపై కూడా దృష్టి సారించేలా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు 99 రోజులపాటు పది అంశాలను తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ థీమ్స్ ప్రతి కుటుంబంలో అందరి జీవితాలను ప్రభావితం చేస్తాయని పేర్కొన్నారు. అనంతరం 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలోని 10 ప్రధాన అంశాలను సంబంధిత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. అంతకుముందు బాల భవన్ విద్యార్థులు అద్భుతమైన సాంస్కృతిక నృత్యాలతో ప్రేక్షకులను అలరించగా, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై రూపొందించిన పాటలతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగ రావు, మున్సిపల్ చైర్మన్లు, జిల్లా అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు, పలు మండలాల అధికారులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి సేవల్లో మార్పు రావాలి

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి




**జడ్చర్ల, మార్చి 12 (జనంసాక్షి) :** నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఆయన జడ్చర్ల వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలోని నూతన మార్చురీ గదిని పరిశీలించి, అక్కడ మృతదేహాల భద్రతకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించి, ఆసుపత్రి పనితీరుపై కఠినంగా వ్యవహరించారు. ఇటీవల ఆసుపత్రిలో చోటుచేసుకున్న కొన్ని ఘటనలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తులో అలాంటి పొరపాట్లు మళ్లీ జరగకూడదని అధికారులను హెచ్చరించారు. ఆసుపత్రిలో పరిశుభ్రతను పాటిస్తూ, గర్భిణీలు, వృద్ధులకు తక్షణ చికిత్స అందించాలని, ఔషధాల కొరత లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. నిరు పేద రోగులకు ప్రభుత్వం ద్వారా అందే వైద్య సేవలు సక్రమంగా చేరాలని పేర్కొన్నారు. సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

**సిద్దిపేట, మార్చి 12 (జనం సాక్షి) :** సాగునుటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని రాజకీయాలకతీతంగా రైతుల సమస్యల పట్ల కృషి చేయాలని యువ నాయకుడు రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామానికి చెందిన రైతులు తమ పంట పొలాలు



ఎండిపోతున్న నేపథ్యంలో వెంకయ్యచేరువును నింపి పంటలను కాపాడాలని వంగ రాజేశ్వర్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. రంగనాయకసాగర్ ఎడమ కాలువ తమ పొలాల గుండా సుమారు 10 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్నప్పటికీ తమకు ఎలాంటి ఉపయోగం లేకుండా ఉందని రైతులు తెలిపారు. అలాగే మల్లన్నసాగర్ ఆర్ 3కాలువ పనులు మధ్యలోనే ఆగిపోయాయని, వాటిని పూర్తి చేసి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.రైతుల సమస్యలను శ్రద్ధగా విన్న వంగ రాజేశ్వర్ రెడ్డి వెంటనే సంబంధిత ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండటంతో పంటపొలాలుఎండిపోతున్నాయని, రాస్తా రోకో చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన వంగ రాజేశ్వర్ రెడ్డి రైతుల సమస్యను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని, అవసరమైతే రైతులకు వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం కూడా అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఒగ్గు రాజేష్, పుల్లూరు ఆలయ కమిటీ చైర్మన్ పుల్లూరి కనకయ్య, దేశెట్టి తిరుపతి, వార్డు సభ్యులు యోగి, వైనాష్ యాదవ్, కుంచం నాగరాజు, మొలుగు ప్రవీణ్,బొందని శ్రీకాంత్, బొంగు రాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధుల పాలన ప్రజలు మెచ్చేలా ఉండాలి

- మంత్రి శ్రీహరి

**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 12 (జనం సాక్షి) :** నూతన ప్రజా ప్రతినిధుల పాలన ప్రజలు మెచ్చేలా ఉండాలని రాష్ట్ర పాడి, మత్స్య పరిశ్రమ క్రీడలు యువజన శాఖా మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం నారాయణపేట లో జరిగిన ప్రజా ప్రతినిధుల శిక్షణ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ బాపు జీ కలలు గన్న గ్రామ స్వరా జ్యం కోసం మనందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు గాయత్రి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్ర మంలో 272 మంది సర్పం చులు 72 మంది కౌన్సిలర్లు పాల్గొన్న శిక్షణ కార్యక్రమంలో మంత్రి వారికి దిశా నిర్దేశం చేశారు.ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్య క్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సర్పంచులకు చెక్ పవర్ ఇచ్చి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. సర్పంచ్ పదవి అంటే ఆషామాషీ కాదని , మున్సిపల్ చైర్మన్ పదవి కూడా ఎంతో కీలకమని తెలిపారు. పుట్టిన ,మరణ ధ్రువీకరణ పత్రం అందజేసే సర్పంచ్,చైర్మన్ పదవులు ఎంతో కీలకమని అన్నారు.మనం పుట్టిన ప్రాంతానికి సేవ చేసే అవకాశం దొరకడం గొప్ప అదృష్టమని సర్పంచ్ లకు హితోపదేశం చేశారు.



తాను సర్పంచ్ నుండి మంత్రి స్థాయికి ఎదిగానని తెలిపా రు. మన గ్రామాలను అభి వృద్ధి చేసి పది తరాల వరకు గుర్తుండిపోయేలా చైర్మన్ లు, సర్పంచ్ లు పనిచేయా లన్నారు. 99 రోజులు ఈ కార్యక్రమం లో పలు అంశాల ను చేర్చడం జరిగిందని మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సిద్ధిస్తుం దని తెలిపారు. గ్రామాలకు ఏ అవసరం ఉన్నా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు.మన ప్రాంత వాసి అయిన ముఖ్యమంత్రి ఉన్నందున ఈ గడ్డ అంతా అభివృద్ధి జరుగుతుందని తెలిపారు.5 వేల కోట్ల తో మక్తల్ – నారాయణపేట – కొడంగల్ ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభం అయ్యా యని తెలిపారు. ఎకరానికి 20 లక్షలు ఇచ్చి భూ నిర్వాసి తులను ఈ ప్రభుత్వం ఆదు కున్నదని మంత్రి వెల్లడించా రు. వరికి మద్దతు ధరతో పాటు బోనస్ ఇచ్చి, పండిచి న పంటను సన్న బియ్యం గా మార్చి రేషన్ షాపుల ద్వారా పేదలకు ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. సంక్షేమ పథకాల్లో ప్రజా ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. కోటి మంది మహిళలను కోటేశ్వరులను చేయడమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు.స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, పెట్రోల్ బంకుల నిర్వహణ, ఆర్ టీ సి అద్దె బస్సుల నిర్వహణ తో వారు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు.పిల్లల ఆరోగ్యం పట్ల, డ్రగ్స్ పట్ల జాగ్రత్త వహించాలని అన్నారు. 25 కోట్ల రూపాయలతో స్టేడియం నిర్మాణం కొరకు మంజూరు చేస్తాం అని మంత్రి వాకిటి శ్రీహరి తెలియజేశారు. ఈ కార్యక్రమంలోఅదనపు కలెక్టర్ లోకల్ బాడీ ఫణిందర్ రెడ్డి, ఎస్పీ డాక్టర్ వినీత్, అదనపు కలెక్టర్ రెవిన్యూ శ్రీను, నారాయణపేట జిల్లా లోని మున్సిపల్ చైర్మన్లు , వైస్ చైర్మన్లు, సర్పంచ్లు కౌన్సిలర్లు ,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కోట్ల రూపాయల ఆదాయబాటలో ఆర్టీసీ

- రెండేళ్లలో వనపర్తి డిపోకు దాదాపు 10 కోట్ల పైనే ఆదాయం
- గత టీఆర్ఎస్ హయంలో దివాలా తీసిన ఆర్టీసీ
- నేడు లాభాల బాటలో కొనసాగుతుంది
- నూతన బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి బ్యూరో, మార్చి 12 (జనం సాక్షి) :** గత పదేళ్ల బిఆరెస్ పాలనలో తెలంగాణలో ఆర్టీసీ పూర్తిగా దివాలా తీసి ఉండేదని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో కోట్ల రూపాయల ఆదాయాన్ని గడిస్తోందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు.గురువారం వనపర్తి డిపోకు వచ్చిన నాలుగు నూతన బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కేవలం వనపర్తి డిపోకే15 పల్లె వెలుగు బస్సులు,11 ఎక్స్ప్రెస్లు, 2 డీలక్స్ బస్సులు,4 ఎలక్ట్రికల్ బస్సులు,మొత్తం 32 కొత్త బస్సులు వచ్చాయని ఎమ్మెల్యే తెలిపారు. గత బిఆరెస్ హయంలో వనపర్తి డిపోకు సంబంధించి రోజుకు 4లక్షలు ఉండే ఆర్టీసీ ఆదాయం నేడు 30 నుంచి 35 లక్షలకు పెరిగిందని ఆయన తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలలోనే కేవలం వనపర్తి డిపోకే దాదాపు 10 కోట్ల పైన ఆదాయం లభించిందని ఎమ్మెల్యే తెలిపారు.వనపర్తి డిపోలో ప్రస్తుతం 118 బస్సులు ఉన్నాయని మరో 30 నుంచి 40 కొత్త బస్సులను డిపోకు తీసుకురానున్నట్లు ఆయన స్పష్టం



చేశారు.మహిళా సంఘాల భాగస్వామ్యంతో ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి వారికి నెలకు 70000 ఆదాయం వచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని ఎమ్మెల్యే తెలిపారు.నిజాం కాలంలో ఏర్పాటుచేసిన ఆర్టీసీ డిపో కేవలం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చెందిందని ఆయన అన్నారు.వనపర్తి నియోజకవర్గంలోని ప్రతి పల్లె మార్గానికి ఆర్టీసీ సర్వీసుల సేవలు అందేలా చేయడమే లక్ష్యంగా ఉన్నామని ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు వెళ్లి వచ్చేలా చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, పట్టణ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, ఆర్టీసీ డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్, ఆర్టీసీ సిబ్బంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పదవులు శాశ్వతం కాదు

- మనం చేసిన అభివృద్ధి పనులే శాశ్వతం
- రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- 105 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులు అందజేత

**మక్తల్, మార్చి 12 (జనంసాక్షి) :** పదవులు శాశ్వతం కాదని మనం చేసిన అభివృద్ధి పనులే శాశ్వతమని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మక్తల్ పట్టణ కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద 86 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి 19 మంది కి షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు మంత్రి వాకిటి శ్రీహరి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటి వరకు మక్తల్ నియోజకవర్గంలో దాదాపు ఒక వెయ్యి ఒక వంద కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసినట్లు మంత్రి తెలియజేశారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక మక్తల్ లో ఇప్పటివరకు ఎనిమిది సార్లు ఈ చెక్కులను ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. పేదింటి ఆడ పిల్లల పెళ్లి చేసిన తల్లిదండ్రులకు సరైన సమయంలో చెక్కులను ఇవ్వడం ద్వారా ఆ కుటుంబానికి ఆర్థికంగా ఆసరా దొరుకుతుందని తెలిపారు. ఈ దసరా లోపు మక్తల్ లో 150 పడకల ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. హామ్ టెండర్ ద్వారా 210 కోట్ల తో మక్తల్ –నారాయణపేట రోడ్డు ను నాలుగు లేన్ ల రహదారిగా మారుస్తున్నామని వెల్లడించారు. 230 కోట్లతో గోలపల్లి వద్ద ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను నిర్మిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. మక్తల్ చెరువును సుందరీకరణ చేసి త్వరలో అందుబాటులోకి తెస్తున్నామన్నారు. 25 కోట్లతో మక్తల్ నడిబొడ్డున అన్ని హంగులతో



అధునాతన స్టేడియాన్ని నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు 1100 కోట్ల నిధులు మక్తల్ అభివృద్ధికి తీసుకొచ్చామని తెలియజేశారు. మక్తల్ లో రాబోయే ఎన్నికల్లో ప్రోగ్రెస్ కార్డు చూపించే ఓట్లు అడుగుతామని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో మక్తల్ రూపు రేఖలు మారుస్తానని మంత్రి వాకిటి శ్రీహరి హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సతీష్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హన్మంతు, మాజీ జెడ్పిటిసి జి. లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి. గణేష్ కుమార్ మున్సిపల్ కౌన్సిలర్లు పావని, శ్రీవిద్య నీల గౌడ్, అనిత, సరిత గోవిందరావు, రహీం పటేల్, పీకే. నరసింహ, టప్ప కృష్ణ, వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు కట్టా సురేష్ కుమార్ గుప్తా, బోయ రవికుమార్, అమరేందర్ రెడ్డి, బి. శంషుద్దీన్, ఊసాముద్దీన్, నూరుద్దీన్, సాలంబిన్ ఉమర్ బస్రవి,మంజూర్, కే .కురుమయ్య గౌడ్,చెన్నయ్య గౌడ్, జి.నీలప్ప, మెదరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లింలకు 1000 మందికి రంజాన్ తోఫ ను మంత్రి వాకిటి శ్రీహరి పంపిణీ చేశారు.

# పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**గద్వాల నడిగడ్డ, మార్చి 12 (జనం సాక్షి) :** జిల్లాలో నిర్వహించనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల నిర్వహణలో అధికారులు, సిబ్బంది పూర్తి బాధ్యతతో పనిచేసి విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని ఆయన సూచించారు.ఈ సంవత్సరం జిల్లాలో పదో తరగతి పరీక్షలకు మొత్తం 8,110 మంది విద్యార్థులు హాజరుకానున్నారని కలెక్టర్ తెలిపారు.వీరిలో 3,858 మంది బాలురు, 4,199 మంది బాలికలు,అలాగే 53 మంది ఒకసారి విఫలమైన విద్యార్థులు ఉన్నారని చెప్పారు.జిల్లాలో మొత్తం 40 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు,పరీక్షల నిర్వహణ కోసం అవసరమైన సిబ్బందిని నియమించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆయన వెల్లడించారు. పరీక్షా కేంద్రాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్లు లేదా ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరాదని, విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి, సిబ్బంది తప్పనిసరిగా ఐడి కార్డులు ధరించాలని ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో క్లాక్ రూమ్ ఏర్పాటు చేసి మొబైల్ ఫోన్లు తదితర వస్తువులను అక్కడే భద్రపరచాలని సూచించారు. ప్రశ్నాపత్రాలను పోలీస్ ఎస్కార్ట్‌తోనే కేంద్రాలకు తరలించి పరీక్ష అనంతరం



పోస్టాఫీసులో డిపాజిట్ చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో ప్రైవేట్ పాఠశాలల సిబ్బందిని అనుమతించరాదని స్పష్టం చేశారు.చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లకు సంబంధించిన ఎస్.ఎస్.సి ఇన్‌స్ట్రక్షన్ బుక్‌లెట్లు అందుబాటులో ఉంచాలని,పదవ పరీక్షల టైమ్ టేబుల్‌ను కార్యాలయంలో స్పష్టంగా ప్రదర్శించాలని తెలిపారు.చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సీసీటీవీ కెమెరా తప్పనిసరిగా ఉండాలని,సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ ను కలిసి బందోబస్తు కోసం లేఖ ఇవ్వాలని సూచించారు. పరీక్ష ప్రారంభమైన 30 నిమిషాల లోపల విద్యార్థుల హాజరు వివరాలను 9440081300, 8247672086, 9491528193 నంబర్లకు తెలియజేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో స్వచ్ఛమైన త్రాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని, ఏ.యెన్.యం సిబ్బంది తప్పనిసరిగా విధుల్లో ఉండాలని ఆదేశించారు.పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి అనుమానాస్పద మెటీరియల్ ఉండకూడదని,చీఫ్ సూపరింటెండెంట్లు మరియు డిపార్ట్‌మెంటల్ అధికారులు ప్రతి గదిని ముందుగా పరిశీలించాలన్నారు. 4ఎస్, 3టీ పరీక్షలు ఉన్న కేంద్రాల్లో హాల్ టికెట్ నంబర్ పక్కన సబ్జెక్టు వ్రాయాలని సూచించారు.ప్రశ్నాపత్రాలను పరీక్ష ప్రారంభానికి 10–15 నిమిషాల ముందు మాత్రమే తెరవాలని, పరీక్షా కేంద్రాల్లో ప్రెస్ ప్రతినిధులను అనుమతించరాదని చెప్పారు.ఏ.యెన్.యం వద్ద కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్ ఉండకూడదని ఆదేశించారు.ప్రశ్నాపత్రాల లీకేజీ లేదా మాస్ కాపీయింగ్ వంటి ఘటనలు జరిగితే 1997 చట్టం, సీసీఏ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.సి కేటగిరీ సెంటర్లలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు ప్రశ్నాపత్రాలను సి సెంటర్ కస్టోడియన్ వద్ద నుంచి పొందాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఫర్నిచర్, లైటింగ్, టాయిలెట్లు, స్వచ్ఛమైన త్రాగునీరు పూర్తిస్థాయిలో ఉండాలని ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఒక గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. అదేవిధంగా ఆన్సర్ బుక్‌లెట్లు,ఓ.ఎం.ఆర్ షీట్లు, డి-ఫార్మ్ ముందుగానే సరిచూసుకోవాలని తెలిపారు.ప్రతి రోజు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల హాజరు వివరాలను పోలీస్ వారి ఫోన్ ద్వారా పంపించాలని,స్టేషనరీ అకౌంట్స్ జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు.

## టీజీపీఎస్సీ ద్వారా వెంటనే సర్వేయర్ పోస్టులను భర్తీ చేయాలి

- లక్షల్లో అభ్యర్థుల ఎదురుచూపులు
- పుడమి ఫౌండేషన్ చైర్మన్ వెంకటపతి రాజు



**మఖ్తల్, మార్చి 12 (జనంసాక్షి) :** టీజీపీఎస్సీ ద్వారా వెంటనే సర్వేర్ పోస్టులను భర్తీ చేయాలని పుడమి ఫౌండేషన్ చైర్మన్ వెంకటపతి రాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఇప్పటి వరకు గవర్నమెంట్ సర్వేయర్ల కొరతా చాలా ఉంది ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోని మా సమస్యలు పరిష్కరిస్తుందని ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం రాక ముందు ఎన్నో హామీలు ఇచ్చింది. ఇందులో భాగంగా అనేక ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేస్తున్న క్రమంలో సర్వే నోటిఫికేషన్ మాత్రం తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేస్తున్నారు. కావున లక్షల్లో డబ్బులు వెచ్చించి సివిల్ సర్వేర్లుగా లక్షల్లో అభ్యర్థులు నిరుద్యోగులుగా మారిపోయారు. గెలవక ముందు హామీలు ఇచ్చి గెలిచాక హామీలను మురికి కాలువలో తొక్కేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేము చదివిన చదువుకి టిఎస్పిఎస్సి నోటిఫికేషన్ వేసి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ అశోక్, ఓబులేష్, కేశవ్, అశోక్, రాము, క్రాంతి, పరుశు రాం, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి ప్రణాళిక ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**హన్మకొండ ప్రతినిధి, మార్చి 12 (జనంసాక్షి) :** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమం సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో హన్మకొండ కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి తిలకించారు. ప్రజాపాలన –ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, ముఖ్యంగా పారిశుద్ధ్యం మరియు ఇతర థీమ్లపై జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించే విధంగా ఈ ఫోటో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. వివిధ శాఖల ద్వారా అమలు చేసిన పనులు, ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించిన కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని చిత్రాల రూపంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రదర్శనలోని చిత్రాలను ఆసక్తిగా పరిశీలించి, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరే విధంగా అవగాహన కల్పించడంలో ఇటువంటి ప్రదర్శనలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ రవి, డిఆర్డీఓ మేన శ్రీను సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాప్రతినిధులు అధికారులతో సమన్వయం కావాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**రామకృష్ణాపూర్, మార్చి 12 (జనంసాక్షి):** ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులతో సమన్వయం అయితేనే గ్రామాలు పట్టణాలు అభివృద్ధి చెందుతాయని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ లు, చైర్మెన్, మేయర్, కౌన్సిలర్లకు జిల్లా కేంద్రంలోని అమ్మ గార్డెన్ లో గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 99 రోజుల ప్రగతి ప్రణాళికలో ఏప్రిల్ రెండవ తేదీన గ్రామ స్థాయి, 16 వ తేదీన మండల స్థాయి, మే రెండవ తేదీన నియోజకవర్గ స్థాయి, 22 వ తేదీన జిల్లా స్థాయి, జూన్ రెండవ తేదీన రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్వహించబడతాయని తెలిపారు. వార్డుల్లో తలెత్తిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేకమైన ప్రణాళికను సిద్ధం చేసుకొని ముందుకెళ్లాలన్నారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, సంక్షేమం, వ్యవసాయం, విద్య, పర్యావరణం అంశాలను ప్రధానంగా చేసుకోవాలని సూచించారు. అనంతరం మంచిర్యాల డిసిపి భాస్కర్ మాట్లాడుతూ యువత చెడు మార్గంలోకి వెళ్ళకుండా ప్రజా ప్రతినిధులు కీలకపాత్ర పోషించాలన్నారు. రాజకీయ నాయకులు భవిష్యత్ తరాలకు మార్గదర్శకం కావాలని, ఆ దిశగా అభివృద్ధిలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్ లు, మంచిర్యాల మేయర్, డిప్యూటీ మేయర్, చెన్నూరు, లక్షెట్టిపేట, బెల్లంపల్లి చైర్మెన్, వైస్ చైర్మెన్, జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల సర్పంచ్ లు, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## సంక్షేమ ఫలాలు ప్రతీ గడపకు చేరేలా కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా క్షేత్రస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని తిరుమల గార్డెన్ లో నిర్వహించిన అవగాహనా సమావేశంలో శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, వెడ్మ బొజ్జు పటేల్, రామారావు పటేల్ లతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు ప్రతి గడపకూ చేరాలని, అభివృద్ధి పనుల్లో ఎక్కడా జాప్యం జరగకూడదని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. అనంతరం, మండలాల వారీగా విచ్చేసిన సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లతో కలెక్టర్ విడివిడిగా భేటీ అయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, వారితో కలిసి సామూహిక చిత్రాలు దిగారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత గంజాయి పట్టివేత.. ఇద్దరు అరెస్ట్



**చిట్యాల, మార్చి 12( జనం సాక్షి) :** భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపిఎస్ ఆదేశాల మేరకు సీసీఎస్ టీం, చిట్యాల పోలీసులు సంయుక్తంగా మండల కేంద్రంలోని శివాజీ చౌక్ వద్ద బుధవారం సాయంత్రం 5:30 గంటలకు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరిని ఆపి తనిఖీ చేయగా వారి వద్ద నుంచి 1 కిలో 300 గ్రాముల నిషేధిత గంజాయి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.65,000. అలాగే ఒక బైక్, సెల్ ఫోన్ ను కూడా పోలీసులు సీజ్ చేశారు. చల్లగరిగే గ్రామానికి చెందిన పోతుల నర్సింగరావు (57),పల్లెర్ల మధుకర్ (43), ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపిఎస్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించేందుకు భూపాలపల్లి జిల్లా పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారని తెలిపారు. నిషేధిత మాదకద్రవ్యాల విక్రయాలు లేదా రవాణా గురించి ఎవరైనా సమాచారముంటే టోల్ ఫ్రీ నెంబర్ 8712658111 కు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అనంతరం చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు సంబంధించిన నేరాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ తరహా అక్రమ కార్యకలాపాలపై ప్రజలు నిర్భయంగా సమాచారం అందించాలని కోరారు. చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు కొనసాగిస్తుందని తెలిపారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని స్టేట్ అబ్జర్వర్ బృందం తనిఖీ



**కుబీర్, మార్చి12 (జనంసాక్షి):** కుబీర్ మండల కేంద్రంలోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని గురువారం స్టేట్ అబ్జర్వర్ బృందం, డి.ఇ.సి కన్వీనర్ జాదవ్ పరశురామ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ తీరును, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను వారు నిశితంగా పరిశీలించారు. పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ విజయ్ భాస్కర్, డి.ఓ నర్సయ్య వివరాలు వెల్లడిస్తూ.. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు మొత్తం 138 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 134 మంది హాజరయ్యారని, నలుగురు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు వారు పేర్కొన్నారు.

# గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక విజయవంతానికి అందరూ భాగస్వాములు కావాలి



**వరంగల్ ప్రతినిధి, మార్చి 12 (జనంసాక్షి) :** గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి పునాదని, గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పని చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. గురువారం వరంగల్ జిల్లాలోని గీసుగొండ మండలం మరియాపురం గ్రామంలోని ఎస్.ఎస్. ఫంక్షన్ హాల్‌లో ప్రజా పాలన– ప్రగతి ప్రణాళికపై జిల్లాలోని ప్రజాప్రతినిధులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని, నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వందేమాతరం, జయ జయహే తెలంగాణ గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మార్చి 6 నుండి జూన్ 12 వరకు అమలు చేస్తున్న 99 రోజుల కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సర్పంచ్ నుంచి మంత్రి వరకు ప్రతి ఒక్కరూ స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి దార్శనికతకు అనుగుణంగా అధికారులు పని చేయాలని, సంక్షేమ పథకాలు, ప్రజా సేవలను ప్రజల్లోకి వేగంగా తీసుకెళ్లాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను క్లియర్ చేయడం, గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను ప్రత్యేకంగా చేపట్టడం, ప్రభుత్వ సేవలను ప్రజలకు సులభతరం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే మన పనితీరుకు ప్రధాన ధ్యేయంగా ఉండాలని అన్నారు. ఈ 99 రోజు ల ప్రణాళిక ద్వారా పాలనలో పారద ర్శకత, జవాబుదారీతనం పెంచడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.గత రెండు సంవత్సరాల్లో రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం సరఫరా వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం అందించిన అవకాశాన్ని వినియోగించుకుని ప్రజాప్రతిని ధులు క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించు కోవాలని మంత్రి సూచించారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన మహానుభావుల సేవలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. అభివృద్ధికి ఆదర్శంగా నిలిచిన గ్రామాలను సందర్శించి అక్కడ అమలు చేసిన విధానాలను తెలుసుకుంటే ప్రజాప్రతినిధులకు పరిపాలనలో ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. శిక్షణ కార్యక్రమాల్లో నేర్చుకున్న విషయాలను ఆచరణలో పెట్టి ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ వారి విశ్వాసాన్ని పొందాలని సూచించారు.పదవులు శాశ్వతం కావని, కానీ ప్రజలకు చేసిన సేవలు మాత్రం చిరస్థాయిగా నిలుస్తాయని పేర్కొంటూ ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజల మనసులను గెలుచుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు.

### ప్రజల సంక్షేమం సమగ్రాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం : మేయర్ గుండు సుధారాణి

నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా వినూత్న సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలు ప్రజల జీవన ప్రమాణా లను మెరుగుపరుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రగతి బాటలో సకల జన హితం లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 10 థీమ్లపై 99 రోజులపాటు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజాప్రతిని ధులుగా ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చూడటం, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం మన బాధ్యత అని మేయర్ తెలిపారు.

## అన్ని రంగాలలో మహిళలు భాగస్వాములు కావాలి

- రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**మహబూబాబాద్ ప్రతినిధి, మార్చి 12 (జనం సాక్షి):** గ్రామాల్లోని సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు గ్రామ ప్రజలను తమ కుటుంబ సభ్యులుగా భావిస్తూ ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం మహబూబాబాద్ పట్టణంలోని పి.ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్లో జిల్లా స్థాయిలో నిర్వహించిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఎన్నికైన మహబూబాబాద్ జిల్లాలోని గ్రామ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లకు వివిధ శాఖలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహిళా, శిశు సంక్షేమ, సెర్ప్, వైద్య ఆరోగ్య, విద్యా మరియు సంక్షేమ, పర్యావరణ, వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మార్కెటింగ్, సహకార, పౌర సరఫరాలు, మున్సిపల్, పంచాయతీ రాజ్, పోలీస్, రవాణా, గృహ నిర్మాణ, విద్యుత్, యువజన, క్రీడా శాఖలపై అవగాహన కల్పించే శిక్షణ తరగతులు నిర్వహించగా, ఉదయం ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రారంభించారు. అనంతరం జరిగిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రతి సర్పంచ్ తమ గ్రామాన్ని సొంత ఇంటిగా భావించి ప్రజాసేవను లక్ష్యంగా పెట్టుకొని పనిచేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి సేవలందించాలని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం కేంద్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు రూ.600 కోట్లు కేటాయించిందని, మరో రూ.1200 కోట్లు రావాల్సి ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని జిల్లాలో షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్, ఎంఎల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్ తదితరులు పాల్గొని గ్రామాలు, పట్టణాల అభివృద్ధిపై ప్రజా ప్రతినిధులకు సూచనలు చేశారు. అనంతరం శాఖల వారీగా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలపై సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థలు, రెవిన్యూ అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, కె. అనిల్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోతు జ్యోతి, వైస్ చైర్మన్ సూర్నపు సోమయ్య, జెడ్పిసిఓ పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన్ రాజు, జిల్లా అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, గ్రామ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు గోదావరి పుష్కరాలపై మంత్రి సమీక్ష



**కాళేశ్వరం, మార్చ్ 13 (జనం సాక్షి) :** జయ శంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు శుక్రవారం పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు 22 కోట్లతో కాళేశ్వరం నుండి పలుగుల కు 7 కిలోమీటర్లు నిర్మించబోతున్న డబల్ బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం 1.20 కోట్లతో ఆలయానికి చెందిన ప్రాచీన శిల్పాలను, శిథిలావస్థకు చేరిన శిల్పాలను ఉంచేందుకు మ్యూజియం కు శంకుస్థాపన చేస్తారు. ఆది ముక్తేశ్వర దేవస్థానం నుండి సరస్వతి ఘాట్ వరకు 2 కోట్ల 38 లక్షలతో బిటి రోడ్డు శంకుస్థాపన చేయనున్నారు. 1 కోటి 55 లక్షలతో నిర్మించిన అన్నదాన సత్రం ప్రారంభం చేస్తారు. తర్వాత రాబోయే గోదావరి పుష్కరాల సందర్భంగా నిర్వహించబోవు పనులపై అధికారులతో ఆలయ కార్య నిర్వహణ అధికారి కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలోనే మంత్రి చేతుల మీదుగా కాళేశ్వరం, అన్నారం ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇంటి పత్రాలు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## గ్రామాలను అభివృద్ధిలో తీర్చిదిద్దుతూ ప్రణాళికతో ఆదర్శ ప్రజాప్రతినిధులు రాణించాలి

- ఎమ్మెల్యే దేవుడి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ ప్రతినిధి, మార్చి 12 (జనంసాక్షి):** నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి ప్రగతి ప్రణాళిక తో పనిచేసి ఆదర్శ ప్రజా ప్రతినిధులుగా పిలవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని ఎస్ ఎస్ గార్డెన్లో నిర్వహించిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణపై గ్రామీణ, పట్టణ ప్రజాప్రతినిధుల అవగాహన సదస్సు కార్యక్రమంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణపై గ్రామీణ, పట్టణ ప్రజాప్రతినిధుల అవగాహన సదస్సు కార్యక్రమంలో రెండవ సెషన్ లో వరంగల్ జిల్లా కలెక్టర్ శడాక్టర్ సత్య శారదాదేవి అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెలంగాణ ప్రజా ప్రభుత్వం మార్చి 6 నుండి జూన్ 12 వరకు అమలు చేస్తున్న 99 రోజుల కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.నూతన ప్రజాప్రతినిధులకు ప్రాథమిక అవగాహన ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది అన్నారు.ప్రతి గ్రామపంచాయతీలలో కమిటీలు ఏర్పాటు చేసి ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు . స్వయం సమృద్ధితోనే గ్రామాలు అభివృద్ధి సాధ్యమన్నారు. అందుబాటులో ఉన్న నిధులను వినియోగించుకొని సక్రమంగా పాలన చేస్తే మంచి పేరు వస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం ప్రతి నియోజకవర్గం, మండలం, గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పని చేయాలన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్ట్స్ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం




**హనుమకొండ ప్రతినిధి మార్చి 12 (జనంసాక్షి) :** హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం నాలుగో రోజు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ శాస్త్రవేత్తలు ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిణామాలపై ఉపన్యాసాలు అందించారు. ఎన్ఐటీ వరంగల్‌కు చెందిన డాక్టర్ రాజేష్ కన్నా "గ్రీన్ అండ్ సస్టైనబుల్ కెమిస్ట్రీ ఫర్ క్లీన్ ఎనర్జీ" అంశంపై ప్రసంగిస్తూ పర్యావరణ పరిరక్షణలో గ్రీన్ కెమిస్ట్రీ ప్రాముఖ్యతను వివరించారు. సిఎస్ఐఆర్–సిఐఐఎం హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ జొన్నల కోటేష్ ఔషధ మొక్కల పరిశోధన నుంచి పరిశ్రమల వరకు జరిగే ప్రక్రియలను వివరించారు. ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ నరేంద్ర సస్టైనబుల్ బ్యాటరీల అవసరం, శక్తి నిల్వ సామర్థ్యం గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జ్యోతి, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వం ప్రధాన లక్ష్యం

- ఎమ్మెల్యే జీఎస్సార్




**శాయంపేట ,మార్చి 12 (జనం సాక్షి) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం రోజు శాయంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో స్పెషలిస్ట్ వైద్యులు, మరియు ఆర్.బి.ఎస్.కె వైద్య బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని తెలిపారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఇలాంటి వైద్య శిబిరాల ద్వారా ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకొని అవసరమైన చికిత్స పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ డీ.ఎమ్.ఎచ్.ఓ డా. అప్పయ్య మండల మెడికల్ ఆఫీసర్ , మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల మన్ననలు పొందేలా ప్రజాప్రతినిధులు పని చేయాలి

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 13 (జనంసాక్షి) :** ప్రజల మన్ననలు పొందేలా ప్రజాప్రతినిధులు పని చేయాలని రాష్ట్ర నీటి పారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని రవి మహల్ లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులు, మున్సిపల్ చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్లు, ఇతర ప్రజా ప్రతినిధులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ కె.నరసింహాతో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగామంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి, రాష్ట్ర కేబినెట్ ఆలోచనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నామని అన్నారు.ప్రజల కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గురించి అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన లబ్ధిదారులకు అవి చేరేలా చూడాలని తెలిపారు.ప్రజలకు మంచి చేయాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపై ఉందని అన్నారు.ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కొంత సమయం కేటాయిస్తే క్షేత్రస్థాయిలో మంచి మార్పు కనిపిస్తుందని అన్నారు.పాలక వర్గాలు లేక గ్రామాలకు నిధులు రాలేదని, గత నెలన్నర కాలంలో పెద్ద ఎత్తున నిధులు విడుదల అయ్యాయని అన్నారు. మార్చి 31 లోపు మరిన్ని నిధులు విడుదల అవుతాయని తెలిపారు. ప్రతి గ్రామానికి జనాభా ఆధారంగా 5 లక్షల నుంచి 60 లక్షల రూపాయల వరకు నిధులు విడుదల అయ్యాయని, ఈ నిధులు ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని అన్నారు.చట్ట పరిధిలో నిధులను సద్వినియోగం చేయాలని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకుండా కాపలాదారుగా ఉండాలని పేర్కొన్నారు.పేద ప్రజలకు నిరంతరం మంచి చేసే విధంగా, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.ఎన్నికల వరకే రాజకీయాలు ఉంటాయని, ప్రస్తుతం గెలిచిన ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి ఆ ప్రాంతాల అభివృద్ధి కోసం పని చేయాలని కోరారు.ప్రతి ప్రాంత అభివృద్ధికి పార్టీలకతీతంగా తన సహకారం ఉంటుందని తెలిపారు.రాబోయే వేసవిలో త్రాగునీటి సమస్య ఏ గ్రామంలో లేకుండా ఉండే విధంగా అధికారులు, నూతన ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.గ్రామ పంచాయతీకి విడుదలైన నిధులు సద్వినియోగం అయ్యే విధంగా ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని తెలిపారు.గ్రామాలలో సమస్యలు కేవలం డబ్బుతో మాత్రమే పరిష్కారం కావని అన్నారు.సీసీ రోడ్ల, డ్రైయిన్ నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టడం చాలా కీలకమని అన్నారు. గ్రామాలలో నిర్మించే నూతన రోడ్లు, డ్రైయిన్ సమయంలో అధికారులు ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ అధికంగా ఉండాలని, ఎక్కడ కూడా మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని అన్నారు.తెలంగాణలో ఈ ఖరీఫ్ సీజన్ లో దేశంలో ఎక్కడ లేని విధంగా 148 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండినదని, రైతుల నుండి 72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, ఒక ఖరీఫ్ పంటకే రైతులకు 20 వేల కోట్లు చెల్లించామని అన్నారు. కొనుగోలు బోనస్ కింద 40 వేల కోట్లు చెల్లించామని,ఈ రబీ సీజన్లో 90 లక్షల మెట్రిక్ తన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయుటకు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇంటారాక్టివ్ సెషన్ లాగా నేటి శిక్షణ కార్యక్రమం ఉంటుందని, ప్రతి ఒక్కరూ తమకు ఉన్న సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ కోరారు.తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచ్, పట్టణ ప్రాంత ప్రజా ప్రతినిధులకు విధి నిర్వహణ, ప్రభుత్వ ముఖ్యమైన కార్యక్రమాలు ప్రజలకు అందించేందుకు ఉన్న నిబంధనలు విధివిధానాల గురించి తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో 99 రోజుల కార్యాచరణ చేపట్టడం జరిగిందని అన్నారు.ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి తమ గ్రామం, మున్సిపల్ వార్డు,డివిజన్ పరిధిలో నిబంధనల ప్రకారం బాగా పనిచేసి జాతీయస్థాయిలో ఆదర్శ వంతంగా తీర్చిదిద్దాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, అదనపు కలెక్టర్ కె.సీతారామారావు,జెడ్పీ సిఈఓ శిరీష, డిపిఓ యాదగిరి, సిపిఓ కిషన్, డివైఎస్ఓ వెంకట రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లు, చైర్ పర్సన్లు, వార్డు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ భూతం కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తుంది

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ




**చంద్రుగొండ, మార్చి 13 (జనం సాక్షి) :** నిషేధిత డ్రగ్స్ అమ్మిన కొన్న ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని, గంజాయి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పేర్కొన్నారు. గురువారం చంద్రుగొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల సదస్సులో భాగంగా జూలూరుపాడు సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ శ్రీ లక్ష్మి, ఈగల్ ఫోర్స్ తెలంగాణ సీఐ శ్రీరామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు పాల్గొని మాట్లాడారు. యువత గంజాయి డ్రగ్స్ కు దూరంగా ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసలై ఉజ్వల భవిష్యత్తు అంధకారం చేసుకోకుడదని తెలిపారు. డ్రగ్స్ నివారణకు పోలీస్ డిపార్ట్మెంట్ అవిశ్రాంతంగా కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీలక్ష్మి, ఈగల్ ఫోర్స్ సీఐ రామ్ నాయక్ తహశీల్దార్ బి సంధ్యారాణి, సీడీపీవో సలోమని, డాక్టర్ వెంకట ప్రకాష్, ఎక్సైజ్ ఎస్ఐ రామకృష్ణ, ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ శర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉప్పల్ రెడ్డి, ఏఎస్సై పాపయ్య హెడ్ కానిస్టేబుల్స్ ఆదినారాయణ, రవి, హైమత్, గ్రామ పెద్దలు మాలోత్ బోజ్యానాయక్ సారేపల్లి శేఖర్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## ఐఎఫ్ఎస్సీ కోడ్‌ల మార్పుతో అన్నదాతల ఇక్కట్లు

- 7,041 మంది రైతులకు నిలిచిన రుణమాఫీ



**చండూరు, మార్చి 12 (జనంసాక్షి) :** బ్యాంకుల విలీనం మరియు పేరు మార్పు కారణంగా తలెత్తిన సాంకేతిక సమస్యలు నల్గొండ జిల్లాలోని వేలాది మంది రైతుల పాలిట శాపంగా మారాయి. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ కాస్త తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌గా మారడంతో, ఆ బ్యాంకులకు సంబంధించిన పాత (ఐఎఫ్ఎస్సీ) కోడ్‌లు మారిపోయాయి. అయితే, ప్రభుత్వం రుణమాఫీ నిధులను పాత ఐఎఫ్ఎస్సీ కోడ్‌ల ఆధారంగానే విడుదల చేయడంతో అసలు చిక్కు వచ్చి పడింది. కోడ్‌లు సరిపోకపోవడంతో డిజిటల్ ట్రాన్స్‌ఫర్ ఫెయిల్ అయ్యింది. దీనివల్ల జిల్లాలోని సుమారు 7,041 మంది రైతులకు రుణమాఫీ సొమ్ము ఖాతాల్లో జమ కాలేదు. ఆశగా ఎదురుచూస్తున్న తమకు సాంకేతిక కారణాలతో లబ్ధి చేకూరకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి ఈ సాంకేతిక సమస్యను పరిష్కరించి, తమకు రుణమాఫీ వర్తింపజేయాలని వారు కోరుతున్నారు.

## అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ఫోటో ఎగ్జిబిషన్



**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 12 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని రవి మహల్ కన్వెన్షన్ హాల్ లో గురువారం నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో డిపిఆర్ఓ వల్లోజి శ్రీనివాసరావు ఫోటో ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించే విధంగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వీక్షించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలను వారు పరిశీలించారు.ప్రజల కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి అవగాహన కల్పించేలా ఈ ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, సీఈఓ జడ్పీ శిరీష తదితరులు పాల్గొన్నారు.ఈ ఫోటో ఎగ్జిబిషన్ ను ఏర్పాట్లలో సీనియర్ అసిస్టెంట్ పి.సుధాకర్, రికార్డు అసిస్టెంట్ అనిల్ కుమార్, రహీం, అశోక్, నరేష్ పాల్గొన్నారు.

# రంజాన్ తోఫా గిఫ్టు తక్కువ రాకతో అసంతృప్తి

- ప్రభుత్వం దృష్టికి తీసుకు తీసుకువెళ్తా
- ఎమ్మెల్యే జారె



**చంద్రుగొండ, మార్చి 13 (జనం సాక్షి) :** పవిత్ర రంజాన్ మాసంలో పేద ముస్లింలకు ప్రభుత్వం అందజేస్తున్న రంజాన్ తోఫా గిఫ్ట్ తక్కువ రావడంతో ముస్లిం పెద్దలలో అసంతృప్తి ఏర్పడింది. గురువారం రైతు వేదికలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రంజాన్ తోఫా కానుకల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని నిరుపేదలకు గిఫ్ట్ లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఇదే సమయంలో ముస్లిం మత పెద్దలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం మండలంలో ఉన్న ఏడు మజీదులకు గాను ఒక్కొక్క మజీద్ కి 150 రంజాన్ తోఫా గిఫ్ట్ లు అందించే వారని. అలా మండలంలో ఉన్న ఆరు మజీద్ లకు గాను గతంలో 900 నుంచి 1000 తోఫా గిఫ్ట్ లు ఇచ్చేవారన్నారు. ఇప్పుడు ఉన్న ప్రభుత్వం కేవలం మండలంలో ఉన్న అన్ని మజీద్ లకు కలిపి143 గిఫ్ట్ ప్యాక్ లు మాత్రమే ఇవ్వడంపై మత పెద్దలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల కోసం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసేదని కానీ ఈ సంవత్సరం అది కూడా ఇవ్వడం లేదన్నారు.. కావున మండల వ్యాప్తంగా కనీసం 500 గిఫ్ట్ ప్యాక్ లు ఐనా ఇవ్వాలని ఎమ్మెల్యేని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అందరికీ గిఫ్ట్ లు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. దీంతో మత పెద్దలు మిగతా గిఫ్ట్ ప్యాక్ లు వచ్చిన తర్వాతనే ఇవి తీసుకుని వెళ్తామని అక్కడే వదిలేసి వెళ్లారు.

## వైన్స్‌ల సిండికేట్ దందాను రద్దు చేయాలి

- బిజెపి మండల అధ్యక్షులు వడ్లకొండ సంజీవులు
- బిజెపి ఆధ్వర్యంలో ఆబ్కారీ సూపరిండెంట్‌కు వినతి



**చేర్యాల, మార్చి 12 (జనంసాక్షి) :** చేర్యాల మండలంలో ఉన్న సిండికేట్ వైన్స్ ను వెంటనే రద్దు చేయాలని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఎక్సైజ్ జిల్లా సూపరిండెంట్ శ్రీనివాస మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చేర్యాల బిజెపి మండల అధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు గౌడ్, చేర్యాల బిజెపి మండల ప్రధాన కార్యదర్శి తౌట బాలరాజు, చేర్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి కాలకుంట్ల మనీష్, మండల కార్యదర్శి పోలోజు రవి చారి, చేర్యాల పట్టణ ఎస్సీ మోర్చా అధ్యక్షులు ముస్త్యాల శ్రీనివాస్ గారు, చేర్యాల మండల మాన్ కి బాత్ కన్వీనర్ గుంటి రాములు, నాయకులు తౌట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల,పట్టణాల అభివృద్దే దేశ అభివృద్ధి



**మెదక్, మార్చి 12 (జనం సాక్షి) :** గ్రామాల పట్టణాల అభివృద్ధి దేశ అభివృద్ధిని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో రెండవ సెషన్ లో మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు ,సర్పంచులు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. గ్రామాల పట్టణాల అభివృద్ధి దేశ అభివృద్ధిని, వాటి అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు నిరంతరం పని చేయాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య మాట్లాడుతూ.. గ్రామాలు పచ్చదరంగా మారాలన్నారు. మొక్కల పెంపకం ,ఆర్థిక వనరులను సమకూర్చుకొని ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. వైద్యాధికారి శ్రీరామ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఆరోగ్య ఉప కేంద్రాలను సమన్వయం చేసుకొని ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డి సి హెచ్ శివ దయాల్ మాట్లాడుతూ.. ప్రజలందరికీ అంటువ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని, గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లల్లో పౌష్టికాహారం లోపం గుర్తించి, పౌష్టికార లోపాన్ని శాశ్వతంగా తొలగించాలన్నారు. జిల్లా విద్యాధికారి విజయ మాట్లాడుతూ.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పాఠశాల్లో ప్రజాప్రతినిధులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. పాఠ్యపుస్తకాల పంపిణీ, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం, తరగతులు నిర్వహణను సక్రమంగా నిర్వహించేలా చూడాలన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత

- ఆత్మవిశ్వాసంతో అడుగులు వేయండి
- మహిళలు దృఢంగా ఉంటేనే శక్తివంతమైన సమాజం నిర్మాణం
- వికారాబాద్ ఎస్పీ స్నేహమేహ్రు



**వికారాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 12 (జనం సాక్షి) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో స్థానిక మహావీర్ మెడికల్ కాలేజీలో మహిళా దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ముఖ్య అతిథిగా, వికారాబాద్ మునిసిపల్ చైర్మెన్ గడ్డం అనన్య అతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళలు తమపై తాము నమ్మకాన్ని పెంచుకుని, ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సమాజంలో మహిళలు, పిల్లలు మరియు వృద్ధులపై జరిగే ఎలాంటి వేధింపులనైనా సహించబోమని, అన్యాయం జరిగినట్లు తమ దృష్టికి వస్తే బాధ్యతాయుతంగా స్పందిస్తామని విద్యార్థులందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ వేడుకల్లో వికారాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ గడ్డం అనన్య, జిల్లా అదనపు ఎస్పీ రాములు నాయక్, జిల్లా విద్యాశాఖాధికారి రేణుకా దేవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి స్వర్ణలత, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, మహిళా పిఎస్ ఇన్స్పెక్టర్ సరోజ, మహావీర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ బాస్కర్ రాజు , షీ టీమ్ సిబ్బంది, వైద్య విద్యార్థినులు, జిల్లా పోలీస్ శాఖ లోని ఉమెన్ అధికారులు అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్యాస్ కష్టాలు లేకుండా చూస్తాం

**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 13 (జనంసాక్షి) :** కేంద్రంతో కో ఆర్డినేషన్ చేసుకుంటూ సామాన్యులకు గ్యాస్ కష్టాలు లేకుండా చూస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అవగాహన సదస్సులో పాల్గొన్న అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు.గ్యాస్ బ్లాక్ మార్కెట్ పై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఫోకస్ పెట్టినట్లు తెలిపారు.డీలర్లు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవన్నారు. గ్యాస్ నిల్వలకు సంబంధించి నేడు చీఫ్ సెక్రటరీ,సివిల్ సప్లయ్ కమిషనర్ లతో చర్చిస్తామని తెలిపారు.ప్రతి డీలర్ దగ్గర స్టాక్ ఉండే విధంగా చర్యలు చేపడతామన్నారు.



# మత సామరస్యానికి ప్రతీకగా భువనగిరిలో ఇఫ్తార్ విందు

**భువనగిరి టౌన్, మార్చి 12 (జనం సాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా పట్టణ ప్రముఖ న్యాయవాది, సామ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం మైనారిటీ సోదరులకు ముస్లిం మైనారిటీ షాదీ ఖానాలో ఇఫ్తార్ విందును, ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రతి సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కుల మతాలకు అతీతంగా ముస్లిం మైనార్టీలకు సోదర భావంతో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అదేవిధంగా పవిత్ర రంజాన్ మాసంలో,ఎంతో కఠోరంగా ఉపవాస దీక్షలు చేపడుతున్న ముస్లిం సోదరులకు ముందుగా రంజాన్ శుభాకాంక్షలు ఈద్ ముబారక్ తెలిపారు. భువనగిరి పట్టణ, ప్రజలపై అల్లా దీవెనలు ఉండాలని ప్రతి ఒక్కరు సుఖ సంతోషా లతో రంజాన్ పండుగను జరుపుకోవాలని కోరారు.

మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ యాదాద్రి జిల్లా అధ్యక్షులు ఇంతియాజ్ మాట్లాడుతూ గంగ జమున తహేజీబ్ లాంటి పండుగ వాతావరణం గత ఏండ్ల నుండి భువనగిరి లొ కొనసాగుతుందని దానికి నిదర్శనం ప్రముఖ అడ్వకేట్ సామ రాజేందర్ రెడ్డి అని అన్నారు.అదే విధంగా కుల మతాలకు అతీతంగా తన దగ్గరికి వచ్చే క్లయింట్ లకు ఉచితంగా సేవలు అందిస్తున్నారని వారు ఇచ్చిన ఇఫ్తార్ విందు దేవుడు స్వీకరించాలని అన్నారు. వారికి వారి కుటుంబానికి అల్లాహ్ ఆశీస్సులు ఎప్పటికి ఉంటాయని అన్నారు. ఎల్లప్పుడూ ముస్లిం, మైనార్టీలకు ఇతర వర్గాల వారికి న్యాయపరంగా అందుబాటులో ఉంటారని తెలిపారు.హిందూ ముస్లిం బేదాభిప్రాయం లేకుండ అందరు కలిసి మెలిసి ఉండాలని ఇఫ్తార్ పార్టీ లో విచ్చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు,కౌన్సిలర్ మజహర్ బబ్లు,ఎండీ ఇస్తియాక్ అహ్మద్ శేక్ మీరా రజా హుస్సేన్,ఎండీ రహీం,ఎండీ అంజాద్,ఎండీ సల్మాన్,ఎండీ ఆసిఫ్,ఎండీ ఇస్మాయిల్ ఎండీ రహీం ముతహర్



మాసూద్,ఇస్తియాక్ నాజిమ్,రహీం అంజాద్ అహ్మద్,ఎండీ రిజ్వాన్,ఎండీ వసీమ్,ఎండీ మసి, తదితరులు పాల్గొన్నారు.

విపణి

## ఏప్రిల్ 1 నుంచి పెరగనున్న ఆడి కార్ల ధరలు

దిల్లీ: జర్మనీకి చెందిన ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడి వాహన ధరల్ని పెంచుతున్నట్లు ప్రకటించింది. భారత్‌లో విక్రయిస్తున్న అన్నిరకాల మోడళ్లపై 2 శాతం వరకు ధరలు పెంచుతామని వెల్లడించింది. పెరిగిన ధరలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని ఆడి ఇండియా బ్రాండ్ డైరెక్టర్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ ఓ ప్రకటనలో తెలిపారు. దేశంలో పెరుగుతున్న ధరలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ హెచ్చుతగ్గులే ఇందుకు కారణమని పేర్కొన్నారు. భారత్‌లో లగ్జరీ కార్లతో పాటు ఎస్‌యూవీలను ఆడి విక్రయిస్తోంది. క్యూ3 ఎస్‌యూవీ నుంచి ఎస్‌యూవీ ఆర్ఎస్ క్యూ8 వరకు రూ.43.23 లక్షల నుంచి రూ. 2.34 కోట్ల ధరల శ్రేణిలో వీటిని విక్రయిస్తోంది.



# మళ్లీ బేర్‌మన్న మార్కెట్లు

### సెన్సెక్స్ 830 పాయింట్లు పతనం



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి తీవ్ర అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ఇరాన్, అమెరికా- ఇజ్రాయెల్ యుద్ధం రోజురోజుకూ తీవ్రతరం అవుతుండడం, ఎఫ్ఐఐల విక్రయాలు కొనసాగుతుండడం వంటివి ప్రతికూల ప్రభావం చూపాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు మరోసారి భగ్గుమనడం కూడా సెంటిమెంట్ దెబ్బతీసింది. దీంతో దేశీయ స్టాక్ మార్కెట్‌లు బేర్‌గుప్పిట్లోకి వెళ్లాయి. సందట్లో సడేమియా అన్నట్లు భారత్ సహా 16 దేశాల వాణిజ్య పద్ధతులపై ట్రంప్ ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించడంతో కొత్త టారిఫ్ భయాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ ఓ దశలో 900 పాయింట్లకు పైగా పతనమైంది. నిఫ్టీ 23,650 దిగువకు చేరింది.సెన్సెక్స్ ఉదయం 76,369.65 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,863.71) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 75,871.18 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 829.29 పాయింట్ల నష్టంతో 76,034.42 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 227.70 పాయింట్ల నష్టంతో 23,639.15 వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 92.17గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్, ఎల్అండ్‌టీ, అల్ట్రాటెక్ సిమెంట్ స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. ఎన్టీపీసీ, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, రిలయన్స్ స్టాక్స్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 96.50 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5185 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

కారణాలు ఇవీ..

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలతో చమురు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తమ వద్ద ఉన్న వ్యూహాత్మక నిల్వలను విడుదల చేసేందుకు పలు దేశాలు నిర్ణయం తీసుకుంటున్నప్పటికీ.. గురువారం చమురు ధరలు దూసుకెళ్లాయి.

## ర్యాపిడోకు 74 మిలియన్ యాక్టివ్ యూజర్లు..

### ఉబర్ కంటే డబుల్

న్యూఢిల్లీ:ప్రముఖ క్యాబ్ బుకింగ్ సేవల సంస్థ ర్యాపిడో తన హవా కొనసాగిస్తోంది. జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28 మధ్య రికార్డు స్థాయిలో 73.96 మిలియన్ నెలవారీ యాక్టివ్ యూజర్లను నమోదు చేసినట్లు యాప్ ఇంటెలిజెన్స్ సంస్థ సెన్సార్ టవర్ వెల్లడించింది. ఈ విషయంలో ఉబర్, ఓలాను ర్యాపిడో వెనక్కి నెట్టింది. ఉబర్ 39.05 మిలియన్ యాక్టివ్ యూజర్లు, ఓలా 28.15 మిలియన్ యాక్టివ్ యూజర్లతో రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. ఉబర్‌తో పోలిస్తే ర్యాపిడో యాక్టివ్ యూజర్ల సంఖ్య దాదాపు రెట్టింపు కావడం గమనార్హం. వారపు యాక్టివ్ యూజర్ల విషయంలోనూ ర్యాపిడోదే అగ్రస్థానం. జనవరి 19 నుంచి ఫిబ్రవరి 22 మధ్య ర్యాపిడోకు 40.07 మిలియన్ యాక్టివ్ యూజర్లు ఉండగా.. ఉబర్ 20.56 మిలియన్, ఓలా 11.63 మిలియన్ యూజర్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. క్యాబ్ సేవల విషయంలో ఒకప్పుడు ఓలా, ఉబర్‌దే హవా. అలాంటి సమయంలో బైక్ ట్యాక్సీ సేవలను ర్యాపిడో ప్రారంభించింది.



## దేశంలో గరిష్ఠ వార్షిక వేతనం రూ.8 కోట్లు

### ఏఐ నిపుణులకు 30% అధికంగా ఇస్తున్నారు

### ప్రైవేటు ఈక్విటీల్లో ఎండీలకు రూ.4-6 కోట్లు

దేశంలో ప్రైవేటు ఈక్విటీ, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్‌లో పెద్ద హోదాల్లో ఉన్నవారికి భారీ ప్యాకేజీలు లభిస్తున్నాయి. దీంతోపాటు వర్ధమాన రంగాల్లో నైపుణ్యం ఉన్నవారికీ గిరాకీ అమాంతం పెరిగింది. ఇంజినీరింగ్, తయారీ, ఫార్మా, మానవ వనరుల విభాగాల్లో ఉన్నతోద్యోగులకు రూ.కోట్లలో వార్షిక వేతనాలు లభిస్తుండగా.. ఏఐ, సెమీకండక్టర్, విద్యుత్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనం వంటి కొత్త గిరాకీ రంగాల్లో వేతనాలు 30% వరకు పెరగొచ్చని అంచనా. ఇండియా శాలరీ గైడ్ 2026 పేరిట మైఖేల్ పేజ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం..సీనియర్ కార్పొరేట్ ఫైనాన్స్ నాయకత్వ హోదాల్లో ఉన్నవారికి అత్యధిక వేతన ప్యాకేజీలందుతున్నాయి. రూ.10,000 కోట్ల ఆదాయం కంటే ఎక్కువ ఉన్న సంస్థల ముఖ్య ఆర్థిక అధికారు (సీఎఫ్ఓ)లకు వార్షిక వేతనం రూ.1.75 - 8 కోట్ల వరకు ఉంటోంది. రూ.5,000-10,000 కోట్ల ఆదాయార్జన ఉండే కంపెనీల సీఎఫ్ఓలు రూ.1.5 - 4 కోట్ల వరకు, రూ.1000-5000 కోట్ల మధ్య ఆదాయం ఉండే సంస్థల్లో రూ.1 - 3 కోట్ల వరకు ప్యాకేజీ ఈ స్థాయి అధికారులకు లభిస్తోంది.కార్పొరేట్ ఫైనాన్స్, ట్రెజరీ ఉద్యోగాల్లో 10-15 ఏళ్ల అనుభవం ఉన్నవారు రూ.65 లక్షలు-రూ.1.2 కోట్ల వార్షిక వేతనాన్ని అందుకుంటున్నారు.భారత ఆర్థిక సేవల రంగంలో అత్యంత లాభదాయకత ప్రైవేటు ఈక్విటీ(పీఈ)లకు ఉంటోంది. అంతర్జాతీయ పీఈ సంస్థల ఎండీలు ఏటా రూ.4-6 కోట్ల వార్షిక వేతనాన్ని అందుకుంటుంటే, డైరెక్టర్లు రూ.1.85-4 కోట్ల వరకు సంపాదిస్తున్నారు. బహుళజాతి బ్యాంకుల్లో విలీనాలు-కొనుగోళ్లు, కార్పొరేట్ ఫైనాన్స్ ప్రొఫెషనల్స్‌లో అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ స్థాయి ఉన్న వారు రూ.55-90 లక్షల వరకు ఆర్జిస్తున్నారు. డైరెక్టర్లు, ఎండీలకు వరుసగా రూ.1-1.5 కోట్లు; రూ.2.5-4 కోట్ల ప్యాకేజీ ఉంటోంది.

**తయారీ, ఇంజినీరింగ్ వేతనాలు పైకి**

తయారీ సంస్థల్లో ముఖ్య కార్యనిర్వాహక అధికారులు (సీఓఓ) రూ.1-3 కోట్ల వార్షిక వేతనాన్ని అందుకుంటున్నారు. లాభనష్టాలకు బాధ్యత వహించే వ్యక్తులు రూ.1.5-6 కోట్ల వరకు తీసుకుంటున్నారు. ప్రాజెక్టు మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్‌లో 15-20 ఏళ్ల అనుభవం ఉన్నవారు రూ.50 లక్షల నుంచి రూ.1.5 కోట్ల దాకా పొందుతున్నారు. సస్టెయినబిలిటీ, ఏఐ (కృత్రిమమేధ), వ్యూహాత్మక పెట్టుబడుల కంపెనీల్లో నిపుణులకు 35-50% వేతన పెంపు లభిస్తోంది.

**ఆరోగ్య సంరక్షణ, ఫార్మాలో ఏఐ**

ఆరోగ్య, లైఫ్‌సైన్సెస్ రాగాల్లో ఏఐ పాత్ర పెరుగుతోంది. డయాగ్నొస్టిక్స్, క్లినికల్ రీసెర్చ్, డ్రగ్ డిస్కవరీలో ఏఐని ఉపయోగిస్తున్నారు. ఫార్మా విక్రయాల్లో 25 ఏళ్ల అనుభవం ఉన్న ప్రొఫెషనల్స్ రూ.65 లక్షలు-1.2 కోట్లు చేజిక్కించుకుంటున్నారు. వైద్య పరికరాల కంపెనీల ఉన్నతాధికార్లు గరిష్ఠంగా రూ.3.5 కోట్ల వార్షిక వేతనాన్ని పొందుతున్నారు.

**కోట్ల క్లబ్‌లోకి హెచ్‌ఆర్ విభాగమూ..**

టాలెంట్ మేనేజ్‌మెంట్, వర్క్‌ఫోర్స్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో ఉన్న కంపెనీల్లోని మానవ వనరుల(హెచ్‌ఆర్) అధికారుల వేతనాలూ పెరగుతున్నాయి. పెద్ద సంస్థల హెచ్‌ఆర్ అధిపతులు రూ1.5-4 కోట్లు అందుకుంటుంటే, 15 ఏళ్ల అనుభవం ఉన్న ప్రొఫెషనల్స్‌కు రూ.1-1.8 కోట్ల దాకా వస్తోంది.

**ఉద్యోగం మారినపుడు 30-40% వేతన పెంపు**

సామర్థ్యం ఉన్నవారికే సంస్థలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. అందుకే అధునాతన నైపుణ్యాలు కలిగినవారు ఉద్యోగం మారితే 30-40% వేతన పెంపును పొందగలుగుతున్నారు. గతంలో ఈ తరహా వేతన పెంపు సగటు 9.1 శాతమే. ఏఐ, మెషీన్ లెర్నింగ్ నిపుణులకు ఉద్యోగాలు ఏడాది కిందటితో పోలిస్తే 49% పెరిగాయి. సెమీకండక్టర్స్, బ్యాటరీ టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీలో నిపుణుల కోసం కంపెనీలు తీవ్రంగా వెతుకుతున్నాయి. ఫిన్‌టెక్, క్లినికల్‌రీసెర్చ్‌లో ప్రత్యేక నైపుణ్యం ఉన్నవారిని 20-35% వేతన పెంపుతో తీసుకుంటున్నారు. జీసీసీలతో అధిక ఉపాధి: దేశంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్(జీసీసీ)ల వృద్ధి, ఏఐ ఆధారిత వినూత్నత పెరగడంతో.. సంబంధిత ప్రత్యేక నైపుణ్యం ఉన్న వారికి గిరాకీ భారీగా పెరిగింది. బెంగళూరు, హైదరాబాద్, పుణె, దిల్లీ వంటి భారతీయ నగరాల్లో బహుళజాతి కంపెనీలు పరిశోధన-అభివృద్ధి కేంద్రాలను నెలకొల్పడానికి కారణం ఇదే. ఈ నిపుణులకు అధిక గిరాకీ: అనుభవం కన్నా నైపుణ్యం ఉన్నవారికే అధిక వేతనాలు లభిస్తున్నాయి.

**ఏఐ, మెషీన్ లెర్నింగ్**

డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ నిపుణులకు వేతన పెంపులు భారీగా ఉంటున్నాయి. రూ.20 లక్షలు+ ప్యాకేజీ దూకుడు: ఐటీ రంగంలో ఈ వేతన విభాగం వేగంగా వృద్ధి చెందుతోంది. జూనియర్ డెవలపర్లను భారీగా తీసుకోవడానికి బదులు, మధ్య - సీనియర్‌స్థాయిలో నైపుణ్యం ఉన్నవారి వైపు కంపెనీలు అడుగులు వేయడం ఇందుకు ప్రధాన కారణం.

## గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 5.15

వరంగల్ ₹ 5.17

**బంగారం ధరలు (10 గ్రాములు)**

హైదరాబాద్

₹ 1,48,700 (22 క్యారెట్లు)

₹ 1,62,220 (24 క్యారెట్లు)


**వెండి ధరలు (కేజీ)**

హైదరాబాద్

₹ 2,90,000

# హర్మూజ్‌లో ఇరాన్ వల..

## అడుగుకో గండం..!



టెహ్రాన్:హర్మూజ్ జలసంధి నౌకలకు మృత్యుమార్గంగా మారనుంది. అమెరికా-ఇజ్రాయెల్ దాడులు పెరిగేకొద్దీ తన సార్వభౌమత్వాన్ని కాపాడుకొనేందుకు ఇరాన్ నుంచి ప్రతిఘటన తీవ్రమవుతోంది. తన అధీనంలో ఉన్న హర్మూజ్ జలసంధిని శత్రునౌకల పాలిట మృత్యుమార్గంగా మార్చేస్తోంది. ఇందుకోసం తాజాగా తన పాత ఆయుధాన్ని రంగంలోకి దించుతోంది. ఈ ప్రాంతంలోకి అమెరికా మిత్ర దేశాల నౌకలు అడుగుపెడితే పేలిపోయేలా ఇరాన్ ఎక్కడికక్కడ ఉచ్చులు పరిచింది. ఈ చర్యలు ట్రంప్ సర్కారుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రపంచాన్ని భయపెడుతున్న ఆ ఆయుధం పేరు 'సీమైన్స్' లేదా 'నేవల్ మైన్స్' (సముద్రపు మందుపాతరలు)..! సముద్రంలో ఒక్కసారి మైన్స్‌ను పరిచాక నౌకలు ఏమార్గంలో ప్రయాణిస్తే హర్మూజ్‌ను దాటగలవో ఒక్క ఇరాన్‌కు మాత్రమే తెలుసు. సాధారణంగా శత్రువులు సరిహద్దులు దాటకుండా భూమిలో మందుపాతర్లు అమర్చినట్లే సముద్ర జలాల్లో అమర్చే వాటిని సీమైన్స్ అంటారు. నౌకలు, జలాంతర్గాములను ధ్వంసం చేయడానికి అవి ప్రయాణించే మార్గాల్లో ఏర్పాటుచేస్తారు. దీంతో శత్రువు ఆ మార్గంలోకి రాకుండా ఇవి భయపెడుతుంటాయి. అమెరికా విప్లవం సమయంలో గన్‌పౌడర్ నీటి అడుగున కూడా పేలుతుందనే విషయాన్ని యేల్‌కు చెందిన డేవిడ్‌బుష్‌నెల్ గుర్తించినప్పుడే వీటి తయారీకి బీజం పడింది. వీటిల్లో వివిధ రకాల మైన్స్ ఉన్నాయి. సముద్రం అడుగున గొలుసులతో అమర్చేవి, ప్రొపల్షన్ వ్యవస్థలతో పనిచేసేవి ముఖ్యమైనవి. ఇక మైన్స్‌ను నౌకల కింది భాగాలు తాకినా, అయస్కాంత క్షేత్రం సమీపంలోకి వచ్చినా, నౌకల ప్రొపల్షన్ వ్యవస్థ చప్పుడుకు, నౌక నీటిపై సృష్టించే ఒత్తిడికి ఇవి పేలిపోయేలా వీటిని రూపొందిస్తారు. రిమోట్ సాయంతో వీటిని పేల్చవచ్చు. వీటిల్లో మైన్ స్థాయిని బట్టి 50 నుంచి 1,000 కేజీల పేలుడు పదార్థాలు ఉంటాయి. మిగిలిన ఆయుధాలతో పోలిస్తే ఇవి చౌక.ఇరాన్ వద్ద దాదాపు 2,000 నుంచి 6,000 వరకు సీమైన్స్ ఉన్నట్లు అంచనాలు ఉన్నాయి. వీటిని చైనా, రష్యా నుంచి కొనుగోలు చేయడంతోపాటు.. సొంతంగా కూడా ఉత్పత్తి చేస్తోంది. ఇరాన్ నౌకాదళంలోని చిన్న నౌకలు ఒక్కోటి రెండు నుంచి మూడు మైన్స్‌ను సముద్రంలో అమర్చగలవు. ఇలాంటి నౌకలు వందల సంఖ్యలో ఇరాన్ వద్ద ఉన్నాయి. ఇక సబ్‌మెరైన్ల సాయంతో సముద్రంలో అమర్చే మైన్స్ కూడా టెహ్రాన్ వద్ద ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. వీటి సాయంతో సముద్రంలో మైన్స్‌ను పెట్టడం వల్ల హర్మూజ్ జలసంధిని దాటడం రవాణా నౌకలకు అసాధ్యంగా మారిపోతుంది. 1980ల్లో ట్యాంకర్ వార్ వేళ భారీ సంఖ్యలో సీమైన్లను వాడి నౌకలను ధ్వంసం చేశారు. ఈ క్రమంలో ట్రంప్ సర్కారు కూడా కంగారుపడుతోంది. హర్మూజ్‌లో సీమైన్స్‌ను తొలగించాలని ట్రంప్ స్వయంగా ఆదేశాలు జారీ చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలోనే నేడు అమెరికా దళాలు 16 ఇరానియన్ మైన్ లేయర్స్ నౌకలను ధ్వంసం చేశాయి. కాకపోతే ఇంకా పెద్దసంఖ్యలో ఇరాన్ వద్ద ఈ శ్రేణి నౌకలు ఉన్నాయి.

**ట్రంప్ సర్కారు నిర్ణయంతో మరిన్ని తిప్పలు..**

ఓవైపు ఇరాన్‌హర్మూజ్‌లో సీమైన్స్‌ను అమరుస్తున్నట్లు వార్తలు వెలువడుతున్న వేళ.. ట్రంప్ సర్కారు గతంలో తీసుకొన్న ఓ నిర్ణయం బెడిసికొట్టినట్లైంది. సీమైన్స్‌ను తొలగించే మైన్‌స్వీపర్స్‌కు తీవ్రమైన కొరత ఏర్పడింది. గతేడాది సెప్టెంబర్‌లో పర్షియన్ గల్ఫ్‌లోని నాలుగు స్పెషలైజ్డ్ మైన్ స్వీపర్లను డీకమిషన్ చేసింది. బహ్రెయిన్‌లోని అమెరికా నౌకాదళ కేంద్రం నుంచి వీటిని ఓ హెవీ లిఫ్ట్‌వెసల్‌లో ఉంచి తుక్కు కింద అమెరికాకు తరలించేసింది. ఈ ప్రాంతానికి తరలించనున్న నాలుగు లిట్టోరల్ కాంబాట్ షిప్‌లకు మైన్స్‌ను తొలగించే బాధ్యతలు అప్పగిస్తామని అప్పట్లో యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. అయితే వీటి పనితీరు ఏమాత్రం బాగోలేదని రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఇక నాలుగు పంపుతానన్న అమెరికా మూడింటినే పంపింది. వీటిని హర్మూజ్ జలసంధిలో మోహరిస్తే అది కేవలం పబ్లిసిటీ స్టంట్‌గానే మిగులుతుందని అమెరికా నేవీ మాజీ కెప్టెన్, విశ్లేషకుడు కార్ల్ షూస్టర్ సీఎన్ఎన్‌కు వెల్లడించారు. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో ఓడలకు హర్మూజ్ జలసంధి మృత్యు మార్గంగా మారే ప్రమాదం పొంచి ఉంది.

### ఇరాన్‌తో యుద్ధం..

## తొలి ఆరు రోజుల్లో రూ.లక్ష కోట్లు ఖర్చు

పశ్చిమాసియాలో పోరు కొనసాగుతోంది. గత 11 రోజులుగా ఇరాన్‌పై భీకర స్థాయిలో దాడులు చేసేందుకు అమెరికా అత్యాధునిక ఆయుధ వ్యవస్థలు ఉపయోగిస్తోంది. ఇందుకుగాను అమెరికా తన చేతి చమురును వదిలించుకొంటున్నట్లు తెలుస్తోంది. యుద్ధం మొదలైన తొలి ఆరు రోజులకు గాను ట్రంప్ యంత్రాంగానికి 11 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో రూ.లక్ష కోట్లకు పైగా) ఖర్చయినట్లు సమాచారం. సెనేటర్లతో జరిగిన అంతర్గత సమావేశంలో రక్షణ అధికారులు ఈ ఖర్చుకు సంబంధించిన వివరాలను తెలిపినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఆరు రోజులకు 11.3 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ ఖర్చయిందని అధికారులు అంచనా వేశారు. అయితే, ఇది ఇంకా చాలా పెద్ద మొత్తంలో ఉండొచ్చని సెనేటర్ క్రిస్ కూన్స్ విలేకరులతో అన్నారు. మరోవైపు యుద్ధాన్ని కొనసాగించడం కోసం ట్రంప్ యంత్రాంగం అదనపు నిధుల కోసం ప్రయత్నాలు మొదలుపెట్టింది. అదనపు బడ్జెట్‌ను కోరుతూ వైట్‌హౌస్ త్వరలోనే కాంగ్రెస్‌కు ప్రతిపాదనలు పంపనుందని కొందరు కాంగ్రెస్ సహాయకులు పేర్కొన్నారు. దాదాపు 50 బిలియన్ డాలర్ల వరకు కోరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గతనెల 28 నుంచి అమెరికా- ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై భీకర దాడులు చేస్తున్నాయి. ఇరాన్ కూడా ప్రతీకార దాడులతో విరుచుకుపడుతోంది. యుద్ధం మొదలైన తొలి రెండు రోజుల్లోనే యూఎస్ 5.6 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధ సామగ్రిని వినియోగించినట్లు అధికారులు అంచనా వేశారు. అమెరికా రక్షణశాఖ ఇప్పటికే ఇబ్బందుల్లో ఉండగా.. ప్రస్తుత యుద్ధం వల్ల సైనిక నిల్వలు మరింత తగ్గుతాయని కాంగ్రెస్ సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు.



## ఎల్‌పీజీ పై చర్చలో 'ఎప్‌స్టీన్ ఫైళ్లు'

### రాహుల్ వ్యాఖ్యలపై లోక్‌సభలో అభ్యంతరం..

న్యూఢిల్లీ:పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ దేశంలో ఇంధన భయాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో గురువారం ఎల్‌పీజీ అంశంపై లోక్‌సభలో చర్చ జరిగింది. అప్పుడు కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఎప్‌స్టిన్ ఫైళ్ల ప్రస్తావన తీసుకురావడంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. "హర్మూజ్ జలసంధి నుంచి పెద్ద ఎత్తున దిగుమతులు జరగాల్సి ఉంది. యుద్ధం కారణంగా దిగుమతులు ఆగిపోయాయి. ఇది ఆరంభం మాత్రమే. గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది. మనం ఎవరి నుంచి చమురుకొనాలో అమెరికా నిర్ణయిస్తోంది. రష్యా నుంచి చమురు కొనాలో..?వద్దో..? మనకు మనం నిర్ణయించుకోవాలి. రష్యా నుంచి చమురు కొనుగోలుపై అమెరికా జోక్యం ఎందుకు..? భారత్ వంటి పెద్ద దేశానికి మరోదేశం అనుమతి ఎందుకు..? ఇలా ఎందుకు జరుగుతోందా అని ఆలోచించాను. నా ప్రశ్నకు సమాధానం ఎప్‌స్టిన్ ఫైల్స్ రూపంలో దొరికింది. ఎప్‌స్టిన్ ఫైళ్ల ప్రభావం ఎల్‌పీజీ దిగుమతులపై పడినట్లు ఉంది. ఎప్‌స్టీన్‌తో సంబంధాలను పెట్రోలియం మంత్రే అంగీకరించారు" అని రాహుల్ వ్యాఖ్యలు చేశారు. ఇవి దుమారం రేపాయి. దీంతో స్పీకర్ ఓం బిర్లా స్పందించారు. నోటీసు ఇచ్చిన అంశంపైనే మాట్లాడాలని సూచించారు. సభ్యుల ఇష్టాఇష్టాల మేరకు సభ నడవదని స్పష్టం చేశారు. ఇదే అంశంపై పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ ప్రసంగాన్ని విపక్షాలు అడ్డుకున్నాయి. ఎప్‌స్టీన్ అంటూ లోక్‌సభలో విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. .

## చమురు కొరత లేదు

దేశీయ రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని అన్నారు. ప్రజలు ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయవద్దని కోరారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్‌పీజీ లభ్యతపై ఆందోళన నెలకొనడంతో కేంద్ర మంత్రి లోక్‌సభలో మాట్లాడారు. 'ఆధునిక ఇంధన చరిత్రలో ప్రపంచం ఇలాంటి క్లిష్ట సమయాన్ని మునుపెన్నడూ ఎదుర్కోలేదు. భారత్ తన ముడి చమురు అవసరాల భారత్ తన ముడి చమురు అవసరాల కోసం సురక్షితమైన సరఫరాలను సమకూర్చుకుంది. హర్మూజ్ సంక్షోభంతో భారత్‌కు సంబంధం లేదు. హర్మూజ్ జలసంధి భారత్‌కు తెరిచారు. ప్రధానమంత్రి చర్చలతో పరిస్థితులు సర్దుకుంటున్నాయి' అని హర్దీప్ సింగ్ తెలిపారు. ఎలాంటి సంక్షోభం తలెత్తినా ఎదుర్కునేందుకు కూడా కేంద్రం సిద్ధంగా ఉందని చెప్పారు. డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాకు డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని మంత్రి వివరించారు. సిలిండర్ల సరఫరాలో ఆసుపత్రులు, విద్యాసంస్థలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. సిలిండర్ బుకింగ్‌కు నగరాల్లో 25 రోజుల వ్యవధి, గ్రామాల్లో 45 రోజుల వ్యవధి అమలు చేస్తున్నట్టు చెప్పారు.

## చమురులో కాలేసిన అమెరికా!

### ఇంధన సంక్షోభాన్ని తక్కువగా అంచనా వేసిన ట్రంప్ బృందం

వాషింగ్టన్: అమెరికా, ఇజ్రాయెల్ దాడులపై ఇరాన్ ప్రతిస్పందన విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఆయన సలహాదారుల లెక్కలు తప్పాయి. ఇరాన్‌లో అధికార మార్పిడి ముందు యుద్ధం కారణంగా తలెత్తే సమస్యలు పెద్దవేమీ కాదనుకున్న వారి అంచనాలు తలకిందులయ్యాయి. ఫలితంగా ప్రపంచ దేశాలు చమురు సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వ్యూహాత్మక చమురు నిల్వలను బయటకు తీయాల్సి వస్తోంది. ఇరాన్‌పై దాడులు చేయాలా.. వద్దా అనే సందిగ్ధంలో అధ్యక్షుడు ట్రంప్ ఉన్నప్పుడు.. దాడుల కారణంగా చమురుపై ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని ఇంధనశాఖ మంత్రి క్రిస్ వైట్ స్పష్టం చేశారు. యుద్ధంవల్ల పశ్చిమాసియాలో ఇంధన సరఫరాకు అంతరాయం కలగబోదని, ఇంధన మార్కెట్లలో సంక్షోభం తలెత్తదని ధీమాగా చెప్పారు. గత ఏడాది జూన్‌లో ఇరాన్‌పై దాడులు చేసినప్పుడు స్వల్పంగా ఇంధన మార్కెట్లో ఒడిదొడుకులు చోటుచేసుకున్నాయని, ఆ తర్వాత వెంటనే సర్దుకున్నాయని ఉదహరించారు. కొంత మంది ట్రంప్ సలహాదారులూ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రెండోసారి దాడులు చేస్తే ఆర్థిక వ్యవస్థలను ఇరాన్ లక్ష్యంగా చేసుకునే అవకాశముందన్న హెచ్చరికలను కొట్టిపారేశారు. చమురు రవాణాను ఇరాన్ అడ్డుకుంటుందనే కొంత మంది ఆందోళనలే ఇప్పుడు నిజమయ్యాయి. హర్మూజ్ జల సంధిని ఆ దేశం మూసివేసింది. గతం కంటే ఈసారి రవాణా నౌకలపై భారీగా దాడులకు దిగుతోంది. దీంతో పర్షియన్ గల్ఫ్‌లో రవాణా పూర్తిగా స్తంభించింది. చమురు ధరలు పెరిగాయి. అమెరికన్లపై చమురు ధరల భారాన్ని తగ్గించడానికి ఇప్పుడు ట్రంప్ ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. యుద్ధంపై చట్టసభ సభ్యులకు మంగళవారం ప్రభుత్వం వివరణ ఇచ్చాక కనెక్టికట్ డెమొక్రాట్ సెనేటర్ క్రిస్టోఫర్ ఎస్ మర్ఫీ ఎక్స్ వేదికగా చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. హర్మూజ్ జల సంధిపై ట్రంప్ ప్రభుత్వానికి ఒక ప్రణాళిక అంటూ లేదని, దానిని తెరిపించడానికి ఏం చేయాలో తెలియదని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ యంత్రాంగంలోని కొంత మంది అధికారులూ యుద్ధంపై నిరాశావాదంతోనే ఉన్నారు. అయితే వారు బహిరంగంగా స్పందించడం లేదు.హర్మూజ్ నుంచి నౌకలను అడ్డుకోవడానికి ఇరాన్ సీమైన్లను అమరుస్తోంది. దీంతో అమెరికా వాటిని అమర్చే నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయాల్సి వచ్చింది. ప్రతిగా ఇరాన్.. నేరుగా రవాణా నౌకలను లక్ష్యంగా చేసుకుంటోంది. ఇది యుద్ధ తీవ్రతను మరింత పెంచింది.



## నా దగ్గర ఎలాంటి బటన్ ఉండదు: స్పీకర్ ఓం బిర్లా

న్యూఢిల్లీ:విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిన నేపథ్యంలో గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్పందించారు. ప్రతి ఎంపీకి లోక్‌సభలో మాట్లాడే అవకాశం కల్పించడానికి తాను ఎల్లప్పుడూ ప్రయత్నిస్తానని అన్నారు. సభ నియమ నిబంధనలకు ఎవరూ అతీతులు కారని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఎంపీల మైక్రోఫోన్లను నియంత్రించాననే ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు."సభలో ఎవరికీ ప్రత్యేక వెసులుబాట్లు ఉండవు. నిబంధనల ప్రకారమే కార్యకలాపాలు నడుస్తాయి. ప్రధాని, మంత్రులు కూడా ఏవయినా ప్రకటనలు చేయడానికి ముందు సభ నిబంధనల ప్రకారం నోటీసులు ఇవ్వాలి. మైక్రోఫోన్లు ఆన్ లేక ఆఫ్ చేయడానికి స్పీకర్ వద్ద ఎలాంటి బటన్ ఉండదు. ఈ విషయం విపక్ష నేతలకు కూడా తెలుసు. మాట్లాడేందుకు అనుమతి ఉన్న సభ్యుడికి మాత్రమే మైక్రోఫోన్ ఆన్ అవుతుంది" అని తనపై విపక్షాలు కొంతకాలంగా చేస్తోన్న విమర్శలకు బిర్లా సమాధానం ఇచ్చారు.రెండ్రోజుల చర్చ అనంతరం బుధవారం సాయంత్రం విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరిగింది. మూజువాణి ఓటుతో అది వీగిపోయింది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన భాజపా ఎంపీ నిశికాంత్ దుబెపై చర్యలు చేపట్టకపోవడం వంటి కారణాలతో విపక్షాలు ఈ అవిశ్వాస తీర్మానాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే.

# జర్నలిస్టులకూ క్యాష్‌లెస్ వైద్యం అందించాలి

- సీఎస్ రామకృష్ణారావుకు టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే వినతి
- సర్కారు ఉద్యోగుల తరహాలోనే కార్పొరేట్ చికిత్స అందించాలని విజ్ఞప్తి



**హైదరాబాద్, (జనంసాక్షి) :** రాష్ట్రంలోని జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే అన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత (క్యాష్‌లెస్) వైద్యం అందించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరే షన్ (టీడబ్ల్యూజేఎఫ్), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే) ప్రతినిధులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుకు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రత దృష్ట్యా ఇన్సూరెన్స్ ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలని వారు కోరారు. ఈ మేరకు గురువారం సెక్రటేరియట్‌లో సీఎస్ రామకృష్ణారావును టీడబ్ల్యూజేఎఫ్ స్టేట్ యాక్టింగ్ ప్రెసిడెంట్ పి.రాంచందర్, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, హెచ్‌యూజే అధ్యక్షులు బి.అరుణ్ కుమార్, కార్యదర్శి బి.జగదీశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, కోశాధికారి బి. రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్ బయ్యా దామోదర్, జాయింట్ సెక్రటరీ క్రాంతి తదితరులు కలిశారు. ఈ సందర్భంగా పలు జర్నలిస్టుల సమస్యలపై చర్చించి ఆయనకు వినతిపత్రం అందజేశారు.
ప్రభుత్వ ఉద్యోగుల కోసం సర్కారు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న 'హెల్త్ కేర్ ట్రస్ట్' పరిధిలోకి జర్నలిస్టులను కూడా తీసుకురావాలని వారు కోరారు. పరిమితి లేని ఉచిత వైద్య సేవలను జర్నలిస్టులకు వర్తింపజేయాలని, ఇందుకోసం అవసరమైన ప్రీమియంను ప్రభుత్వమే బీమా సంస్థలకు చెల్లించాలని సూచించారు. సరైన వైద్యం అందక, ఆర్థిక ఇబ్బందులతో జర్నలిస్టుల కుటుంబాలు పడుతున్న అవస్థలను సీఎస్ దృష్టికి నేతలు తీసుకెళ్లారు. ఈ అంశంపై జర్నలిస్టు సంఘాలతో త్వరలోనే ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కోరారు. దీనికి సీఎస్ రామకృష్ణారావు సానుకూలంగా స్పందించారు. సీఎం దృష్టికి సమస్యలను తీసుకుపోతామని హామీనిచ్చారు. కాగా, ఈ సందర్భంగా హెచ్‌యూజే రూపొందించిన మీడియా డైరీ-2026ను సీఎస్ కె.రామకృష్ణారావుకు సంఘం ప్రెసిడెంట్ అరుణ్ కుమార్ అందించారు.

# గ్రామాల స్వయం సమృద్ధికి సర్పంచులే కీలకం

- బాపూజీ గ్రామ స్వరాజ్యం కల నెరవేర్చేందుకు కృషి చేయాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా
- 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో సర్పంచులు భాగస్వాములు
- పన్నుల వసూళ్లు, సొంత ఆదాయం పెంచి గ్రామాలను అభివృద్ధి చేయాలి
- నాణ్యమైన విద్య, వైద్యం, పారిశుద్ధ్యంపై దృష్టి



**కరీంనగర్, మార్చి 12 (జనం సాక్షి):**
గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని, విధులు బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి గ్రామాల స్వయం సమృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. గురువారం తిమ్మాపూర్ మండల కేంద్రంలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా సర్పంచులకు 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా 99 రోజుల కార్యాచరణలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.
కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ 2018 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీలకు వచ్చే నిధులు, ఆదాయ-వ్యయాలు, పథకాల అమలు, ఆర్థిక నిర్వహణపై సర్పంచులకు పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు నాణ్యమైన విద్య, వైద్యం అందించాలని, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. పన్నుల వసూళ్లతో పాటు సొంత ఆదాయం పెంచుకుని గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు.
గ్రామ పంచాయతీ సమావేశాలు, గ్రామ సభలు నిర్వహిస్తూ వార్డులను నిత్యం పర్యవేక్షించి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని, బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం అందరూ కలిసికట్టుగా పాటుపడాలని పిలుపునిచ్చారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సర్పంచులు, వార్డు సభ్యుల సహకారంతోనే పేదలకు సక్రమంగా అందుతాయని, గ్రామానికి సర్పంచి సుప్రీమ్ అని ఉద్ఘాటించారు. అధికారులతో సమన్వయం చేసుకుని గ్రామాలను ప్రగతి పథంలో తీర్చిదిద్దాలని, పుట్టిన ప్రాంతానికి సేవ చేసే భాగ్యం అదృష్టమని భావిస్తూ పది తరాలకు గుర్తుండిపోయేలా పనిచేయాలని సూచించారు.
చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక అమలవుతోందని, రైతులకు రెండు లక్షల రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, తెల్ల రేషన్ కార్డుల జారీ వంటి పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. సర్పంచులు బాగా పనిచేస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని, 99 రోజుల కార్యాచరణలో అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యలు పరిష్కరించాలని సూచించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఇది సదా అవకాశమని, నూతన సర్పంచులు సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందినవారి, ఉన్నత స్థానాల్లో ఉన్నవారి సహకారం తీసుకుని గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, డిపిఓ జగదీశ్వర్, డిఎంహెచ్ఓ వెంకటరమణ, డిఆర్డిఓ శ్రీధర్, డీఏవో భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ ఎడ్యుకేషన్‌తో అందరికీ అందుబాటులోకి నాణ్యమైన విద్య

- ఉన్నత విద్య పునర్నిర్మాణంలో డిజిటల్ మార్గాలు కీలకం: బాలకృష్ణా రెడ్డి
- వికసిత్ భారత్ 2047 దిశగా డిజిటల్ బోధనా విధానాలు
- త్వరలో ఉచితంగా 11 ఆన్‌లైన్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు



**సికింద్రాబాద్, మార్చి 12 (జనం సాక్షి):** నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావడంలో డిజిటల్ ఎడ్యుకేషనల్ మీడియా కీలక పాత్ర పోషిస్తుందని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకృష్ణా రెడ్డి అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఎడ్యుకేషనల్ మల్టీమీడియా రీసెర్చ్ సెంటర్ వేదికగా 'ఉన్నత విద్య పునర్నిర్మాణం: వికసిత్ భారత్ 2047 దిశగా డిజిటల్ మార్గాలు' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా మాట్లాడిన బాలకృష్ణా రెడ్డి, విశ్వవిద్యాలయాలు సాంకేతికత ను వేగంగా స్వీకరించాల్సిన అవసరం ఉందని, గ్లోబల్ నాలెడ్జ్ ఎకానమీ అవసరాలకు అనుగుణంగా డిజిటల్ బోధనా విధానాలను అమలు చేయడం కీలకమని పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం, డిజిటల్ ఫ్రేమ్‌వర్క్‌ల అనుసంధానం ద్వారా విద్యా రంగంలో నూతన మార్పులు తీసుకురావాలని సూచించారు. కన్సార్టియం ఫర్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్ ఇప్పటికే 11 పూర్తి స్థాయి ఆన్‌లైన్ డిగ్రీ ప్రోగ్రామ్‌లను సిద్ధం చేసిందని, వాటిని త్వరలో విశ్వవిద్యాలయాల ద్వారా ఉచితంగా అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. విదేశీ విశ్వవిద్యాలయాలు భారతదేశంలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో దేశీయ వర్చువల్ విద్యను బలోపేతం చేయడం ద్వారా మేధో వలసలను తగ్గించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. 'ప్రాంప్ట్ ఇంజనీరింగ్' వంటి ఆధునిక నైపుణ్యాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో కృత్రిమ మేధస్సు (ఏఐ), మూక్స్ (మీూజం), మీడియా ఆధారిత బోధన వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి. కార్యక్రమంలో కన్సార్టియం ఫర్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ డా. పరిక్షిత్ సింగ్ మన్హాస్, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, ఎడ్యుకేషనల్ మల్టీమీడియా రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ పి. రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవి పాఠశాలను సందర్శించిన డీఆర్‌డీఓ పీడీ కళిందిని



**ముత్తారం మార్చి 12(జనంసాక్షి):** ముత్తారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని డీఆర్‌డీఓ పీడీ కలిందిని గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని చదువులు,వసతి సౌకర్యాలపై వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి మెనూ ప్రకారం ఆహారం అందుతున్నదా అనే విషయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్, ప్రిన్సిపాల్ స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడే రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ నిధులు జమ

### మండల వ్యవసాయ అధికారిని రేణుక చక్రవర్తిని



**తలకొండపల్లి మార్చి12(జనంసాక్షి):** రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు మార్చి13,న రైతుల ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వం జమ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారిని రేణుక చక్రవర్తిని తెలిపారు.గురువారం జనంసాక్షి విలేఖరితో మాట్లాడుతూ..ఈ పథకం కింద 22,వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం 5 గంటలకు గౌహతి నుండి విడుదల చేయనున్నారని,దేశవ్యాప్తంగా అర్హత కలిగిన 9.కోట్ల 32 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2 వేల చొప్పున 18 వేల 640 కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.మండలంలోని రైతులందరూ నేడు సాయంత్రం 5 గంటలకు తమ పరిధిలోని రైతు వేదికలలో జరిగే వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి రైతులందరూ విధిగా హాజరు కావలసిందిగా కోరారు.

## ఫుట్‌పాత్ ఆక్రమణలు, అపరిశుభ్రతపై మల్కాజిగిరి కమిషనర్ ఆగ్రహం

**ఉప్పల్, మార్చి 12 (జనం సాక్షి):** మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఉప్పల్ ప్రాంతంలో ఆకస్మిక పర్యటన చేసి స్థానిక పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ముఖ్యంగా ఉప్పల్ రోడ్డు సమీపంలోని ఫుట్‌పాత్‌లు, రోడ్డు మార్జిన్ ప్రాంతాల్లో ఆక్రమణలు, అపరిశుభ్రత నెలకొని ఉండటంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పర్యటన సందర్భంగా కొన్ని హోటళ్ల వద్ద ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురై ఉండటం, రోడ్డు పక్కన బహిరంగ మలమూత్ర విసర్జన జరుగుతున్నట్లు గమనించిన కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నడకకు ఉపయోగపడాల్సిన ఫుట్‌పాత్‌లు ఇలా ఆక్రమణలకు గురవడం సరికాదని, ఇది ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని పేర్కొన్నారు. రోడ్డు మార్జిన్ ప్రాంతాల్లో అపరిశుభ్రత నెలకొనడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ నేపథ్యంలో వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమణల నుంచి పూర్తిగా విముక్తం చేసి, ప్రజల నడకకు అనువుగా తీర్చిదిద్దాలని సూచించారు. బహిరంగ మలమూత్ర విసర్జనను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట తక్షణమే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఫుట్‌పాత్‌లు ప్రజల నడక కోసమే ఉపయోగపడేలా చూడాలని, ఎక్కడైనా ఆక్రమణలు కనిపిస్తే వెంటనే తొలగించాలని కమిషనర్ స్పష్టం చేశారు. నగర పరిశుభ్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలు కూడా చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, పరిశుభ్రతను పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులు, మున్సిపల్ సిబ్బంది కమిషనర్‌తో కలిసి ప్రాంతాన్ని పరిశీలించి సమస్యల పరిష్కారంపై చర్చించారు. అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కమిషనర్ మరోసారి ఆదేశించారు.

# ఫీజు పోరు దీక్షకు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్ధతు

- ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



**ముషీరాబాద్, మార్చి 12 (జనంసాక్షి) :** రాష్ట్రంలో సుమారు రూ. 7,500 కోట్ల ప్రభుత్వం వెంటనే ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయి నిధులను విడుదల చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం ప్రతినిధులు సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ని కలిసి ఈ నెల 15 న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న "ఫీజు పోరు దీక్ష"కు మద్దతు కోరారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల సాధన కై నిర్వహించే ఈ దీక్షకు సీపీఐ(ఎం) పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. నిరుపేద బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల ఉన్నత చదువులకు వెన్నెముకగా ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేయడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రియంబర్స్‌మెంట్ పెండింగ్ వల్ల విద్యార్థులు ఉన్నత విద్యను మధ్యలోనే ఆపేయాల్సి రావడం అత్యంత దురదృష్టకరమన్నారు. కోర్సులు పూర్తి చేసినా బకాయిల సాకుతో విద్యా సంస్థలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు పైచదువులు, ఉద్యోగ అవకాశాలను కోల్పోయి, తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారనీ చెప్పారు. కార్పొరేట్ శక్తులకు మేలు చేసే ప్రభుత్వం, పేద విద్యార్థుల విద్యకు నిధులు కేటాయించకపోవడం శోచనీయమని అన్నారు. సంక్షేమం గూర్చి గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కనీస హక్కు ఫీజుల విషయంలో మొండివైఖరి ప్రదర్శించకుండా బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విద్యార్థుల ఖాతాల్లో నేరుగా జమ చేయాలని కోరారు. విద్యార్థుల సర్టిఫికెట్లు జాన్‌వెస్లీ డిమాండ్ చేసారు.

# కిడ్నీ సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు

- కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ వైద్యుల వెల్లడి
- కిడ్నీ సమస్యలు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన




**కరీంనగర్ బ్యూరో, మార్చి 12 (జనంసాక్షి) :**
కిడ్నీ సమస్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల కిడ్నీ ఫెయిల్యూర్ అయ్యే ప్రమాదం ఉందని మెడికవర్ నెఫ్రాలజిస్టు డాక్టర్ రాంచందర్, యూరాలజిస్టు డాక్టర్ రవిశంకర్ అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం రోజు కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో కిడ్నీ సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ... శరీరానికి తగినంత నీరు తీసుకోకపోవడం వల్ల కిడ్నీలో రాళ్లు తయారవుతాయని, స్టోన్ చిన్న సైజులో ఉంటే ఎక్కువగా నీరు తీసుకోవడం వల్ల స్టోన్ పడిపోయే అవకాశం ఉందన్నారు. కిడ్నీలో రాళ్లు తయారై రెండు మూడు వారాలకంటే ఎక్కువ సమయం ఉండడం, నొప్పిని తట్టుకునేందుకు పెయిన్ కిల్లర్స్ వాడడం, బీపీ, షుగర్ కంట్రోల్‌లో లేకపోవడం, వంశపారంపర్యం వంటి కారణాలతో కిడ్నీ ఫెయిల్యూర్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. నిర్లక్ష్యం చేయకుండా సర్జరీతో స్టోన్ తొలగించుకోవాలన్నారు. కిడ్నీ అంటే ఓన్లీ యూరిన్ పాస్ చేసేది మాత్రమే అనుకోవడం పొరపాటని, కిడ్నీ బీపీ కంట్రోల్ చేసేందుకు, రక్తం తయారు చేసేందుకు సహకరిస్తుందన్నారు. చిన్న వయస్సులో బీపీ వచ్చిందంటే అది కిడ్నీ పనితీరు సరిగా లేకపోవడమే కారణంగా చెప్పవచ్చన్నారు. కిడ్నీ సమస్యలు ఉన్న వారు ప్రారంభదశలోనే చికిత్స తీసుకుంటే నయం అవుతుందన్నారు. చాలా మంది కిడ్నీ డ్యామేజ్ స్టేజీలో వైద్యం కోసం వస్తున్నారని, అలాంటి వారిలో 50 శాతం మందికి డయాలసిస్ అవసరమవుతుందన్నారు. డయాలసిస్‌కు భయపడాల్సిన పనిలేదని, 10 సంవత్సరాల వరకు కిడ్నీని కాపాడవచ్చన్నారు. కిడ్నీ పూర్తిగా చెడిపోతే ట్రాన్స్‌ప్లాంటేషన్ ఒక్కటే మార్గమని, ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో 20-25 సంవత్సరాల వరకు ఇబ్బంది ఉండదన్నారు. రెడ్ మీట్ తక్కువగా తినడం, ధూమపానం, మద్యపానం మానేసి, తగినంత నీరుతాగడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే కిడ్నీ సమస్యలు దరిచేరవని తెలిపారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో క్రిటికల్ కేర్ నిపుణులు డాక్టర్ పల్లవి, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, ఆపరేషన్స్ మేనేజర్ సాయిచరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, దాసరి చంద్రశేఖర్, హరీష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్ యజమాని ప్రభుత్వానికి రూ.4.49 కోట్ల గండి

- అక్రమంగా అమ్మేసిన ధాన్యం.. 17,406 క్వింటాల ధాన్యం లోటు
- సీఎంఆర్ ఒప్పందం దుర్వినియోగం
- పెద్దపల్లి పోలీసులు కేసు నమోదు.. కోర్టు హాజరు



**పెద్దపల్లి,మార్చి 12(జనంసాక్షి) :** ఖరీఫ్ సీజన్‌కు గాను కస్టమ్ మిల్డ్ రైస్ (సిఎంఆర్) అందించుటకు టిజిఎస్‌సిఎస్‌సిఎల్ వారితో ధాన్యం నిల్వలకు సంబంధించిన ఒప్పందం చేసుకొని ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నా టువంటి కొమురవెల్లి రాజేందర్, సుభాష్ నగర్, పెద్దపల్లి అను వ్యక్తికి చెందినా "శ్రీ విజయశ్రీ" పేరుతో ఉన్న రైస్ మిల్ నందు గురువారం రోజు నాయబ్ తహసీల్దార్ (సివిల్ సప్లైస్) పెద్దపల్లి జి. రవీందర్ ఎం. మహేష్ కుమార్ మరియు టెక్నికల్ అసిస్టెంట్, బి. లక్ష్మీనారాయణన అధికారులు ఆకస్మిక తనిఖీ చెయ్యగా 17,406.86 క్వింటాళ్ల ధాన్యం లేకపోవడం(ధాన్యం లోటు)గుర్తించారు. ఆ ధాన్యం విలువ ప్రతి క్వింటాల్‌కు రూ. 2,585.03 చొప్పున మొత్తం రూ. 4,49, 45,043/ గా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు బియ్యం రూపంలో తిరిగి ప్రభుత్వానికి ఇవ్వవలసి ఉంటుంది. కాని రికార్డులు ఎవరూ చెక్ చేయరని భావించి అక్రమంగా ఎక్కువ డబ్బు సంపాదించుటకు ఇదే మంచి అవకాశం అనుకొని కొంత ధాన్యాన్ని అమ్మి వచ్చిన డబ్బులను వారి వ్యక్తిగత ఖర్చులకు వినియోగించుకున్నట్లు తెలిపారు .ఈ విధంగా ప్రభుత్వాన్ని మోసం చేసి లబ్ది పొందిన రైస్ మిల్లర్ కొమురవెల్లి రాజేందర్ పై అధికారులు ఇచ్చిన పిర్యదుతో పెద్దపల్లి పోలీస్ వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి అనంతరం కోర్ట్ నందు హాజరు పరిచారు.





# అనుమతులు లేని "అనుముల" ఫంక్షన్ హాల్

- ప్రభుత్వ అధికారులను బురిడీ కొట్టించి నిర్మాణం
- హైటెన్షన్ విద్యుత్ లైన్ కింద కట్టడమేలా..?
- స్థానిక మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో ప్రారంభోత్సవం
- నిబంధనలు పాటించని ఫంక్షన్ హాల్ యజమాని



**ఖమ్మం రూరల్, మార్చి 12 (జనంసాక్షి) :**
ఏదులపురం మున్సిపాలిటీ పరిధిలోని ముత్తగూడెం గ్రామంలో ఇటీవల కాలంలో ఓ ఫంక్షన్ హాలుని పట్టణాలకు దీటుగా కార్పొరేట్ స్థాయిలో నిర్మాణం చేపట్టారు. ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేకుండా మున్సిపల్ అధికారులను బురిడీ కొట్టించారు. ఇది చాలదన్నట్లుగా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 8 న అట్టహాసంగా ప్రారంభోత్సవం చేయడం గమనార్హం.
ఫంక్షన్ హాల్ నిర్మాణానికి మున్సిపల్ నుండి బిల్డింగ్ ప్లాన్ ఆమోదం భూమి హక్కు పత్రాలు అగ్నిమాపక శాఖ (ఎన్‌ఓసీ) నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ అనుమతి పత్రాల ద్వారా మున్సిపాలిటీ కార్యాలయంలో ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. భూమి పత్రాలు,దస్తావేజు (సేల్ డీడ్), భూ వినియోగ మార్పు (కన్వర్షన్ సర్టిఫికెట్) వ్యవసాయేతర భూమిగా మార్చడం, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ వంటి ధృవపత్రాలు సమర్పించాలి. ఫంక్షన్ హాల్స్ సహా ఆసుపత్రులు పెద్ద పెద్ద భవనాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. కానీ, వివాహ శుభ కార్యాలయాలకు వందల సంఖ్యలో బంధుమిత్రులు హాజరయ్యే పరిస్థితులున్నచోట అనుమతులే లేకుండా, ప్రమాదకర స్థితిలో ఫంక్షన్ హాల్ నిర్మించడం గమనార్హం. హైటెన్షన్ విద్యుత్ వైర్ల కింద ప్రమాదం సంభవిస్తే ఈ ప్రమాదానికి ఎవరూ బాధ్యత వహిస్తారు?

**అనుమతులు పట్టని యంత్రాంగం**

మూడు డిపార్టుమెంట్ల అనుమతులు లేకుండానే దర్జాగా ఫంక్షన్ హాల్ కడుతున్నప్పుడు, చిన్నపాటి ఇల్లు కట్టుకుంటే అనుమతి రోడ్డు సేడ్ బ్యాక్ అంటూ అధికారులు సవాలక్ష నిబంధనలు పెడతారు. ఏకంగా మెయిన్ రోడ్డు పక్కనే పెద్ద ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నా.. అధికారులు ఆవైపు కన్నెత్తి చూడకపోవడం విస్మయానికి గురిచేస్తుంది. నాడు మంత్రి చేత ప్రారంభోత్సవం చేపట్టిన రోజే పలు శాఖలకు సంబంధించిన అధికారులు అందరూ హాజరై పాల్గొన్న ఈ ఫంక్షన్ హాల్ నిర్మాణ అనుమతులపై నేటివరకు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇకనైనా సంబంధిత అధికారులు ఫంక్షన్ హాలుపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

**అనుమతుల్లేని విషయం నిజమే :**
**మున్వర్ అలీ, ఎదులాపురం మున్సిపల్ కమిషనర్**

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే నోటిసు ఇచ్చి చర్యలు తప్పవు. నిబంధనలను పాటించకుండా ఇష్టారీతిన నిర్మాణాలు చేపడితే చట్టపరమైనా చర్యలు తీసుకుంటాం. ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ఏదులాపురం మున్సిపాలిటీ కార్యాలయం నుంచి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తెలిసింది.

**విద్యుత్ మీటర్‌కు అనుమతివ్వలేదు :**
**వినీల, ఏఇ విద్యుత్ శాఖ ఆరేంపుల**

నూతనంగా నిర్మించిన ఫంక్షన్ హాలుకు విద్యుత్ మీటర్ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. గతంలో ఉన్న విద్యుత్ మీటర్ నే వాడుతున్నారు. మున్సిపాలిటీ అనుమతి ఉంటేనే మీటర్ ఇస్తాం.





# తెలంగాణలో నీటిపారుదల ప్రాజెక్టులకు వేగం

- భూసేకరణ పెండింగ్‌లు త్వరగా పూర్తి చేయాలి
- వనపర్తి, గద్వాల జిల్లాల్లో ఆకస్మిక సమీక్ష
- భూసేకరణ పూర్తయితేనే పనులు వేగవంతం
- పలు ప్రాజెక్టుల్లో ఎకరాల సర్వే, మార్కింగ్‌కు గడువు
- రైతులకు సాగునీరు అందేలా చర్యలు

**వనపర్తి బ్యూరో మార్చ్ 12 జనం సాక్షి :**
తెలంగాణలోని నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలంటే భూసేకరణ, పునరావాసం వంటి పెండింగ్ అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ఆర్ అండ్ ఆర్ కమిషనర్ కే. శివకుమార్ నాయుడు సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భూసేకరణ పూర్తయితేనే ప్రాజెక్టుల పనులు వేగంగా సాగుతాయని, ఆయకట్టుకు సాగునీరు అందుతుందని ఆయన స్పష్టం చేశారు. గురువారం వనపర్తి జిల్లాలో ఆకస్మికంగా పర్యటించిన కమిషనర్ శివకుమార్ నాయుడు, ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న పలు ప్రాజెక్టుల్లో భూసేకరణ పెండింగ్‌లు, పునరావాస పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు.
గణపసముద్రం ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న 197 ఎకరాల భూసేకరణకు వెంటనే ఎంజాయ్మెంట్ సర్వే పూర్తి చేసి ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశించారు. కర్నె తాండ లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి 26 ఎకరాల భూసేకరణకు పెగ్ మార్కింగ్ ఈ నెల 14వ తేదీలోపు పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద డి-1, డి-5, డి-8, ప్యాకేజ్-29కు సంబంధించి 92 ఎకరాల భూసేకరణకు పెగ్ మార్కింగ్ ఒక వారంలోపు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఘనపూర్ బ్రాంచ్ కెనాల్‌కు సంబంధించి మార్కింగ్ పూర్తయిన 31 ఎకరాల భూమికి సర్వే శాఖ అధికారులు వెంటనే ఎంజాయ్మెంట్ సర్వే పూర్తి చేయాలని చెప్పారు. అంతకుముందు కొత్తకోట మండలంలోని కానాయిపల్లి ఆర్ అండ్ ఆర్ సెంటర్, శంకర సముద్రంను సందర్శించిన ఆయన, అక్కడి పెండింగ్ అంశాలను త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ నాగేందర్, ఎస్ఈ చంద్రశేఖర్, ఈఈ కేశవరావు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, సర్వే ఏడి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.
ఇదే విధంగా జోగులాంబ గద్వాల జిల్లాలోనూ కమిషనర్ శివకుమార్ నాయుడు సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌తో కలిసి కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో చర్చించారు. జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల ప్రాజెక్టు పరిధిలో 541 ఎకరాల భూసేకరణ నోటిఫికేషన్, సర్వే స్థాయిలో ఉందని, ప్రక్రియ పూర్తి చేస్తే నిర్వాసితులకు త్వరగా పరిహారం చెల్లిస్తామని తెలిపారు. నల్ల సోమనాద్రి గట్టు ఎత్తిపోతల ప్రాజెక్టుకు రిజర్వాయర్‌కు 212 ఎకరాలు, కుడి-ఎడమ కాలువలకు 249 ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉందన్నారు. ఆర్డీఎస్ పరిధిలో మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి 567 ఎకరాల భూమి సేకరించాల్సి ఉందని, రైతులతో గ్రామ సభలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు, పిజెపి సిఈ నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం కార్పొరేషన్‌లో భారీ అవినీతి

- యూజీడీల నిర్మాణంపై విచారణ డిమాండ్
- 13.70 కోట్ల ట్రాన్స్‌ఫర్ డ్యూటీ ఫండ్స్‌పై సీరియస్ ఆరోపణలు
- కాంట్రాక్టర్ల సిండికేట్‌తో అధికారుల కుమ్మక్క
- విచారణ పూర్తి వరకు బిల్లులు ఆపాలని సిపిఐ కార్పొరేటర్ విజ్ఞప్తి



**గోదావరిఖని, మార్చి 12 (జనం సాక్షి):**
రామగుండం కార్పొరేషన్ పరిధిలో ట్రాన్స్‌ఫర్ డ్యూటీ ఫండ్స్‌కు సంబంధించిన 13 కోట్ల 70 లక్షల రూపాయలను అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనులకు ఏడు ప్యాకేజీలుగా టెండర్లు పిలిచి భారీ అవినీతికి పాల్పడ్డారని సిపిఐ 41వ డివిజన్ కార్పొరేటర్ మార్కపురి సూర్య ఆరోపించారు. విచారణ పూర్తయ్యేంతవరకు ఆ బిల్లులు చెల్లించకుండా ఆపేయాలని, అవినీతికి కారణమైన అధికారులు, కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీని కోరుతూ వినతి పత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా మార్కపురి సూర్య మాట్లాడుతూ "ట్రాన్స్‌ఫర్ డ్యూటీ ఫండ్స్‌ను కార్మికుల జీతభత్యాలు, మున్సిపల్ ఎమర్జెన్సీ పనులకు మాత్రమే వాడాల్సి ఉన్నప్పటికీ, కమిషన్ల ఆశతో ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ఆ డబ్బును యూజీడీ పనులకు మళ్లించారు. కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారి 0.5 నుంచి 1.5 శాతం తక్కువ రేట్లతో టెండర్లు దక్కించుకున్నారు. వర్క్ ఆర్డర్‌లో ఆర్‌సీసీ పైపులు, నాణ్యమైన చాంబర్లు వాడాలని స్పష్టంగా ఉన్నా, కాంట్రాక్టర్లు మట్టి పైపులు వాడి నాసిరకంగా పనులు చేశారు. ఇందువల్ల కార్పొరేషన్‌కు, ప్రభుత్వ ఆదాయానికి తీవ్ర నష్టం వాటిల్లింది" అని వివరించారు. ఈ అవినీతి కుట్రపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి, క్వాలిటీ కంట్రోల్ విభాగంతో పనుల నాణ్యతను పరీక్షించాలని, విజిలెన్స్ దృష్టిని సాధించాలని సూర్య డిమాండ్ చేశారు. విచారణ పూర్తయ్యేంతవరకు బిల్లులు చెల్లించకుండా ఉండాలని, లేకపోతే శాఖాపరమైన, న్యాయపరమైన చర్యలకు సిద్ధంగా ఉంటామని హెచ్చరించారు.

# మున్సిపల్ చట్టాలు, పథకాలపై అవగాహన కల్పన

- కరీంనగర్ అభివృద్ధిలో కార్పొరేటర్ల పాత్ర కీలకం
- వార్డు స్థాయిలో సమస్యల పరిష్కారానికి ప్రణాళిక : కలెక్టర్ చిత్రా మిశ్రా
- నిత్యం శానిటేషన్, ప్రజావాణి పర్యవేక్షణ తప్పనిసరి
- 99 రోజుల ప్రగతి ప్రణాళికలో పెండింగ్‌లు క్లియర్ చేయాలి



**కరీంనగర్, మార్చి 12 (జనం సాక్షి):** నగరాలు, పట్టణాల అభివృద్ధిలో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పాత్ర కీలకమని, అందరూ కలిసికట్టుగా జిల్లాను అభివృద్ధిలో ముందు వరుసలో నిలిపేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా నూతనంగా ఎన్నికైన మున్సిపల్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు కలెక్టరేట్ ఆడిటోరియంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.
ఈ శిక్షణలో ప్రభుత్వ పథకాలు, సేవా కార్యక్రమాలు, మున్సిపల్ చట్టాలు, విభాగాల విధులు, బాధ్యతలపై పిపిటి ద్వారా వివరణ ఇచ్చారు. కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ "కార్పొరేటర్లు, వార్డు సభ్యుల బాధ్యతాయుత పనితీరుతోనే పట్టణాలు అభివృద్ధి చెందుతాయి. విభాగాల సిబ్బందితో సమన్వయం చేసుకుని వార్డు స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి. కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ పౌర సేవలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అవినీతి రహిత పాలనతో ఆదర్శంగా నిలవాలని, మున్సిపల్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ప్రతి కార్పొరేటర్ తమ డివిజన్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పనులు పర్యవేక్షించాలని, వేసవి దృష్ట్యా తాగునీరు వృధా కాకుండా అవగాహన కల్పించాలని, పైపు లైన్ మరమ్మతులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్పొరేటర్ తమ డివిజన్లో పర్యటించి సమస్యలు గుర్తించి, అధికారులతో చర్చించి పరిష్కరిం చాలని, పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయడం మంచి విషయమని తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని ప్రజలకు మరింత సేవ అందించాలని కోరారు.
డిప్యూటీ మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ 66 స్థానాలకు గాను 46 మంది కొత్త కార్పొరేటర్లు ఎన్నికయ్యారని, ఈ శిక్షణ వారికి ఉపయోగకరమని, డివిజన్లలో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలని, మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని, మున్సిపల్ డాష్‌బోర్డ్‌లో అర్జీల స్థితి తెలుసుకుని జవాబుదారీతనం పెంచాలని సూచించారు.
కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ మున్సిపల్ చట్టాలు, వ్యవస్థ, విభాగాల పనితీరుపై అవగాహన చాలా ముఖ్యమని, ఇది ప్రజలకు మరింత చేరువై సేవ చేసే అవకాశం ఇస్తుందని తెలిపారు. జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన శిక్షణలో స్పష్టమైన వివరణ ఇస్తున్నామని, నూతన కార్పొరేటర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమేష్, హుజురాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ రొంటాల సుహాసిని, వైస్ చైర్పర్సన్ గూడూరి అంజలి, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ మహమ్మద్, చొప్పదండి మున్సిపల్ చైర్పర్సన్ వడ్లూరి సరిత, వైస్ చైర్పర్సన్ పెరుమాండ్ల మానస, మున్సిపల్ కమిషనర్లు సయ్యద్ ముసాబ్ అహ్మద్, మనోహర్, మహమ్మద్ ఆయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు పటేల్ సంఘం మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పురెళ్ల సరోజకు పదవి బాధ్యత

### నియామక పత్రం అందజేసిన రాష్ట్ర అధ్యక్షుడు డా. కొండ దేవయ్య పటేల్



**కరీంనగర్ టౌన్, మార్చి 12 (జనం సాక్షి):**
తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు పటేల్ సంఘం మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా కరీంనగర్ జిల్లా మంకమ్మతోట నివాసి పురెళ్ల సరోజను నియమించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. కొండ దేవయ్య పటేల్ ఆమెకు నియామక పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ పదవీకాలం మూడు సంవత్సరాలు కొనసాగుతుందని తెలిపారు.
ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పురెళ్ల సరోజ భర్త పురెళ్ల మధు, పటేల్ మహిళా సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు ఆకుల లలిత, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు తడెం రంజిత కృష్ణ మూర్తి, సంఘం నాయకులు, మహిళా సభ్యురాళ్లు, శ్రేయోభిలాషులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రజాసేవ పట్ల అంకితభావం, కష్టపడే స్వభావం, దయగల మనస్తత్వంతో రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు మార్గదర్శకత్వం అందిస్తున్నారని ఆమెను ప్రశంసించారు.
పురెళ్ల సరోజ మాట్లాడుతూ తన పదవిలో సమాజ సేవలో మరింత ముందుకు సాగుతానని, రాష్ట్రంలో పేదరికంలో ఉన్న మున్నూరు కాపు మహిళలను, ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకునేందుకు 33 జిల్లాల్లో మహిళా సంఘాలు ఏర్పాటు చేస్తానని తెలిపారు. రాబోయే రోజుల్లో 33 శాతం రిజర్వేషన్లలో మున్నూరు కాపు మహిళలు రాజకీయాల్లో పోటీ చేసే విధంగా కృషి చేస్తానని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## 100 డయల్ దుర్వినియోగం చేసిన వ్యక్తిపై కేసు నమోదు రిమాండ్‌కు తరలింపు

**గంభీరావుపేట మార్చి 12 (జనం సాక్షి):**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మల గ్రామానికి చెందిన రాజబోయిన కృష్ణ కాంత్ తండ్రి బాలయ్య అను వ్యక్తి అర్ధరాత్రి సమయంలో అనవసరంగా 100 డయల్‌కి పలుమార్లు ఫోన్ చేసి గొడవ జరగపోయినా జరిగినట్లు ఫోన్ చేస్తూ, 100 డయల్ చేసి సమయాన్ని దుర్వినియోగం చెయ్యగా. రాజబోయిన కృష్ణకాంత్ ఇంటికి వెళ్లగా బ్లూకోట్ సిబ్బందితో దురుసుగా మాట్లాడి విధులకు ఆటంకపరచినాడు. కేసు నమోదు చేసి రిమాం డుకు తరలించినట్టు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు

## మాదకద్రవ్యాల దుర్వినియోగం నివారణపై జిల్లా స్థాయి వర్క్ షాప్

### - ముఖ్యఅతిథిగా హాజరైన ఏసిపి జి కృష్ణ




**పెద్దపల్లి,మార్చి 12(జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లాలోని సమీకృత కలెక్టరేట్ సమావే శ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల జిల్లా స్థాయి వర్క్ షాప్ నిర్వహించిన విద్యాశాఖ. ప్రహరీ క్లబ్స్ తరఫున మాదకద్ర వ్యాల దుర్వినియోగ నివారణపై. కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య ఉద్దేశం సమాజంలో డ్రగ్స్, గంజాయి లాంటి మాదకద్రవ్యాల వ్యాప్తిని ఎలా అరికట్టాలి వాటి నుండి ఎలా రక్షించుకోవాలి స్కూళ్లలో పిల్లల యొక్క మరియు టీచర్ల యొక్క బాధ్యతలను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిల్లలకు వీడియోల ద్వారా గంజాయి యొక్క ప్రభావం ఎలా ఉంటుందో వివరించడం జరిగింది. చివరిగా విద్యార్థులు కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయుల చేత మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞను చేయడం జరిగింది. ఇందులో మొత్తం 20 పాఠశాలలు అందులో ఒక్కోక్క పాఠశాల నుండి ఒక టీచర్ మరియు ఇద్దరు స్టూడెంట్స్ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా జి కవిత (జిసిడిఓ), మల్లేశం గౌడ్ ప్లానింగ్ కోఆర్డినేటర్, టి.సంపత్ కుమార్, టిజిటి ఇంగ్లీష్,తెలంగాణ మోడల్ స్కూల్ ఓదెల పాల్గొన్నారు .ప్రోగ్రాం ముఖ్యఅతిథిగా పెద్దపల్లి ఏసిపి జి కృష్ణ, ఎం.రాజు కుమార్,ఆంటీ నార్కోటిక్ డ్రగ్ సిఐ,ఈగల్ టీం పోలీస్,పి సురేందర్ కుమార్ ఎంఈఓ పెద్దపల్లి, హరి ప్రసాద్ ఎంఈఓ ముత్తారం,సిహెచ్ అగయ్య ప్రధానోపాధ్యాయులు రాగినేడు,వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మైనార్టీ యూత్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

### బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష



**పెద్దపల్లి,మార్చి 12(జనంసాక్షి) :** పెద్దపల్లి పట్టణంలోని ఎంబీ గార్డెన్ వేదికగా బుధవారం సాయంత్రం మైనార్టీ యూత్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ శ్రీమతి దాసరి ఉష ముఖ్య అతిథిగా హాజరై,ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.సాయంత్రం వేళ ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలను విరమించగా,వారికి ఆమె స్వయంగా పండ్లను, పానీయాలను వడ్డించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో దాసరి ఉష ప్రసంగిస్తూ పవిత్ర రంజాన్ మాసం కేవలం ఉపవాస దీక్షలకే పరిమితం కాదని,ఇది మానవత్వానికి, క్రమశిక్షణకు మరియు తోటివారికి సహాయం చేసే దానగుణానికి ప్రతీక అని కొనియాడారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి పండుగలు జరుపుకోవడం మన భారతీయ సంస్కృతిలోని గొప్పతనమని,ఈ ఇఫ్తార్ విందు గంగా-జమునా తెహజీబ్ ను ప్రతిబింబిస్తోందని ఆమె పేర్కొన్నారు. మైనార్టీ యువత సమాజ సేవలో ముందుండాలని,ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఐక్యతను చాటడం అభినందనీయమని ఆమె యువతను ఉత్సాహపరిచారు. ముస్లిం సోదరులందరికీ రంజాన్ ముందస్తు శుభాకాంక్షలు తెలియ జేస్తూ, అల్లాహ్ ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ యూత్ ప్రతినిధులు ఎండి మొహిద్,సయ్యద్ మసీద్ మాలిక్,బీసీ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి శంకర్,బీసీ జేఏసీ ఇంటలెక్చువల్ ఫోరం ప్రతినిధి అలువాల రాజేందర్,బీసీ జేఏసీ యాదవ సంఘం జిల్లా కన్వీనర్ సలేంద్ర కొమురయ్య,సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం,బొల్లం భూమేష్,కూకట్ల నవీన్ కుమార్,శ్రావణ్,భూమయ్య,వివిధ సంఘాల నాయకులు, పట్టణ ప్రముఖులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.




## మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజ్‌పై వెంటనే చర్య

- జనం సాక్షి కథనంపై అధికారుల స్పందన.. మరమ్మతులు పూర్తి
- గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు

**పిట్లం, మార్చి 12 (జనం సాక్షి):**
మంగళవారం జనంసాక్షి పత్రికలో ప్రచురితమై న "మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజ్" వార్తపై అధికారులు తక్షణమే స్పందించారు. గురువా రం సంబంధిత అధికారులు, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని లీకేజ్ ఉన్న పైప్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహించారు. కొన్ని రోజులుగా లీకేజ్ కారణంగా వృథాగా పోతున్న నీటిని పూర్తి గా అరికట్టడంతో పాటు, స్థానికులకు కలుగుతు న్న ఇబ్బందులను తొలగించారు. పత్రికలో సమస్యను ప్రస్తావించడంతో అధికారులు వెంట నే చర్యలు తీసుకోవడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంలో గ్రామ స్థులు మాట్లాడుతూ "జనం సాక్షి పత్రిక ద్వారా సమస్య బయటపడ్డాకే అధికారులు త్వరగా స్పందించి మరమ్మతులు చేశారు. ఇలాంటి సమస్యలు ఉన్నప్పుడు పత్రికలో ప్రచురితం అవడం వల్లే త్వరిత చర్యలు జరుగుతున్నాయి" అని సంతోషం వ్యక్తం చేశారు.

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో స్థానిక సంస్థలు కీలకం

- సర్పంచులు, చైర్మన్లు, వార్డు సభ్యులు భాగస్వామ్యం కావాలి: కలెక్టర్ గరిమ అగర్వాల్
- 99 రోజుల ప్రణాళిక అమలులో గ్రామ-మండల-జిల్లా స్థాయి కార్యక్రమాలు
- ఏప్రిల్ 2న గ్రామ సభలు.. జూన్ 2న రాష్ట్ర వేడుకలు
- ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రుణమాఫీ వేగం పెంచాలి
- రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరి: ఎస్పీ



**తంగళ్ళపల్లి, మార్చి 12 (జనం సాక్షి):**
ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పూర్తి భాగస్వామ్యం కావాలని కలెక్టర్ గరిమ అగర్వాల్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం తంగళ్ళపల్లి మండలంలోని బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ మహేష్ బి. గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి కలెక్టర్ గరిమ అగర్వాల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక ఐదు దశల్లో అమలవుతుంది. ఏప్రిల్ 2న గ్రామ సభలు, ఏప్రిల్ 16న మండల స్థాయి, మే 2న నియోజకవర్గ స్థాయి, మే 22న జిల్లా స్థాయి, జూన్ 2న రాష్ట్ర స్థాయి వేడుకలు నిర్వహిస్తాం" అని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 3న ప్రకటించిన ఈ 99 రోజుల కార్యాచరణను ఉమ్మడి కరీంనగర్‌లో ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర మంత్రుల సమక్షంలో 6న సమీక్షించామని తెలిపారు.
జిల్లాలో ఇప్పటివరకు ఇందిరమ్మ ఇళ్లు 573 పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని, 3.91 లక్షల సిలిండర్లు 500 కే సరఫరా చేశామని, 46,492 రైతులకు రూ.370.75 కోట్ల రుణమాఫీ, లక్ష 26వేల రైతులకు రైతు భరోసా అందించామని, 22,554 కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని కలెక్టర్ వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గృహజ్యోతి, ఉచిత బస్సు ప్రయాణం వంటివి లబ్ధిదారులకు అందాలంటే స్థానిక సంస్థలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.
ప్రతి గ్రామం, మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, రోడ్లు, మురుగు కాలువలు శుభ్రం చేయించాలని, ఇంటి పన్ను, ఇతర పన్నులు వసూలు చేయాలని, చెత్తను తడి-పొడి వేరు చేసి సెగ్రిగేషన్ షెడ్లు పూర్తి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సంఘాల భవనాల నిర్మాణం జూన్ 2లోగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. విద్యాలయాలు, హాస్టళ్లలో పారిశుద్ధ్యం, నాణ్యమైన భోజనం, అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం లోపం ఉన్న పిల్లలను గుర్తించి సహాయం అందించాలని, రైతులు ఏకపంట సాగు మాని వాణిజ్య పంటలు, పంట వైవిధ్యం పెంచాలని తెలిపారు. ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ గత ఏడాది రోడ్డు ప్రమాదాల్లో 7వేల మంది ప్రాణాలు కోల్పోయామని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే ఇది జరుగుతోందని హెచ్చరించారు. వాహనం ఎక్కినప్పటి నుంచి దిగే వరకు సెల్‌ఫోన్ వాడకూడదని, కార్లలో సీట్‌బెల్ట్, సైకిల్ వాడే పిల్లలు హెల్మెట్ తప్పనిసరి చేయాలని సూచించారు. ప్రమాద క్షతగాత్రులను ఒక గంటలోపు ఆసుపత్రికి తీసుకెళ్తే రూ.25 వేలు, రూ.1.50 లక్షల వైద్య సహాయం అందుతుందని తెలిపారు.
మార్చి 6 నుంచి 15 వరకు పారిశుద్ధ్యం, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, ఏప్రిల్ 6-11 మధ్య వైద్య, మహిళా శాఖలు, ఏప్రిల్ 13-18 హోం-రవాణా శాఖలు, ఏప్రిల్ 20-26 ఎస్సీ-ఎస్టీ-బీసీ-హౌసింగ్ శాఖలు, ఏప్రిల్ 27-మే 2 వైద్య-మహిళా శాఖలు, మే 4-10 వ్యవసాయ-రెవెన్యూ-నీటిపారుదల శాఖలు, మే 11-16 విద్యా శాఖ, మే 18-23 యువజన-క్రీడా శాఖలు, మే 25-30 మహిళా-సెర్ప్ శాఖలు, జూన్ 1-12 అటవీ-విజ్ఞాన శాఖలు కార్యక్రమాలు నిర్వహిస్తాయని ఎస్పీ వివరించారు.
ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ గీత, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, రవాణా అధికారి లక్ష్మణ్, జిల్లా వైద్య అధికారి రజిత, మున్సిపల్ చైర్మన్లు రాజు, కళ, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, పంచాయతీ అధికారి షరీఫుద్దీన్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



## నేరెళ్ల పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారికి ప్రభుత్వ వైద్య సేవలపై వివరించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. తంగళ్లపల్లి మండలం నేరెళ్ల పీహెచ్ సీని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, రక్త పరీక్షలు చేసే ల్యాబ్, మందుల గది, ఇతర గదులు, ఆవరణ పరిశీలించారు. వ్యాక్సిన్లు, మందుల నిలువపై ఆరా తీశారు. రోజు ఆసుపత్రికి ఎందరు రోగులు వస్తున్నారని, గర్భిణులు వైద్య సేవలు పొందుతున్నారని ఆరా తీశారు. రోగులతో మాట్లాడారు. ప్రభుత్వ వైద్య సేవలపై అందరికీ అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై వివరించాలని తెలిపారు. గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఎండాకాలం నేపథ్యంలో ప్రజలకు జాగ్రత్తలు తెలుపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఇఫ్తార్ పార్టీలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

**హయత్ నగర్, మార్చి 12 (జనం సాక్షి) :**
వనస్థలిపురం డివిజన్ పరిధిలోని గురుద్వార్ ప్రధాన రోడ్డు వద్ద ముదబ్బీర్ అలీఖాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రాండ్ ఇఫ్తార్ పార్టీలో ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మతాలకు అతీతంగా పండుగలను సామరస్యంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, వనస్థలిపురం డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్, మధు గౌడ్, నవీద్, సంజయ్, కిషోర్ కుమార్, ముస్లిం పెద్దలు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రీశుడిని దర్శించుకున్న గవర్నర్

- గవర్నర్ శుక్లా దంపతులకు ఘన స్వాగతం
- దర్శనం చేయించి, వేదాశీర్వచనం ఇచ్చిన పండితులు



**యాదాద్రి, మార్చి12 (జనంసాక్షి)** : యాదగిరిగుట్టలో కొలువైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని తెలంగాణ నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దర్శించుకున్నారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనం కోసం గురువారం ఉదయం యాదగిరిగుట్టకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతోపాటు ఆయన కుటుంబ సభ్యులు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వామి అమ్మవార్లకు గవర్నర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతోపాటు ఆయన కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆ తర్వాత వారికి ఆలయ ఈవో భవానీ శంకర్ స్వామివారి జ్ఞాపికతోపాటు ప్రసాదాన్ని అందజేశారు. గవర్నర్ రాక సందర్భంగా యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. తెలంగాణ నూతన గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్ లోక్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్‌గా ప్రతాప్ శుక్లా చేత తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం చేయించిన సంగతి తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులతోపాటు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పాలమూరు జిల్లాలో విషాద ఘటన

- కుటుంబ కలహాలతో తల్లీకూతుళ్ల ఆత్మహత్య

**మహబూబ్ నగర్, మార్చి 12 (జనంసాక్షి)** : మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లోని వెల్కిచర్ల గ్రామంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. తల్లి, ఇద్దరు కూతుళ్లు ఆత్మహత్య చేసుకున్నారు. గత కొంత కాలంగా కుటుంబంలో చిన్న చిన్న గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. తీవ్ర మనస్థాపానికి చెందిన జంగమ్మ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే గురువారం ఉదయం జంగమ్మ(42) తన ఇద్దరు కూతుళ్లు, కుమారుడితో కలిసి దగ్గరలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది.మొదట ఇద్దరు కూతుళ్లు జ్యోతి(15), శైలజ(13) బావిలో తోసింది. ఆ తర్వాత జంగమ్మ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అయితే, ఆమె కుమారుడు భయంతో అక్కడ నుంచి తప్పించుకొని ప్రాణాలు దక్కించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు మృతదేహాలను బావి నుంచి మృతదేహాలను వెలికి తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

# ఇంధన కొరత, ధరలపై కేంద్రం అప్రమత్తం

- ఫ్యూయల్ సప్లై మేనేజ్‌మెంట్ చైన్ ప్రోగ్రామ్ అమలు



**న్యూఢిల్లీ, మార్చి12 (జనంసాక్షి)** : మధ్యప్రాచ్యంలో యుద్ధం ఎఫెక్ట్ ప్రపంచమంతా కనిపిస్తోంది. భారత్‌పై మిడిల్ ఈస్ట్ యుద్ధ ప్రభావం పడింది. ఇప్పటికే భారత్‌లోని ప్రధాన నగరాల్లో ఎల్పీజీ సంక్షోభం పెరిగిపోయింది. ఇక పెట్రోల్, డీజిల్ ధరలపై సామాన్యులు భయపడు తున్నారు. ఈ ధరలు రానున్న కొన్ని రోజుల్లో విపరీతంగా పెరుగుతాయనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తాజాగా స్పందించింది. పెట్రోల్, డీజిల్ ధరలపై క్లారిటీ ఇచ్చింది. ఈ ధరపై ప్రస్తుతం ప్రభావం ఉండబోదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. దేశీయంగా చమురు ధరలను స్థిరంగా ఉంచేందుకు ఇప్పటికే ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకున్నట్లు చెబుతున్నారు. ఇధనం ఇంధన సరఫరాలోనూ ఎలాంటి ఆటంకాలు కలగకుండా 'ఫ్యూయల్ సప్లై మేనేజ్‌మెంట్ చైన్' ప్రోగ్రామ్‌ను ప్రభుత్వం ఇప్పటికే యాక్టివేట్ చేసినట్లు ఓ జాతీయ మీడియా సంస్థ కథనం వెల్లడించింది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన 'స్ట్రెట్ ఆఫ్ హార్ముజ్' మార్గంలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్న నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. వాస్తవానికి గతంలో 'స్ట్రెట్ ఆఫ్ హార్ముజ్' మార్గం గుండా భారత్ 40శాతం చమురును దిగుమతి చేసుకునేది. ఈ మిడిల్ ఈస్ట్ దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు భారత్ వ్యూహాన్ని రూపొందించింది. హార్ముజ్ మార్గం కాకుండా ఇతర ప్రాంతాల నుంచి చమురు దిగుమతులను 60 శాతం నుంచి 70 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం దాదాపు 40 దేశాల నుంచి భారత్ చమురును సేకరిస్తోంది. ఈ కొత్త మార్గం ద్వారా చమురు దిగుమతి చేసుకోవడంతో ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ సంక్షోభం లేదని తెలుస్తోంది. కానీ.. భవిష్యత్తులో యుద్ధం ఇంకా ముదిరితే మాత్రం భారత్‌పై ఎఫెక్ట్ పెద్ద ఎత్తున ఉండబోతోందనే వాదనలూ వినిపిస్తున్నాయి. ఇక ఎల్పీజీ విషయంలో కేంద్రం జాగ్రత్తగా వ్యవహ రిస్తోంది. ఇప్పటికే బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఇటీవల జరిగిన గ్యాస్ ధరలు చాలా స్వల్పమని, ఇక మీద భారీ ధరల పెంపు ఏమీ ఉండబోదని ప్రభుత్వం వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఎక్కడా గ్యాస్ కొరత లేదని, ప్రజల అవసరాలకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

# తిరిగి స్పీకర్ స్థానంలో విధులకు ఓంబిర్లా

- తనకు ఎలాంటి భేదభావాలు లేవని ప్రకటన
- నిబంధనల మేరకే నడుచుకున్నానని వెల్లడి



**న్యూఢిల్లీ, మార్చి12 (జనంసాక్షి)** : విపక్షాలు ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిన నేపథ్యంలో గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తిరిగి స్పీకర్ స్థానంలోకి వచ్చారు. అలాగే ఆయన తన పనితీరుపైనా స్పందించారు. ప్రతి ఎంపీకి లోక్‌సభలో మాట్లాడే అవకాశం కల్పించడానికి తాను ఎల్లప్పుడూ ప్రయత్ని స్తానని అన్నారు. సభ నియమ నిబంధనలకు ఎవరూ అతీతులు కారని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఎంపీల మైక్రోఫోన్లను నియంత్రించాననే ఆరోపణల్లో ఎలాంటి వాస్త వం లేదన్నారు. సభలో ఎవరికీ ప్రత్యేక వెసులు బాట్లు ఉండవు. నిబంధనల ప్రకారమే కార్యక లాపాలు నడుస్తాయి. ప్రధాని, మంత్రులు కూడా ఏవయినా ప్రకటనలు చేయడానికి ముందు సభ నిబంధనల ప్రకారం నోటీసులు ఇవ్వాలి. మైక్రోఫోన్లు ఆన్ లేక ఆఫ్ చేయడానికి స్పీకర్ వద్ద ఎలాంటి బటన్ ఉండదు. ఈ విషయం విపక్ష నేతలకు కూడా తెలుసు. మాట్లాడేం దుకు అనుమతి ఉన్న సభ్యుడికి మాత్రమే మైక్రో ఫోన్ ఆన్ అవుతుంది' అని తనపై విపక్షాలు కొంత కాలంగా చేస్తోన్న విమర్శలకు బిర్లా సమాధానం ఇచ్చారు. రెండ్రోజుల చర్చ అనంతరం బుధవారం సాయంత్రం విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరిగింది. మూజువాణి ఓటుతో అది వీగిపోయింది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన భాజపా ఎంపీ నిశికాంత్ దుబెపై చర్యలు చేపట్టకపోవడం వంటి కారణాలతో విపక్షాలు ఈ అవిశ్వాస తీర్మానాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. తనపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం ప్రక్రియ పూర్తయ్యేవరకు సభకు హాజరుకాకూడదని నిర్ణయించుకున్న స్పీకర్ అది వీగిపోగానే మళ్లీ యథావిధిగా తన బాధ్యతలు చేపట్టారు.

# సమర్థవంతంగా డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ వ్యవస్థను అమలు చేయాలి

- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ పైలెట్ ప్రాజెక్టుగా సంగారెడ్డి జిల్లా



**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 12 (జనంసాక్షి)** : రాష్ట్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ వ్యవస్థను అమలు చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా సంగారెడ్డి జిల్లాలో అమలు చేయనున్నట్లు వెల్లడించారు. గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపకల్పన, అమలు పై రాష్ట్ర, జిల్లా స్థాయి వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమన్వయ సన్నాహాక సమావేశం నిర్వహించారు.రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంగారెడ్డి జిల్లాను డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుకు పైలెట్ జిల్లాగా ఎంపిక చేసిన నేపథ్యంలో, ప్రాజెక్టు అమలు విధానం, ముందస్తు ఏర్పాట్లు, అవసరమైన సాంకేతిక సదుపాయాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్. చొంగ్తు, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో ఉదయ్ కుమార్, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ పైలెట్ ప్రాజెక్టు అమలులో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని మొత్తం 64 ప్రభుత్వ వైద్యశాలల్లో (జీజీహెచ్-1, ఏరియా ఆసుపత్రులు-4, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు-5, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు-4, ప్రైమరీ హెల్త్ సెంటర్లు-31, బస్తీ దవాఖానాలు-19) సేవలు పొందేందుకు వచ్చే ప్రతి రోగికి సంబంధించిన పూర్తి ఆరోగ్య వివరాలతో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్‌ను రూపొందించి డిజిటల్ హెల్త్ కార్డు జారీ చేయడానికి కసరత్తును ప్రారంభించాలని మంత్రి ఆరోగ్యశాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. రోగి ఆసుపత్రికి వచ్చిన మొదటి దశ నుంచి చికిత్స పూర్తయ్యే వరకు ఓపీ, మెడికల్ ఆఫీసర్, ల్యాబ్, ఫార్మసీ వంటి అన్ని విభాగాల్లో రోగి వైద్య చరిత్రను డిజిటల్ రూపంలో నమోదు చేసే విధంగా అవసరమైన ఐటీ సదుపాయాలు, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, అవసరమైన సిబ్బందిని అందుబా టులో ఉంచాలని మంత్రి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు సూచించారు. డిజిటల్ హెల్త్ కార్డు ద్వారా రోగి పూర్తి వైద్య చరిత్ర డిజిటల్ రూపంలో అందుబాటులో ఉండటం వల్ల వైద్యులు తక్షణమే సరైన చికిత్స అందించ డానికి సౌలభ్యం కలుగుతుందని మంత్రి తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రు లలో అందిస్తున్న ఎన్‌సీడీ, కమ్యూనికేబుల్ డిసీజెస్, ఎంసిహెచ్, చైల్డ్ హెల్త్ సేవలు, క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తించి అవసరమైతే రిఫరల్ సిస్టమ్ ద్వారా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో చికిత్స పొందేందుకు ఇది ఉపయోగ పడుతుందని చెప్పారు. సంగారెడ్డి జిల్లాలో అమలు చేయనున్న ఈ పైలెట్ ప్రాజెక్టును అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని మంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ హెల్త్ కార్డు అమలు కోసం సంగారెడ్డి జిల్లాలో చేపట్టే ఈ పైలెట్ ప్రాజెక్టు ఆదర్శంగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ పైలెట్ ప్రాజెక్టు రూపకల్పనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, డిఆర్‌డిఓ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ జిల్లాలో దారుణ హత్య

- కాంగ్రెస్ నేతను హతమార్చిన సమీప బంధువు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు



**నిజామాబాద్, మార్చి12 (జనంసాక్షి)** : నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఇందల్వాయి మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపీ గురువారం దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లాలోనే కాకుండా తెలంగాణ రాజకీయ వర్గాల్లో కూడా తీవ్ర చర్చకు దారితీసింది. కుటుంబ రాజకీయ విభేదాలు ఈ హత్యకు కారణంగా తెలుస్తోంది. ముఖ్యంగా గ్రామస్థాయి రాజకీయాల్లో పెరిగిన విభేదాలు చివరకు రక్తపాతం వరకు వెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం లో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. కాంగ్రెస్‌లో కీలక నేతగా గుర్తింపు పొందిన ఇమ్మడి గోపీపై ఆయనకు బంధువైన సతీశ్ దాడి చేశాడు. ముందుగా కారుతో గుద్ది, అనంతరం కత్తితో దాడి చేసి గోపీని హత్య చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ దాడిలో తీవ్ర గాయాల కారణంగా గోపీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన అనంతరం సతీశ్ నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగి పోయాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభిం చారు. సతీశ్, ఇమ్మడి గోపీకి వరుసకు మేనల్లుడు. ఒకే కుటుంబానికి చెందిన వారైనా, గ్రామ రాజకీయాల్లో ఏర్పడిన విభేదాలు వారిద్దరి మధ్య తీవ్ర శత్రుత్వంగా మారాయి. గ్రామంలో రాజకీయంగా ఇద్దరూ ప్రభావం చూపే స్థాయిలో ఉండటంతో, కాలక్రమేణా వీరి మధ్య విభేదాలు పెరిగాయి. ముఖ్యంగా గ్రామ సర్పంచ్ ఎన్నికల తర్వాత ఈ విభేదాలు మరింత తీవ్రమయ్యాయని స్థానికులు చెబుతున్నారు. గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గౌరవరం గ్రామంలో సర్పంచ్ పదవికి ఇమ్మడి గోపీ భార్య పోటీ చేసి విజయం సాధించారు. అదే ఎన్నికల్లో సతీశ్ భార్య కూడా సర్పంచ్ పదవికి పోటీ చేశారు. అయితే ఆ ఎన్నికల్లో ఆయన భార్య ఓడిపోయారు. అప్పటి నుంచి రెండు కుటుంబాల మధ్య రాజకీయంగా తీవ్రమైన విభేదాలు మొదలయ్యాయి. గ్రామ రాజకీయాల్లో ఆధిపత్యం కోసం ఇరువర్గాల మధ్య తరచూ గొడవలు జరిగేవని తెలుస్తోంది. సర్పంచ్ ఎన్నికల ఫలితాల తర్వాత పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. చిన్న చిన్న విషయాలపై కూడా ఇరువర్గాల మధ్య తగాదాలు జరిగేవని సమాచారం. ఇమ్మడి గోపీ హత్యతో గౌరవరం గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఘటన తెలిసిన వెంటనే గ్రామానికి పెద్దఎత్తున పోలీసులు చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గ్రామంలో భద్రతను పెంచారు. స్థానికంగా గోపీ కీలక నాయకుడిగా గుర్తింపు పొందారని ఆయన అనుచరులు చెబుతున్నారు. గోపీ మరణంతో గ్రామ ప్రజలు కూడా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. హత్య చేసిన తర్వాత సతీశ్ పోలీసులకు లొంగిపోయాడు. ఆ తర్వాత అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. హత్యకు అసలు కారణాలు ఏమిటి..?, ముందుగా ప్రణాళికతోనే గోపీని హత్య చేశాడా..? అనే పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమికంగా చూస్తే కుటుంబ రాజకీయ విభేదాలే ఈ హత్యకు ప్రధాన కారణంగా పోలీసులు భావిస్తున్నారు. అయితే పూర్తి వివరాలు దర్యాప్తు తర్వాతే వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ఉద్యోగం వచ్చేవరకు భార్యకు చేదోడువాదోడు

- ఎక్సైజ్ సిఐగా ఎన్నికయ్యాక భర్తకు వేధింపులు
- భార్య వేధింపులు తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య
- నేరెడ్ మెట్ పరిధిలో ఘటన.. పోలీసులు దర్యాప్తు

**హైదరాబాద్, మార్చి12 (జనంసాక్షి)** : భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం సృష్టించింది. నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనగర్‌కు చెందిన నగెల్లి శ్రీనివాస్(41) ఓ ప్రైవేట్ ఉద్యోగి. అతని స్వగ్రామం మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపూర్. శ్రీనివాస్ 2012లో జ్యోతిని పెళ్లి చేసుకున్నాడు. ఈ దంపతులకు ఓ కుమారుడు ఉన్నాడు. భార్య గ్రూప్స్ పరీక్షలకు ప్రీపేర్ అయ్యేందుకు భర్త శ్రీనివాస్ చాలా హెల్ప్ చేశాడు. భర్త సహాయంతో జ్యోతి గ్రూప్స్‌లో విజయం సాధించి ఎక్సైజ్ సీఐగా నియమితులయ్యింది. ఉద్యోగం వచ్చిన తర్వాత భర్తను దూరం పెట్టడం స్టార్ట్ చేసింది. అంతే కాదు.. భర్తపై వరకట్నం వేధింపులు, విడాకుల కేసులు పెట్టింది. వేధింపులకు పాల్పడటంతో శ్రీనివాస్ తట్టుకోలేక పోయాడు. తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 'భార్య వేధింపులు, కేసుల కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నాను' అని సూసైడ్ నోట్ రాశాడు. శ్రీనివాస్ సోదరుడు శివకృష్ణ ఇంటికి వచ్చి చూడగా అతను మృతిచెందినట్లు గుర్తించాడు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సోదరుడి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్ భార్య జ్యోతి సహా మరో 10 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## అంబర్‌పేటలో కల్తీ పెరుగు స్వాధీనం

**హైదరాబాద్, మార్చి12 (జనంసాక్షి)** : కల్తీ జాబితాలో పెరుగు కూడా చేరింది. నగరంలోని అంబర్ పేటలో 2,500 కిలోల కల్తీ పెరుగు ను అధికారులు స్వాధీనం చేసుకు న్నారు. పాలలో కాస్టిక్ సోడా వినియో గించి పెరుగు తయారు చేస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. అంబర్‌పేట పోలీసులు, ఖైరతాబాద్ టాస్క్‌ఫోర్స్, జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు కలిసి ఈ తనిఖీలు చేపట్టారు. పెరుగు శాంపిళ్లను ల్యాబ్‌కు పంపారు. పెరుగు తయారీదారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

## ఆర్మూర్ స్టేషన్‌లో అగ్నిప్రమాదం

- అగ్నికి ఆహుతైన వాహనాలు



**నిజామాబాద్, మార్చి12 (జనంసాక్షి)** : నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో గతంలో పోలీసులు సీజ్ చేసిన దాదాపు 50 బైకులు, ఆటోలు, కార్లు దగ్ధమయ్యాయి. చెత్తను తగల బెట్టడంతో వాహనాలకు నిప్పు అంటుకున్నట్లు సమాచారం. అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలను అదుపు చేస్తున్నారు

# గ్యాస్ కొరతతో హోటళ్లు మూత

- ఆర్టీసీ క్రాస్‌రోడ్ బావర్చి మూసివేత
- ప్యారడైజ్ హోటల్ కూడా అదే దుస్థితి
- బ్లాక్ విక్రయాలపై కఠిన చర్యలు తప్పవు : అధికారులు




**హైదరాబాద్, మార్చి12 (జనంసాక్షి)** : వంటగ్యాస్ కొరత హోటల్ పరిశ్రమను అతలాకుతలం చేస్తోంది. ఇక్కడ హాస్టళ్లో ఉంటూ చదువుకుంటున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే దుర్భర పరిస్థితి నెలకొంది. అలాగే హోటల పరిశ్రమపై ఆధారపడ్డ నిరుద్యోగులు కూడా ఆందోళన చెందుతున్నారు. మహానగరంలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిచిపోయింది. వంటగ్యాస్ సిలిండర్ల సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె. శ్రీనివాస్ తెలిపారు. సిలిండర్లను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయిల్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేశామని, ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. నెలకు ఒక సిలిండర్ బుకింగ్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పశ్చిమాసియా యుద్ధం పీజీ యజమానుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. ఓవైపు గ్యాస్ కొరతతో నగరంలోని పలు హోటళ్లను తాత్కాలికంగా మూసేస్తుంటే, మరోవైపు హాస్టళ్ల నిర్వహణపై యజమానులు మల్లగుల్లాలుపడుతున్నారు. కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ల సరఫరా బుధవారం నుంచి నగరంలో దాదాపుగా ఆగిపోవడంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారింది.గ్యాస్ వినియోగం ఎక్కువ అయ్యే దోసె, పూరీ, చపాతీ వంటకాలను తాత్కాలికంగా అన్ని హాస్టళ్లలో నిలిపివేసినట్లు సమాచారం. గ్యాస్ కొరత తీరేవరకు అన్నం, సాంబారు, కూరతో సాధారణ భోజనాన్ని మాత్రమే అందించగలమని ఐటీకారిడార్‌లోని హాస్టల్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ప్రకటించారు. చికెన్, కోడిగుడ్డుకూర, వేపుళ్లు వంటి అదనపు వంటలను నిలుపుదలచేస్తున్నట్లు తెలిపారు. టీ, కాఫీ లాంటివాటిని అందించలేమని వెల్లడిస్తున్నారు. గ్రేటర్ పరిధిలో మూడు, నాలుగు రోజులుగా సిలిండర్ల బుకింగ్ కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. సర్వర్ డౌన్‌తో బుకింగ్ కావడం లేదంటున్నారు. వాట్సాప్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం ఉన్నా కావడం లేదంటున్నారు.ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని బావర్చి హోటల్‌ను బుధవారం మూసేశారు. గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగానే మూసేసిన్నట్లుగా తెలిసింది. ప్రముఖ ప్యారడైజ్ హోటల్స్ అన్ని బ్రాంచీలలో టీ అమ్మకాలను నిలిపివేశారు. ఐటీసీ సంస్థ కూడా వివిధ ప్రాంతాల్లో గల సంస్థ హోటల్స్‌లో గ్యాస్ కొరత కారణంగా లంచ్, డిన్నర్ ఉండదని ప్రకటించింది. ఒకవేళ దొరికినా కొన్ని ప్రాంతాల్లో రూ. 4 వేలకు, మరికొన్ని ప్రాంతాల్లో రూ. 3,500కు విక్రయిస్తున్నారు. 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర సాధారణంగా రూ.2105ల వరకు ఉంది. బుధవారం నుంచి కమర్షియల్ సిలిండర్ల సరఫరా పూర్తిగా బంద్ అయింది. పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో కూడా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను నిలిపివేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా లేకపోవడం, మార్కెట్‌లో అధిక ధర ఉండడంతో కొనుగోలు చేయలేక పలు హోటల్స్ మూత పడుతున్నాయి. సిలిండర్ కొరతతో హోటల్స్ మూసేస్తున్నట్లు యజమానులు ప్రకటించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370